ప్రభాతనవ

SINGIDI | తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

శుక్రవారం 31 జులై 2026 సంపుటి: 1 సంచిక: 44 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## ఇరాన్‌కు చైనా క్షిపణులు

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అసంతృప్తి



అగ్రరాజ్యం అమెరికా విమానాలు, హెలికాప్టర్ల కు తలనొప్పిగా మారుతున్న కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. వీటి రవాణాకు పాకిస్థాన్ ను మార్గంగా ఎంచుకున్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దాంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై అసంతృప్తి వ్యక్తంచేశారు. **న్యూఢిల్లీ (సింగిడి)**

2



2

## హసీనాను వదలం

**దేశంలో అడుగుపెట్టగానే అరెస్ట్ చేస్తాం**

**బంగ్లాదేశ్ ప్రభుత్వం హెచ్చరిక**

## పశ్చిమాసియా సంక్షోభంపై కేంద్రం అలర్ట్

**ఇంధన భద్రత, భారతీయుల రక్షణపై మోదీ కీలక ఆదేశాలు**

**పశ్చిమాసియా పరిస్థితిపై నాలుగోసారి కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ సమావేశం**

**ఇంధనం, ఎరువుల సరఫరాపై సమీక్ష, సముద్ర నావికుల భద్రతకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచన**

2



### ఫార్ములా–ఈ కేసు

## నేడు కోర్టుకు కేటీఆర్

### మరోసారి తెరపైకి ఫార్ములా ఈ కార్‌రేస్ కేసు

**ఏసీబీ ప్రత్యేక కోర్టు మే 14న సమన్లు జారీ.. కేసులో ఏ1గా ఉన్న కేటీఆర్**

ఫార్ములా ఈ కార్ రేస్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. ఫార్ములా ఈ–కారు రేసు కేసు విచారణలో భాగంగా మాజీ మంత్రి,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరుకానున్నారు. ఈ కేసులో ట్రయల్ ప్రారంభం కానుండటంతో కోర్టు ఆదేశాల మేరకు ఆయన వ్యక్తిగతంగా హాజరవుతున్నారు.

**హైదరాబాద్, జులై 30 (సింగిడి)**



2



**విద్యార్థులను వేధిస్తే మళ్లీ**

## ఆందోళన తప్పదు

**మోదీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి**

**ప్రధాని పదవికి మోదీ రాజీనామా చేస్తేనే మంచిది**

**కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక**

2

### విద్యాశాఖకు నేనెందుకు

## రాజీనామా చేయాలి?

### '2034 వరకు నేనే సీఎం': రేవంత్ రెడ్డి

**ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార బాధ్యత తాను తీసుకుంటానన్న సీఎం రేవంత్**

**విద్యకోసం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధమని వెల్లడి**

**ఏడాదికి 10 నుంచి 12 మంది టీచర్లను విదేశాలకు పంపిస్తామని స్పష్టీకరణ**



2

ఆర్థిక సమస్యలు వెనకబాటుతనానికి కారణం కావటం లేదని, కేవలం విద్య లేకపోటవమే కారణమవుతోందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఐదేళ్ల పాటు ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధికోసం కృషి చేయాలని ఉపాధ్యాయుల బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. మండల స్థాయిలో పాఠశాలల సమస్యలను ఉపాధ్యాయ సంఘాలు డిసెంబర్ నాటికి ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు.

**- హైదరాబాద్, జులై 30 (నినాదం)**

### కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు

## సబ్సిడీపై విత్తనాలు

### సీఎం రేవంత్ రెడ్డి

2

**ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ చర్యలపై సీఎంకు అందిన నివేదిక -**

**సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిక సమర్పించిన నిపుణుల కమిటీ ఛైర్మన్ చిన్నారెడ్డి**

**ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు నివేదికలో నిపుణుల కమిటీ పలు సూచనలు**

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ



2

## రాజకీయశక్తిగా

# యువశక్తి సాధ్యమేనా?

### 21 ఏళ్లకే ఎన్నికల అర్హత ప్రతిపాదన... యువత రాజకీయ ప్రవేశానికి అవకాశం

### వారసత్వ రాజకీయాలపై ఆందోళనలు.. పరిణతి-ప్రాతినిధ్యంపై జాతీయ చర్చ

*మొక్కై వంగనిది మానై వంగదు అంటారు... అదే సమయంలో చిన్న వయసే పెద్ద మార్పులకు నాంది అని కూడా చెబుతారు. రాజకీయాల్లో పోటీ చేసే కనీస వయస్సును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదన దేశవ్యాప్తంగా రాజకీయ, సామాజిక చర్చకు దారితీసింది. ఒకవైపు యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాలనే వాదన వినిపిస్తుండగా, మరోవైపు రాజకీయ పరిణతి, అనుభవం, ఎన్నికల వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారతదేశ రాజకీయ వ్యవస్థ, యువ నాయకత్వ చరిత్ర, వివిధ పార్టీల విధానాలను పరిశీలిస్తే ఈ ప్రతిపాదనపై అనేక కోణాలు కనిపిస్తున్నాయి.*

**- హైదరాబాద్ బ్యూరో - సింగిడి**



**21 ఏళ్ల వయస్సు... ప్రాక్టికల్ సవాళ్లు**

21 సంవత్సరాల వయస్సు సాధారణంగా ఉన్నత విద్య పూర్తి చేసి ఉద్యోగం లేదా కెరీర్ వైపు అడుగులు వేసే దశ. అలాంటి సమయంలో నేరుగా ఎమ్మెల్యే లేదా ఎంపీగా ఎన్నికల్లో పోటీ చేయడం ప్రాక్టికల్‌గా ఎంతవరకు సాధ్యమనే ప్రశ్న తలెత్తుతోంది. చట్టసభల్లో చట్టాల రూపకల్పన, ప్రజా సమస్యలపై నిర్ణయాలు తీసుకోవాలంటే సామాజిక అవగాహన, పరిపాలనా అనుభవం, రాజకీయ పరిణతి అవసరమని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో ఎన్నికల వ్యయం, ఆర్థిక స్వావలంబన లేకపోవడం వల్ల యువ అభ్యర్థులు కుటుంబాలు లేదా రాజకీయ పార్టీలపైనే ఆధారపడే పరిస్థితి ఏర్పడే అవకాశముందని చెబుతున్నారు. దీంతో స్వతంత్ర నిర్ణయాల కంటే రాజకీయ బానిసత్వం పెరిగే ప్రమాదం ఉందనే వాదన వినిపిస్తోంది.

**వారసత్వ రాజకీయాలకు అవకాశం**

కనీస వయస్సు తగ్గించినా సాధారణ యువత కంటే రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలకు చెందిన వారికే ఎక్కువ ప్రయోజనం చేకూరే అవకాశం ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. పార్టీల్లో ఇప్పటికే ప్రభావం ఉన్న కుటుంబాలకు చెందిన యువ నాయకులు సులభంగా టికెట్లు పొందే అవకాశం ఉండగా, సాధారణ యువతకు అవకాశాలు ఎంతవరకు దక్కుతాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ ప్రతిపాదన నిజంగా యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తుందా, లేక వారసత్వ రాజకీయాలకు కొత్త దారి తీస్తుందా అనే చర్చ కొనసాగుతోంది.

**పార్టీల చరిత్ర ఏం చెబుతోంది**


భారతదేశంలో ఇప్పటివరకు ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా పెద్ద ఎత్తున 21 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు గల యువతకు ఎమ్మెల్యే లేదా ఎంపీ టికెట్లు ఇచ్చిన దాఖలాలు ఎక్కువగా కనిపించవు. అయితే కొన్ని ప్రత్యేక సందర్భాల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించిన ఉదాహరణలు ఉన్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి, సామాజిక ఉద్యమాల నుంచి వచ్చిన యువ నాయకులకు ఢిల్లీ, పంజాబ్ ఎన్నికల్లో అవకాశాలు కల్పించింది. రాఘవ్ చద్దా 26 ఏళ్లకే కీలక రాజకీయ బాధ్యతలు చేపట్టి, 33 ఏళ్ల వయస్సులో రాజ్యసభ సభ్యుడిగా ఎంపికయ్యారు. 1983లో ఎన్టీఆర్ నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ విద్యావంతులైన యువతకు అవకాశాలు కల్పించింది. బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలు కూడా తమ విద్యార్థి విభాగాల నుంచి ఎదిగిన నాయకులకు స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికల్లో అవకాశాలు కల్పిస్తున్నప్పటికీ, రాజ్యసభ, ఎమ్మెల్సీ వంటి పదవులకు సాధారణంగా అనుభవజ్ఞులకే ప్రాధాన్యం ఇస్తున్నాయి.

**పిన్న వయసులోనే ప్రజాప్రతినిధులు**

ప్రస్తుతం భారత రాజ్యాంగం ప్రకారం ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ చేయడానికి కనీస వయస్సు 25 సంవత్సరాలు. ఈ నిబంధన ...మిగతా 2లో

## పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం

### రాజ్యసభలోనూ ఆమోదం పొందిన బిల్లు




2

**రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే అమల్లోకి చట్టం**

**గరిష్ఠంగా రూ.10 కోట్ల జరిమానా**

**సమగ్ర సంస్కరణలపై కొనసాగుతున్న డిమాండ్**

దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, పేపర్ లీక్‌లను అరికట్టడం లక్ష్యంగా తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు–2026కు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లుకు గురువారం రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రపతి అంగీకారం లభించగానే ఇది చట్టంగా అమల్లోకి రానుంది. **న్యూఢిల్లీ (సింగిడి)**

### పేపర్ లీక్ ముఠాలను ఇక సహించేది లేదు

**ఇన్‌స్టాలో మోదీ కొత్త సందేశం**

**స్వాగతించిన ప్రధాని నరేంద్ర మోదీ**

**పేపర్ లీక్ మాఫియాపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టీకరణ**






### బస్ టికెట్‌తో పాటే

## ఆటో బుకింగ్

2

### టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సేవలు

**తక్కువ ఛార్జీలతో ఎలక్ట్రిక్ ఆటోలు**

**ప్రయాణికుల కోసం 'ఫస్ట్ మైల్, లాస్ట్ మైల్' కనెక్టివిటీకి ఆర్టీసీ శ్రీకారం**

**ఇంటి నుంచి బస్టాప్‌కు, బస్టాప్ నుంచి గమ్యానికి ఈ-ఆటో సేవలు**

**బస్ టికెట్‌తో కలిపి ఆటో రైడ్ బుక్ చేసుకునే ప్రత్యేక సౌకర్యం**

**మొదట హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా, తర్వాత ఇతర నగరాలకు**

**ప్రైవేట్ యాప్‌ల కన్నా తక్కువ ఛార్జీలతో సేవలు అందించేలా ప్రణాళిక**

## సీదిరితో జగన్ ములాఖత్ రద్దు

**సాయంత్రం 5 తరవాత జైలు వద్దకు జగన్**

**నిబంధనల మేరకు ములాఖత్ కుదరదని తేల్చిన సిబ్బంది**

వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో వైఎస్ జగన్ ములాఖత్‌కు జైలు అధికారులు అనుమతి నిరాకరించారు. నిర్ణయించిన సమయం ముగిసిన తర్వాత జైలు వద్దకు చేరుకోవడంతో, జైలు నిబంధనల ప్రకారం అధికారులు అనుమతి ఇవ్వలేదు. సాయంత్రం 5 గంటల తర్వాత సీదిరి అప్పలరాజును కలిసేందుకు వైసీపీ నేతలు అనుమతి కోరారు.

**శ్రీకాకుళం, జూలై30 (సింగిడి)**



2

## బాధితుల్ని గాలికొదిలేసి.. నిందితుడి కుటుంబానికి పరామర్శనా?



2

**జగన్‌పై లోకేష్ ఆగ్రహం**

**హిట్ అండ్ రన్ కేసులో జగన్ తీరుపై మంత్రి లోకేష్ ఆగ్రహం**

**శ్రీకాకుళం పర్యటనలో మాజీ మంత్రి అప్పలరాజు కుటుంబాన్ని కలిసిన జగన్**

ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
31 జులై 2026

# విద్యాశాఖకు నేనెందుకు రాజీనామా చేయాలి?

2034 వరకు తానే సీఎంగా ఉంటానన్న రేవంత్ రెడ్డి మధ్యతరగతి నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలలో చదివి తాను సీఎం అయ్యానని గుర్తుచేశారు. ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో విద్యా విధానాలు, పాఠశాలలు అవలంభిస్తున్న విధానాలను స్టడీ చేసి వచ్చిన ఉపాధ్యాయులతో సీఎం ఇంటరాక్ట్ అయ్యారు. విద్యలో నాణ్యత పెరగాలి : ప్రపంచంతో పోటీ పడాలంటే విద్యలో నాణ్యత పెరగాలని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ఇటీవల జర్మనీ, ఫిన్లాండ్ దేశాల్లో పర్యటించి అక్కడి విద్యా వ్యవస్థను స్టడీ చేసి వచ్చిన ఉపాధ్యాయులతో సీఎం మాట్లాడారు. ఈసందర్భంగా ఆయా దేశాల్లో తమ అనుభవాలను ఉపాధ్యాయులు పంచుకున్నారు. అక్కడ అవలంభిస్తున్న విధానాలు, అవి మన రాష్ట్రంలో అందిపుచ్చుకునేందుకు ఉన్న అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి పన్నెండో తరగతి వరకు విద్యార్థులకు ప్రపంచ జ్ఞానం నేర్పాలన్నారు. తాను మిడిల్ క్లాస్ అని తెలిపిన సీఎం, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఏం చేస్తారని ఎవరైనా ప్రశ్నిస్తే తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతా అని జవాబు ఇవ్వాలని అందుకు తానే ఉదాహరణ అని అభివర్ణించారు. ఆస్తులు లేకపోవటం వెనకబాటు తనం కాదని విద్య లేకపోవటమే అసలైన వెనకబాటు తనానికి కారణం అని తాము చేపట్టిన సామాజిక, ఆర్థిక , విద్యా, ఉపాధి, కుల సర్వేలో తేలిందని వివరించారు.



విద్యార్థుల భవిష్యత్ కోసమే విద్యాశాఖ తీసుకున్నా : అధికారం, ఓట్లు ఎక్కువగా ఇచ్చే శాఖలపైనే సాధారణంగా అందరికీ మక్కువ ఉంటుందని ఓట్లు రావని తెలిసినా విద్యార్థుల భవిష్యత్తు, సమాజంలో మార్పు కోసమే తాను విద్యా శాఖ తీసుకున్నానని సీఎం పేర్కొన్నారు. ప్రపంచంతో తెలంగాణ విద్యార్థులు పోటీ పడాలన్నదే లక్ష్యమన్నారు. అయితే కొందరు విద్యాశాఖకు మంత్రి లేదని త్వరగా ఆ శాఖకు ఓ మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారన్న సీఎం, అయితే ఏ కారణంతో తాను విద్యాశాఖకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. గవర్నమెంట్ స్కూల్స్ లో చేరుతున్న వారి సంఖ్య పెంచినందుకా? లేక విద్యార్థులకు అల్పాహార పథకం తీసుకు వచ్చినందుకు రాజీనామా చేయాలా అని మండిపడ్డారు.

2034 వరకు నేనే ముఖ్యమంత్రి : 2034 వరకు తెలంగాణ తానే సీఎంగా ఉంటానన్న రేవంత్ రెడ్డి రానున్న ఐదేళ్లపాటు ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలనికోరారు. ఉపాధ్యాయులు పిల్లల కోసం కష్టపడాలని ఉపాధ్యాయుల సమస్యలను తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామని భవిష్యత్తులోనూ వారి సమస్యల పరిష్కారానికి ఎప్పుడు కట్టుబడి ఉంటామన్నారు.

మండల స్థాయిలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు మండలం ఒక యూనిట్ గా డిసెంబర్ నాటికి ఉపాధ్యాయ సంఘాలు, ఎంఈఓలు నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ఇందుకోసం ఓ వెబ్ సైటని ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఏటా పది నుంచి 15 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని విదేశాలకు పంపి అక్కడి విధానాలను అధ్యయనం చేయిస్తామని సీఎం పేర్కొన్నారు.

# రాజకీయశక్తిగా యువశక్తి సాధ్యమేనా?

మొదటి పేజీ తరువాయి

ప్రకారమే ఒడిశాకు చెందిన చంద్రాణి ముర్ము 25 సంవత్సరాల 11 నెలల వయస్సులో లోక్‌సభకు ఎన్నికై అత్యంత పిన్న వయస్కురాలైన ఎంపీల్లో ఒకరిగా నిలిచారు. హర్యానాకు చెందిన దుష్యంత్ చౌతాలా 26 ఏళ్లకే ఎంపీ అయ్యారు. గౌరవ్ గొగోయ్, అఖిలేష్ యాదవ్ వంటి నాయకులు కూడా యువ వయస్సులోనే రాజకీయాల్లో కీలక స్థానాలకు చేరుకున్నప్పటికీ, వీరికి రాజకీయ నేపథ్యం ఉన్న విషయం విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

**ప్రతిపాదనకు అనుకూల వాదనలు**

ఈ ప్రతిపాదనను సమర్థించే వారు 18 ఏళ్లకే ఓటు హక్కు ఉన్నప్పుడు, 21 ఏళ్లకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఎందుకు ఉండకూడదని ప్రశ్నిస్తున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి కొన్ని దేశాల్లో తక్కువ వయస్సులోనే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉందని ఉదాహరణగా చూపుతున్నారు. భారతదేశంలో గ్రామ సర్పంచ్, మున్సిపల్ కౌన్సిలర్, కార్పొరేటర్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇప్పటికే 21 ఏళ్ల కనీస వయస్సు అమల్లో ఉందని, స్థానిక సంస్థల్లో అవకాశం ఉన్నప్పుడు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఎందుకు ఉండకూడదనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యువజన సంఘాల ప్రధాన వాదనగా పేర్కొంటున్నారు.

**అవకాశం ఉంటే సరిపోతుందా?**

ప్రాక్టికల్‌గా చూస్తే 21 ఏళ్ల వయస్సులో నేరుగా ఎమ్మెల్యే లేదా ఎంపీ కావడం సవాళ్లతో కూడుకున్నదే. అయితే చట్టబద్ధంగా వయస్సును 21 సంవత్సరాలకు తగ్గిస్తే రాజకీయాల్లోకి రావాలనుకునే ప్రతిభావంతులైన, విద్యావంతులైన యువతకు అవకాశం విస్తరించే వీలుంటుంది. అదే సమయంలో ఈ మార్పు నిజంగా యువ నాయకత్వానికి ఉపయోగపడాలంటే రాజకీయ పార్టీలు వారసత్వానికి కాకుండా సామర్థ్యానికి ప్రాధాన్యం ఇచ్చి సాధారణ యువతకు కూడా సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ప్రతిపాదనపై తుది నిర్ణయం ఏదైనా అయినా, యువతకు ప్రాతినిధ్యం, రాజకీయ పరిణతి, ప్రజాస్వామ్య భాగస్వామ్యం మధ్య సమతుల్యత ఎలా ఉండాలన్నదే అసలు చర్చగా నిలుస్తోంది.

# పశ్చిమాసియా సంక్షోభంపై కేంద్రం అలర్ట్

దేశ ప్రయోజనాలు, ఇంధన భద్రత, విదేశాల్లోని భారతీయుల రక్షణకు ఎలాంటి ఆటంకం కలగకుండా కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు వేగవంతం చేసింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఢిల్లీలో కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సీసీఎస్) నాలుగో ప్రత్యేక సమావేశానికి అధ్యక్షత వహించారు. ప్రస్తుత భౌగోళిక–రాజకీయ పరిస్థితులు, వాటి ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉండొచ్చన్న అంశాలపై సమగ్రంగా చర్చించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా హోల్ ఆఫ్ గవర్నమెంట్ విధానాన్ని కొనసాగించాలని ప్రధాని స్పష్టం చేశారు. సమావేశంలో కేబినెట్ కార్యదర్శి ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులపై వివరించారు. ముఖ్యంగా పశ్చిమాసియా ఘర్షణలు, ఎర్ర సముద్రం, హార్మూజ్ జలసంధి, గల్ఫ్ ఆఫ్ ఏడెన్, బ్లాక్ సీ ప్రాంతాల్లో నెలకొన్న భద్రతా సమస్యలు భారత దిగుమతులు, సరఫరా వ్యవస్థపై చూపుతున్న ప్రభావాన్ని వివరించారు. ఈ నేపథ్యంలో పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్ఎన్‌జీ, ఎల్‌పీజీ, ఎరువుల సరఫరా అంతరాయం లేకుండా కేంద్రం చేపట్టిన చర్యలను కూడా వివరించారు. ప్రస్తుతం దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు, సరఫరా పరిస్థితి సంతృప్తికరంగానే ఉందని సమావేశంలో వెల్లడించారు. ముడి చమురు లభ్యత సమృద్ధిగా ఉండటంతో ప్రభుత్వ రంగ రిఫైనరీలు 100 శాతానికి పైగా సామర్థ్యంతో పనిచేస్తున్నాయని తెలిపారు. దీంతో పెట్రోల్, డీజిల్ తదితర ఇంధన ఉత్పత్తుల తయారీ నిరంతరాయంగా కొనసాగుతోందని వివరించారు.

**ఎల్‌పీజీపై కేంద్రం ప్రత్యేక దృష్టి**

ఎల్‌పీజీ సరఫరాపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఒకే దేశంపై ఆధారపడకుండా ఎల్‌పీజీ కొనుగోలు వనరులను ఇప్పటికే విస్తరించినట్లు అధికారులు తెలిపారు. అదే సమయంలో దేశవ్యాప్తంగా పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) కనెక్షన్ల విస్తరణకు చర్యలు చేపట్టడంతో గ్యాస్ వినియోగం పెరుగుతోందని వెల్లడించారు. జాతీయ గ్యాస్ గ్రిడ్ విస్తరణ, ఎల్ఎన్‌జీ దిగుమతుల సామర్థ్య పెంపు, సిటీ గ్యాస్ పంపిణీ వ్యవస్థ విస్తరణ, పైప్‌లైన్ మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధి వంటి చర్యల ద్వారా ఎల్‌పీజీపై ఆధారాన్ని క్రమంగా తగ్గించే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని సమావేశంలో చర్చించారు.

రాబోయే రబీ సీజన్‌కు అవసరమైన ఎరువుల లభ్యతపైనా ప్రధాని ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. అవసరమైన ఎరువుల నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ దిగుమతి వనరులను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువుల సరఫరా నిరంతరాయంగా కొనసాగాలని స్పష్టం చేశారు. పశ్చిమాసియా ఘర్షణల ప్రభావం సముద్ర రవాణాపైనా పడుతున్న నేపథ్యంలో దేశీయ, విదేశీ నౌకల్లో పని చేస్తున్న భారతీయ నావికుల భద్రతపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఘర్షణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సముద్ర నావికులకు, వారి కుటుంబాలకు అవసరమైన సమాచారం, అత్యవసర సహాయం, మానసిక పరామర్శ అందించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీ అధికారులను ఆదేశించారు.

**ఇంధన వనరులపై మరింత దృష్టి**

విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రత కూడా కేంద్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య అంశమని ప్రధాని స్పష్టం చేశారు. పశ్చిమాసియా దేశాల్లో నివసిస్తున్న భారతీయుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు సూచించారు. దీర్ఘకాలిక ఇంధన భద్రత సాధించాలంటే పునరుత్పాదక ఇంధన వనరులపై మరింత దృష్టి పెట్టాలని కూడా ప్రధాని పేర్కొన్నారు. ముఖ్యంగా సౌరశక్తి, ఇతర శిలాజ ఇంధనేతర వనరుల వినియోగాన్ని వేగంగా పెంచడం ద్వారా విదేశీ ఇంధనంపై ఆధారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్, షిప్పింగ్ మంత్రి సర్బానంద సోనోవాల్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్పూరీ హాజరయ్యారు. ఆయా శాఖలు తీసుకుంటున్న చర్యలపై మంత్రులు ప్రధానికి వివరించారు. ప్రస్తుతం భారత ఇంధన అవసరాల్లో 88 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. గతంలో దేశ ఇంధన దిగుమతుల్లో దాదాపు 40 శాతం హార్మూజ్ జలసంధి మార్గం ద్వారానే వచ్చేవి. అయితే ఆ ప్రాంతంలో కొనసాగు

# ఇరాన్‌కు చైనా క్షిపణులు

చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకుపైగా విలువైన 400 షోల్డర్‌ఫైర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం కుదిరింది. వాటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే ఈ డీల్‌కు టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టతలేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేసింది. ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించబోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా చేశారు.

# పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం

కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. చర్చ సందర్భంగా ప్రభుత్వం, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడి వాదనలు జరిగాయి. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికే ఈ సవరణలు తీసుకొచ్చామని ప్రభుత్వం స్పష్టం చేసింది. భారీ జరిమానాలు, ప్రత్యేక కోర్టులు, వేగవంతమైన విచారణలతో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపింది.ఈ సవరణల ప్రకారం పేపర్ లీక్‌లకు పాల్పడిన వారిపై గరిష్ఠంగా రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. జైలు శిక్షతో పాటు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ పూర్తి చేసే నిబంధనలను కూడా చేర్చారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడే ముఠాలపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు ఈ మార్పులు ఉపయోగపడతాయని ప్రభుత్వం పేర్కొంది.2024లో తీసుకొచ్చిన చట్టం అమలులో వచ్చిన అనుభవాల ఆధారంగానే ఈ సవరణలు రూపొందించినట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. ఆ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పారు. పేపర్ లీక్‌ల కారణంగా ఆత్మహత్యల సంఖ్య కూడా తగ్గిందని సభకు వివరించారు. అయితే ప్రతిపక్షం మాత్రం బిల్లుపై విమర్శలు గుప్పించింది. కేవలం శిక్షలు పెంచడం సరిపోదని, పరీక్షల నిర్వహణ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అవసరమని డిమాండ్ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపైనా ప్రశ్నలు లేవనెత్తింది. మరోవైపు విద్యార్థుల ప్రయోజనాల కోసం కేంద్రం వేగంగా చర్యలు తీసుకుందని అధికార పక్షం పేర్కొంది. మాజీ విద్యాశాఖ మంత్రి రాజీనామా, నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించడం వంటి చర్యలను ప్రస్తావించింది.

## పేపర్ లీక్ ముఠాలను ఇక సహించేది లేదు

పబ్లిక్ పరీక్షల్లో పేపర్ లీకులను అరికట్టే సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేసిన ఆయన.. పేపర్ లీక్ మాఫియాపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలన్నీ పేపర్ లీకుల సమస్యను ఎదుర్కొన్నాయని మోదీ గుర్తుచేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగాన్ని పెంచడం, వేగవంతమైన వ్యవస్థలను అమలు చేయడం, పారదర్శకతను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొత్త చట్టంతో పేపర్ లీక్ ముఠాలపై మరిన్ని కఠిన చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు సబ్సిడీపై విత్తనాలు

**హైదరాబాద్, జులై 30 (నినాదం)**

రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు సబ్సిడీపై విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. సుమారు రూ.803కోట్ల రూపాయలతో కార్యచరణ చేపట్టాలని ప్రభుత్వానికి సూచించినట్లు కమిటీ ఛైర్మన్ చిన్నారెడ్డి తెలిపారు. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు చర్యలు : విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలపై ఎక్కువ దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వానికి నిపుణుల కమిటీ సూచనలు : రాష్ట్రంలో ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించిన కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని కమిటీ తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించింది. గ్రామాల వారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. ఈ పంటలకు 75శాతం సబ్సిడీతో విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది. గతేడాది ఈ సీజన్‌లో 79.49 లక్షల ఎకరాలు సాగు చేయగా ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయని నిపుణుల కమిటీ తెలిపింది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3 లక్షల 62 వేల ఎకరాలు, వరి 14 లక్షల 92 వేల ఎకరాల్లో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో పేర్కొంది. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్ప్రింక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. సబ్సిడీ విత్తనాలు ఇచ్చి పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది.

# సీదిరితో జగన్ ములాఖత్ రద్దు

**శ్రీకాకుళం, జులై 30 (సింగిడి)**

ఈ విషయంపై జైలర్.. ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరపగా, జైలు నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని అధికారులు స్పష్టం చేశారు. సాయంత్రం 5 గంటలలోపే ములాఖత్‌కు అనుమతి ఉంటుందని తెలిపారు. దీంతో జగన్ అప్పలరాజు ములాఖత్‌కు అనుమతి లభించలేదు. ఇదేసమయంలో జైలు వద్ద అప్పలరాజు కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు. అంతకుముందు విశాఖ చేరుకున్న జగన్ అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి శ్రీకాకుళం చేరుకున్నారు. ప్రస్తుతం అంపోలు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ఆయన జైలులో ములాఖత్ ద్వారా పరామర్శించాలనుకున్నారు. ఎన్నికల అనంతరం జగన్ శ్రీకాకుళం జిల్లాకు వెళ్లడం ఇదే తొలిసారి కావడంతో వైసీపీ శ్రేణులు ఈ పర్యటనకు ప్రాధాన్యం ఇచ్చాయి. సీదిరి అప్పలరాజు కుమారుడు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనలో, కుమారుడిని కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై పోలీసులు అప్పలరాజును అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జగన్ ఆయనను పరామర్శించడానికి ఇక్కడికి చేరుకున్నారు. భోగాపురం, పూసపాటిరేగ, పైడి భీమవరం, రణస్థలం, ఎచ్చెర్ల మీదుగా అంపోలు జిల్లా జైలుకు చేరుకుని మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు అప్పలరాజుతో ములాఖత్ నిర్వహించాలనుకున్నారు. అయితే, వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో ఆంక్షలు విధించారు పోలీసులు.. జైలు వద్ద ములాఖత్‌కు మాత్రమే పోలీసులు అనుమతి ఇచ్చారు. ర్యాలీలు, భారీ జనసమీకరణకు అనుమతి లేదని శ్రీకాకుళం పోలీసులు స్పష్టం చేశారు. గతంలో క్రౌడ్ గ్యాదరింగ్ సమయంలో చోటుచేసుకున్న ఘటనలు, ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన, శాంతిభద్రతల అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు..అయినా జగన్ సమయానికి అక్కడికి చేరుకోలేక పోయారు.

# బాధితుల్ని గాలికొదిలేసి.. నిందితుడి కుటుంబానికి పరామర్శనా?:

**అమరావతి, జులై 30 (సింగిడి)**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన హిట్ అండ్ రన్ కేసులో బాధితుడి కుటుంబాన్ని విస్మరించి, నిందితుడి కుటుంబ సభ్యులను పరామర్శించడంపై ఆయన మండిపడ్డారు. ఇది పరామర్శ కాదని, నేర పూరిత మనస్తత్వానికి పరాకాష్ట అని లోకేష్ 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. విశాఖ ఉన్న ఏ నాయకుడైనా రోడ్డు ప్రమాదంలో మరణించిన బీసీ సామాజిక వర్గానికి చెందిన గొర్లె కాపారి డి. దానయ్య కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలుస్తారని, అయితే జగన్ మాత్రం బాధితులను వదిలి నిందితుల పక్షాన నిలిచారని లోకేష్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన #PsychoFekuJagan, #YcpCriminalPolitics అనే హ్యాష్‌ట్యాగ్‌లను జత చేశారు. గురువారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన జగన్ మోహన్ రెడ్డి, హిట్ అండ్ రన్ కేసులో సాక్ష్యాలు తారుమారు చేశారన్న ఆరోపణలతో జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుటుంబసభ్యులను కలిసేందుకు వెళ్లారు. అయితే, ఆయన సాయంత్రం 5 గంటల తర్వాత చేరుకోవడంతో జైలు అధికారులు అనుమతించలేదు. దీంతో జైలు వెలుపల అప్పలరాజు కుటుంబ సభ్యులను కలిసి జగన్ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక సాధారణ ప్రమాద ఘటనను హత్య కేసుగా చిత్రీకరిస్తూ ప్రభుత్వం రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. జగన్ చర్యపై లోకేష్ తీవ్రంగా స్పందిస్తూ, "మనస్సాక్షి ఉన్న ఏ నాయకుడైనా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బీసీ సోదరుడు దానయ్య గారి కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలుస్తారు. కానీ హిట్ అండ్ రన్ కేసులో ఒక నిండు ప్రాణం బలైన ఘటనలో మృతుని కుటుంబాన్ని విస్మరించి, నిందితుల కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన జగన్ రెడ్డి తీరు అమానవీయ ప్రవర్తనకు నిదర్శనం. ప్రపంచ రాజకీయ చరిత్రలోనే బాధితులను వదిలేసి, నిందితులకు అండగా నిలిచే రాజకీయం చేయడం బహుశా జగన్ రెడ్డి గారికే చెల్లింది. ఇది పరామర్శ కాదు, నేర మనస్తత్వానికి పరాకాష్ట!" అని దుయ్యబట్టారు.

# బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్..

**- హైదరాబాద్, జులై 30 (నినాదం)**

తెలంగాణలో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా టీజీఎస్ఆర్టీసీ మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. బస్సు ప్రయాణికులకు ఇంటి నుంచి బస్ స్టాప్ వరకు, బస్సు దిగాక గమ్యస్థానం వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణాన్ని కొనసాగించేందుకు 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్' కనెక్టివిటీ విధానాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ కంపెనీలతో ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు కొలిక్కి వచ్చిన వెంటనే ఈ–ఆటోలు రోడ్డెక్కనున్నాయి. ఈ కొత్త విధానంలో ప్రయాణికులు తమ బస్ టికెట్‌ను బుక్ చేసుకునే సమయంలోనే అదనంగా ఆటో రైడ్‌ను కూడా ఒకేసారి బుక్ చేసుకునేలా ప్రత్యేక సౌకర్యం కల్పించనున్నారు. దీని ద్వారా ప్రయాణికులను వారి నివాసం నుంచి సమీప బస్ పాయింట్‌కు, అలాగే బస్సు దిగిన తర్వాత అక్కడి నుంచి వారి చివరి గమ్యస్థానానికి ఈ–ఆటోలు సురక్షితంగా చేరవేస్తాయి. ఫలితంగా ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవడంతో పాటు బస్టాప్‌లకు చేరుకోవడానికి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లడానికి పడే ప్రయాసలు తప్పుతాయి. ఈ ఎలక్ట్రిక్ ఆటో సేవలను ప్రయోగాత్మకంగా తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ లభించే స్పందన, ఫలితాల ఆధారంగా రెండో దశలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు దశలవారీగా విస్తరించాలని యోచిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం నగరంలో అధిక ఛార్జీలతో నడుస్తున్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ రైడ్ హెయిలింగ్ యాప్‌ల కన్నా గణనీయంగా తక్కువ ఛార్జీలతో ఈ సేవలను అందించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ నిర్ణయం వల్ల హైదరాబాద్ శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, ఉప్పల్, మియాపూర్, పటాన్‌చెరు, శంషాబాద్, ఘట్‌కేసర్ వంటి కనెక్టివిటీ సమస్యలున్న ప్రాంతాల ప్రజలకు గొప్ప ఊరట లభించనుంది. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆర్టీసీ ఈ–ఆటోల నిర్ణయం ఒక మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

**దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ**

**భద్రాద్రి కొత్తగూడెం, జులై 30 (సింగిడి)**



పేదలకు ఇంటిచింత లేకుండా చేయాలనే ఇందిరమ్మ ఇళ్లను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. విడతల వారీగా పేదలందరికి ఇంటికలను సాకారం చేస్తామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని, పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని చండ్రుగొండ మండలం మంగయ్య బంజర గ్రామంలో 45 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్, లో – లెవల్ కాజ్‌వేను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. దీంతో రెండు దఫాలుగా ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదవారికి మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. మూడు, నాలుగో విడతలో ప్రతి ఒక్క అర్హుడైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కులం, మతం, పార్టీ అని చూడటం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్న ఈ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

# హసీనాను వదలం

**న్యూఢిల్లీ (సింగిడి)**

స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు బంగ్లాదేశ్ ప్రభుత్వం హెచ్చరికల చేసింది. డిసెంబర్‌లో సొంతగడ్డకు వెళ్తానని పేర్కొన్న హసీనాను ఎట్టిపరిస్థితుల్లోనూ వదలబోమని న్యాయశాఖ మంత్రి ఎం అసాదుజ్జమన్ తెలిపారు. ఆమె దేశంలో అడుగుపెట్టగానే అరెస్ట్ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కోర్టులో లొంగిపోవాలనుకుంటున్న ఆమె ప్రయత్నాలను తిప్పకొడతామని, లొంగుబాటుకు ముందే తనను అదుపులోకి తీసుకుంటామని అసాదుజ్జమన్ వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో నిరసనకారులపై హింస కేసులో ఉరి శిక్షకు గురైన మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఊరట లభించేలా లేదు. నిరుడు నవంబర్ 25న కోర్టు మరణ శిక్ష విధించిన నేపథ్యంలో.. డిసెంబర్‌లో స్వదేశం వెళ్లాలనుకుంటున్న ఆమెను రాగానే అరెస్ట్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. జూలై 29, బుధవారం అసోసియేటెడ్ ప్రెస్(AFP)తో మాట్లాడుతూ తాను కచ్చితంగా స్వదేశం వెళ్తానని అవామీ లీగ్ అధినేత్రి చెప్పారు. 'నేను హత్యకు గురికావొచ్చు. నన్ను అరెస్ట్ చేయవచ్చు. లేదా నన్నుజైలుకు పంపవచ్చు. నా విధి పట్ల పూర్తి అవగాహనతో ఉన్నా. ఏది ఏమైనా సరే నేను తిరిగి వెళ్తాను. ఎందుకంటే నా ప్రజలు నన్ను పిలుస్తున్నారు' అని 78 ఏళ్ల హసీనా వెల్లడించారు. అంతే.. హసీనా ఈ ప్రకటన చేయడంతో దేశంలో కాలుమోపగానే అరెస్టు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. 'హసీనాకు తిరిగి స్వదేశం వచ్చే హక్కు ఉంది. అయితే.. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. అలాఅనీ మేము చట్టాన్ని అతిక్రమించం. హసీనా దేశంలో అడుగుపెట్టగానే అరెస్ట్ చేస్తాం. ఆమెకు కోర్టులో లొంగిపోయే అవకాశం ఇవ్వం' అని అసాదుజ్జామన్ పేర్కొన్నారు. అయితే.. 2024లో హసీనా గద్దెదిగాక ఏర్పడిన మొహమ్మద్ యూనస్ ఆధ్వర్యంలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం ఆమె పాస్‌పోర్టును రద్దు చేసింది. దాంతో.. 'హసీనా ఇప్పుడు స్వదేశం ఎలా రాగలరు?' అనే ప్రశ్నకు అసాదుజ్జామన్.. 'అది ఆమె సమస్య. నాది కాదు' అని బదులిచ్చారు.

# ఫార్ములా-ఈ కేసు నేడు కోర్టుకు కేటీఆర్

ఫార్ములా ఈ కార్ రేస్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. ఫార్ములా ఈ–కారు రేసు కేసు విచారణలో భాగంగా మాజీ మంత్రి,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరుకానున్నారు. ఈ కేసులో ట్రయల్ ప్రారంభం కానుండటంతో కోర్టు ఆదేశాల మేరకు ఆయన వ్యక్తిగతంగా హాజరవుతున్నారు. అసలు ఫార్ములా ఈ కార్ రేస్ వివాదం ఏమిటంటే? : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ–రేస్ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందనేది ప్రధాన ఆరోపణ. క్యాబినెట్ అనుమతి లేకుండానే రూ.55 కోట్ల ప్రభుత్వ నిధులను యూకేకు చెందిన ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ) సంస్థకు బదిలీ చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఏసీబీ దర్యాప్తు చేపట్టి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే ఈ ఆరోపణలను కేటీఆర్ పూర్తిగా తోసిపుచ్చారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులను తెచ్చిందని విమర్శించారు.

# విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు

**న్యూఢిల్లీ (సింగిడి)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సరగా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు. దేశాన్ని పాలించడం కంటే ఇన్ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యతను మరో నాయకుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువతలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు. వీరు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తని ఆయన పేర్కొన్నారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
31-7-2026



నలుగురు ముఖ్యమంత్రుల సహకారంతో..

# సంగారెడ్డి రాజీవ్‌పార్క్ అభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంజూరు చేస్తే.. సీఎం రోశయ్య శంకుస్థాపన

కిరణ్ కుమార్ రెడ్డి ప్రారంభం

తిరిగి మరలా సుందరీకరణ తర్వాత త్వరలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, జూలై 30 (సింగిడి):** సంగారెడ్డి రాజీవ్ పార్క్ ఏర్పాటు, అభివృద్ధిలో నలుగురు ముఖ్యమంత్రుల సహకారం ఉందని జగ్గారెడ్డి అన్నారు. గురువారం ఆయన రాజీవ్ పార్క్‌ను సందర్శించి , పార్క్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. పార్క్ మొత్తం కలియ తిరుగుతూ జరుగుతున్న, జరగాల్సిన అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పార్క్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలను స్వయంగా పరిశీలించారు. ఫౌంటెన్ పునరుద్ధన పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి రాజీవ్ పార్క్‌కు అనుమతులు మంజూరు చేశారన్నారు. అనంతరం సీఎం రోశయ్య శంకుస్థాపన చేయగా, సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ప్రారంభించారన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ కాలం లో రాజీవ్ పార్క్ పూర్తిగా చెడిపోయి నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుందని అన్నారు. తిరిగి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం తో, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ టీ కే శ్రీదేవి సహకారం తో మరో రూ. 3 కోట్ల నిధులతో రాజీవ్ పార్క్‌ను మొదటి దశగా అభివృద్ధి చేశామని, మరో రూ. 6 కోట్ల రూపాయల నిధుల తో అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రాజీవ్ పార్క్‌ను తిరిగి ప్రారంభిస్తమని వివరించారు. ఈ కార్యక్రమంలో టీ పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిశన్ నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హాఫీజ్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, శ్రీహరి, కౌన్సిలర్ లు మహేష్, నవాజ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన కొలను హనుమంత రెడ్డి



**కుత్బుల్లాపూర్, జూలై 30 (సింగిడి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ప్రత్యేక కృషితో సీఎంసీ ప్రత్యేక నిధుల ద్వారా 1. 08 కోట్ల (40 లక్షలు, రూ. 68 లక్షలు) ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 277వ డివిజన్ పరిధిలోని మహాదేవపురం కాలనీలో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను గురువారం కొలను హనుమంత రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాదేవపురం కాలనీలోని బ్లాకులు ఏ డి ఎం డబ్ల్యు ఎక్స్ బ్లాక్‌లతో పాటు ఫేజ్--2 పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వము మంజూరు చేసిన సిసి రోడ్లను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదార్, అధికారులకు సూచించారు. కాలనీల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన రహదారుల నిర్మాణం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తూ, ప్రతి కాలనీ అభివృద్ధే తమ లక్ష్యమని పేర్కొన్నారు. మహాదేవపురం కాలనీ అభివృద్ధికి విశేష కృషి చేసి సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి కి కాలనీ వాసులు, వెల్ఫేర్ సొసైటీ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం 277వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సిద్ధనోళ్ల సంజీవ్ రెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు అంజలి యాదవ్, మహాదేవపురం కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కే. వెంకటరెడ్డి, ప్రసాద్, రాంచందర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ప్రవీణ్, వెంకట్ రెడ్డి, కృష్ణ రెడ్డి, దిలీప్, రాజమహేంద్ర, మల్లారెడ్డి, జాంగా రెడ్డి, శివ రెడ్డి, రాంచందర్ (ఎస్ఐ), సంతోష్, రంజిత్, వెంకటేష్, సురేష్, చావా శ్రీనివాస్, వీరయ్య, ప్రభాకర్, అనిల్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, ప్రశాంతి, చర్చి పాస్టర్లు, కాలనీ వాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# మురుగు నీటి నిల్వను తొలగించండి

**కొడంగల్, జులై 30 (సింగిడి) :** కొడంగల్ మున్సిపల్ రెండోవార్డు తెలుగు వాడి లో మురుగు నీటి నిల్వలను తొలగించాలని కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ అన్నారు. గురువారం ఆమె కాలనీలో తిరుగుతూ సమస్యలను తెలుసుకున్నారు. బుధవారం రాత్రి వర్షం కురవడంతో మురుగు నీరు మరింత ఎక్కువగా నిల్వ అయిందని ఈ మురుగు నీటిని తొలగించకపోతే వర్షాలు కురిస్తే మురునీరు ఇళ్ళలోకీ చేరే అవకాశం ఉందని, ఇలా జరిగితే ప్రజలు ఇబ్బందులకు గురవుతారని అన్నారు. వర్షాకాలం ప్రభావం తో ప్రజలు దోమలు, ఇతర క్రిమికీటకాల, విషపురుగుల భారిన పడాల్సి వస్తుందని, వెంటనే మురుగు నీటి నిల్వను తొలగించాలని మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఛైర్మన్ ల దృష్టికి తీసుకెళ్లారు. ఈకార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నాయకులు మధుసూదన్ యాదవ్, భీములు, కాలనీ వాసులు సాయిలు, చిన్న, శ్రీను, హరిఫ్, కిష్టప్ప, కురుమయ్య, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.



## సాదా బై నామ, భూభారతి, పెండింగ్ అప్లికేషన్లు, సర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయండి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశం



**మేడ్చల్ కలెక్టరేట్, జులై 30 (సింగిడి) :** సాదాబైనామా, భూ భారతి, పెండింగ్ అప్లికేషన్లు, గ్రామాల రీసర్వే, ఎలక్ట్రోల్ ఎన్రోల్మెంట్ (సర్) పరిశీలించి న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఈ మేరకు గురువారం ఘట్‌కేసర్ మండల తహసీల్దార్ ఆఫీస్‌ను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసినారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సాదా బైనామా, భూ భారతి పెండింగ్ అప్లికేషన్లను, గ్రామాల రీసర్వే, ఎలక్ట్రోల్ ఎన్రోల్మెంట్ (సర్) పరిశీలించి పెండెన్సి త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దారును ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూమి రికార్డుల సమగ్ర పోర్టల్ భూభారతి లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సూచనలు జారీ చేసారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెండింగ్ కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సాదా బైనామా, భూభారతి రికార్డులను అదనపు కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. సర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ తహసీల్దారు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్‌డిఎస్ ఉద్యోగుల నిరసన



**వికారాబాద్, జూలై 30 (సింగిడి) :** వీబి జీ రామ్ జీ, ఎఫ్ టీ ఈ ఉద్యోగులకు సంబంధించిన గత కొన్ని పెండింగ్ లో ఉన్న వేతనాలు తక్షణమే విడుదల చేయాలంటూ గురువారం వికారాబాద్ ఎం పి డి వో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతకాలంగా తమ వేతనాలు ఆలస్యంగా విడుదలవుతున్నాయంటూనే గత రెండు దశాబ్దాలుగా గ్రామాల అభివృద్ధికి నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ నేటికి కూడా మూడు నెలల వేతనాలు పెండింగ్ లోనే ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. కార్యాలయానికి హాజరు కావడానికి రవాణా ఖర్చులు సమకూర్చుకోలేని పరిస్థితిలో ఉన్నామంటూ వారు ఆవేదనవ్యక్తం చేశారు. అదేవిధంగా చాలాకాలంగా అడ్మినిస్ట్రేషన్ బిల్లులు కూడా పెండింగ్ లో ఉన్నాయని ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలంటూ పలు డిమాండ్లను వ్యక్తం చేశారు. ఎస్ ఆర్ డి ఎస్ ( వి బి జి ఆర్ ఎం జి ) ఎఫ్ టి ఈ ఉద్యోగుల కు 2026 ఆగస్టు 15వ తేదీ లోపు పే స్కేలు అమలు చేసి సంబంధిత ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రతి నెల మొదటి వేతనం చెల్లించే విధంగా అమలు చేయాలన్నారు. సెలవు దినాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించిన నిబంధనలు ప్రకారం తగిన ప్రయోజనాలు కల్పించాలన్నారు. సి ఆర్ డి కార్యాలయంలోని ఫైనాన్స్ రింగు మరియు హెచ్‌ఆర్ వింగ్ మధ్య సమన్వయ లోపాలను వివరించాలన్నారు. క్యాడర్ స్ట్రింట్ ఖరారు పదోన్నతులు బదిలీలు మరియు కెరీర్ అడ్వాన్స్మెంట్ పాలసీలు అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు పే స్కేల్ ఆగస్టు 15వ తేదీలోపు పూర్తిగా పెండింగ్లో ఉన్న వేతనాలను విడుదల చేయడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆగస్టు 16వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు దశలవారీగా ఆందోళన మరియు అవసరమైతే సమ్మె కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

## టఫ్ ఆత్మీయ సమ్మేళనానికి తరలిన కొడంగల్ సభ్యులు



**కొడంగల్, జులై 30(సింగిడి) :** హైదరాబాద్ లోని సందరయ్య విజ్ఞాన భవన్ లో జరిగిన తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ (టఫ్)ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి కొడంగల్ ప్రాంతం నుండి ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఎర్రన్ పల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వెళ్లి పాల్గొన్నారు.ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల కు డబుల్ బెడ్రూం ఇళ్ళు, పింఛన్లు, మంజూరు చేయాలని, ఉద్యమం లో జైలు పాలైనవారి పై ఆనాటి ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమైక్య నాయకులు అనిత, రేగడిమైలారం శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో తస్మాత్ జాగ్రత్త

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా





**వికారాబాద్ జూలై 30 (సింగిడి):** రాబోయే 48 గంటల పాటు జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో వికారాబాద్ జిల్లా ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ తెలిపారు. జిల్లాలో అందరూ పోలీసు అధికారులు, సిబ్బంది 24x7 అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో అత్యవసర పరిస్థితులకు వెంటనే స్పందించేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రెవెన్యూ, అగ్నిమాపక, వైద్య, పంచాయతీరాజ్ తదితర శాఖలతో నిరంతర సమన్వయం కొనసాగించాలన్నారు. అంబులెన్సులు, వైద్యులు, సహాయక బృందాలు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె చెప్పారు. వాగులు, వంకలు, చెరువులు, ప్రాజెక్టులు ఉద్ధృతంగా ప్రవహిస్తే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, పిల్లలను నీటి ప్రవాహాల వద్దకు వెళ్లనివ్వకుండా చూడాలని అన్నారు. పాత ఇండ్లలో నివసించే కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని, శిథిల భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండవద్దని అన్నారు. రోడ్లపై నీరు నిల్వ ఉండటం, గుంతలు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు నెమ్మదిగా, జాగ్రత్తగా ప్రయాణించాలని అన్నారు. గ్రామ సర్పంచ్‌లు, ఇతర శాఖల అధికారులతో కలిసి వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ప్రమాదకర వాగులు, కల్వర్టులు, వరద ముంపు ప్రాంతాల వద్ద రోడ్డు బ్లాక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రమాదకర ప్రాంతాలను గుర్తించడం, ట్రాఫిక్ మళ్లించడం, సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఆమె తెలిపారు. అత్యవసర సహాయం కోసం అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100 లేదా వికారాబాద్ జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712670056 కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు తెలియజేశారు.

# రాబోయే నాలుగు రోజులు అత్యంత కీలకం

ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయండి

పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్చెరు, జూలై 30 (సింగిడి) :** కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ముగియడానికి మరో నాలుగు రోజుల సమయం మాత్రమే ఉందని.. ఎస్ఐఆర్ లో తమ ఓటు వివరాలు నమోదు చేయించుకుని ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ లో పాల్గొని.. పూర్తి వివరాలు అందించాలని పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు పటాన్చెరు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని.. ప్రతి ఓటుకు దేశం, రాష్ట్రం, నియోజకవర్గ అభివృద్ధి నిర్ణయించే శక్తి ఉంటుందని అన్నారు. గురువారం ఉదయం పటాన్చెరు పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ లో నియోజకవర్గస్థాయి ముస్లింలు, క్రిస్టియన్లు, మిల్లర్స్, సెంట్రింగ్ అసోసియేషన్ సభ్యులకు ఎస్ ఐ ఆర్ అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 రోజులుగా ఎస్ఐఆర్ అంశం పై నియోజకవర్గ వ్యాప్తంగా సమావేశాలు, సదస్సులతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జూలై 30వ తేదీ ఉదయం 10:00 గంటల వరకు నియోజకవర్గం వ్యాప్తంగా 63. 27 శాతం మాత్రమే నమోదు కావడం జరిగిందని తెలిపారు. బి ఎల్ వోల ద్వారా దరఖాస్తులు స్వీకరించి.. తిరిగి ఇవ్వకుండా ఉన్న ప్రతి ఓటరు వెంటనే వాటిని సమర్పించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన బలమైన ఆయుధం ఓటు హక్కు అని.. దీనిని నిర్లక్ష్యం చేయడం అంటే మన బంగారు భవిష్యత్తును చీకటిమయం చేసుకోవడమేనని అన్నారు. పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఓటు అత్యంత కీలకమని.. స్థానికంగా ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని.. నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ప్రార్థన స్థలాలలో రాబోయే నాలుగు రోజులపాటు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ మత, వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలి

జోనల్ కమిషనర్‌కు వినతి



**మల్కాజిగిరి, జులై 30 (సింగిడి) :** మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని జయగిరి న్యూ వెంకటేశ్వర నగర్, జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్ తదితర ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయగిరి లక్ష్మీనరసింహ స్వామి నగర్, వెంకటేశ్వర నగర్ తదితర ప్రాంతాలలో అంతర్గత రోడ్లు, బాక్స్ డ్రైవ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాము యాదవ్ మాట్లాడుతూ సానుకూలంగా స్పందించిన కమిషనర్ తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూ వెంకటేశ్వర నగర్ కాలనీవాసులు బాలయ్య, రమేష్ కుమార్ పాల్, లడ్డు జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్ కాలనీవాసులు, బిఆర్ఎస్ నాయకులు మల్లేష్, రాజా, భాను, తదితరులు పాల్గొన్నారు.

## సర్‌లో వివరాలు నమోదు చేసుకున్న కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, జూలై 30 (సింగిడి) :** ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ( ఎస్ ఐ ఆర్ )లో భాగంగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ వారి సొంత గ్రామం గాజుల రామారం లో ఓటరు వివరాలను ఎన్యూమరేషన్ ఫారంలో నింపి సంబంధిత బిఎల్ ఓ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ ఓటరు వివరాలను ఎన్యూమరేషన్ ఫారంలో సక్రమంగా నింపి, సంబంధిత అధికారులకు అందజేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ ముఖ్యంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను నమోదు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి
- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం



**రాజేంద్రనగర్, జూలై 30 (సింగిడి) :** రానున్న వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో ప్రశాంత వాతావరణంలో, విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆదేశించారు. గురువారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో వినాయక ఉత్సవాల ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఉత్సవాల సందర్భంగా భక్తులకు, మండప నిర్వాహకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జీహెచ్ఎంసీ, పోలీసు, విద్యుత్, రెవెన్యూ, జలమండలి తదితర ప్రభుత్వ శాఖల అధికారులు ఒకరికొకరు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే ప్రాంతాలు, నిమజ్జన ఊరేగింపు సాగే ప్రధాన మార్గాల్లో గుంతలను పూడ్చి రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి. పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టంగా ఉండాలి. నిమజ్జనం జరిగే చెరువులు, కృత్రిమ కుంటల వద్ద తగినన్ని క్రేన్లు అందుబాటులో ఉంచాలి. నిరంతర విద్యుత్ సరఫరా కోసం భారీ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించేలా విస్తృత అవగాహన కల్పించాలి. మండపాల నిర్వాహకులు సైతం నిబంధ నలు పాటిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో అధికారుల కు పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు.

## శివానగర్‌లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను ఆపివేయాలి



**జిన్నారం, జులై 30 (సింగిడి) :** జిన్నారం మున్సిపాలిటీలోనీ శివనగర్ గ్రామం లో గతంలో తోళ్ల పరిశ్రమకు ఇచ్చిన పట్టాలలో అక్రమంగా నిర్మిస్తున్న ఇండ్లు బ్రతుకమని తోళ్ల పరిశ్రమకు జాగలిస్తే వాటిని చనువు చేసుకొని కమర్షియల్ బిల్డింగ్లు కడుతూ టీఎస్ ఐపాస్ లో పని చేస్తున్న బడా బాబులకు కార్మికులకు కిరాయిలిస్తూ అక్రమంగా పెద్ద పెద్ద బిల్డింగులు నిర్మిస్తున్నారు తక్షణమే యొక్క నిర్మాణాలు ఆపివేయాలని జిన్నారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్ రెడ్డి జిన్నారం కో ఆప్షన్ మెంబర్ సీనియర్ నాయకులు కురుపల్లి నర్సింగరావు జిన్నారం మండల బిజెపి అధ్యక్షులు కొత్త కాపు జగన్ రెడ్డి కౌన్సిలర్లు కుమార్ స్వప్న పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

Editorial

ప్రతిపక్షంగా విఫలం అవుతున్న

## కాంగ్రెస్!

ఈ దేశ దౌర్భాగ్యం ఏమంటే అసమర్థ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడం. అధికారంలో ఉంటే అవినీతికి పాల్పడడం, కుంభకోణాలను చేయడం, పాలనను గాలికి వదిలి వేయడం చూశాం. పదేళ్ల యూపిఎ పాలనలో మన్మోహన్ సింగ్‌ను ముందుకు పెట్టి ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేం. అలాగే ప్రతిపక్షంలో గత పదేళ్లుగా నిర్మాణాత్మక పాత్ర పోషించడంలోనూ విఫలం అవుతూ వస్తోంది. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షానిదే బలమైన పాత్ర అని చెప్పాలి. దీనిని గుర్తించి నడచుకోవడంలో కూడా కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. అధికార ఎన్‌డిఎ తప్పుడు పనులు చేస్తుంటే నిలదీయడం లేదు. ఆశ్రిత పక్షపాతం చూపితే నిలదీయడం లేదు. ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేయడం లేదు. ఎందుకంటే ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, కుటుంబ పాలన కాంగ్రెస్‌లో నరనరాన జీర్ణించుకుపోయింది. ఇంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్‌లోనే ఉన్నారు. కుటుంబ పాలనకు ఇదే నిదర్శనం. ఇకపోతే పార్లమెంట్ సమావేశాల్లో కూడా బలంగా ప్రజల వాణిని విన్పించడం లేదు. కాక్రోచ్ పార్టీకి వస్తున్న ఆదరణను తమ ఖాతాలో వేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. వారి ఉద్యమాన్ని హైజాక్ చేసి లబ్ధి పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో వారుచేస్తున్న ఆందోళనలు ఎబ్బెట్టుగా ఉన్నాయి. తాజాగా పార్లమెంట్ లోపలా బయటా విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశించారో చెప్పాలన్న డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంట్ బయట ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. అందరూ గతంలో పాలన చేసిన వారే. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ అంతా పాలకులుగా ఉండివచ్చిన వారే. లాఠీ ఛార్జ్ చేయమని హోంమంత్రి ఆదేశిస్తారా అన్నది కూడా తెలియని వారు మన పాలనా వ్యవస్థలో ఉండడం దౌర్భాగ్యం. పోలీస్ మాన్యువల్ కూడా తెలియకుండా రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతున్నారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పితే పోలీసులే నిర్ణయం తీసుకుని లాఠీఛార్జ్ చేస్తారు. నిషేధిత పార్లమెంట్ పరిసరాల్లో, ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఆందోళనలు జరిగినా తప్పకుండా కంట్రోల్ చేస్తారు. ఇదికూడా తెలియ నట్లుగా ప్లకార్డులు పట్టుకుని లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలిచ్చారో చెప్పాలని నినాదాలు చేయడం సిగ్గుచేటు. ఇది కేవలం రాజకీయంగా చేస్తున్న ఆందోళన తప్ప ఇందులో చిత్తశుద్ధి లేదని వారికి కూడా తెలుసు. అసలు కాంగ్రెస్ నిర్మాణాత్మకంగా వ్యవహరించి ఉంటే ఇవాళ విద్యార్థులు రోడ్డుకెక్కాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. జూన్ 6న సీజేపీ ఏర్పడడంపై వచ్చిన ప్రతిస్పందన చూసిన తర్వాతగానీ కాంగ్రెస్ గళం విప్పలేదు. మే మొదటి వారంలో పేపర్ లీక్ జరిగి, మే 12న పరీక్ష రద్దయిన తర్వాత కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందుకు చేయాల్సినన్ని ప్రయత్నాలు చేయలేదు. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోంకి గుంజ్' పేరిట విద్యార్థుల ర్యాలీని నిర్వహించిన రాహుల్‌గాంధీ ఆ తర్వాత 23 రోజుల పాటు అదృశ్యమై జర్మనీలో కాలక్షేపం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు ఢిల్లీలో ప్రవేశించి తమ ఆందోళన తీవ్రతరం చేసిన తర్వాత, పార్లమెంటు సమావేశాలు మరో మూడు రోజుల్లో జరుగుతా యనగా రాహుల్‌లో కలవరం కలిగింది. అందుకే అమాంతంగా లేచి ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. రాజకీయాల్లో నిరంతరత్వం, నిత్య క్రియాశీలత్వం లేకపోతే పరిస్థితి మరొకరి చేతుల్లోకి వెళుతుందన్న విషయం రుజువైంది. మునుపటిలాగా నాటకీయంగా ధర్నాలు చేయడం, అరెస్టు కావడం వల్ల ప్రజల సానుభూతి లభించదని కాంగ్రెస్ గ్రహించాలి. 2014 నుంచీ పార్లమెంట్‌ను కాంగ్రెస్ స్తంభింపజేయడం, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం వంటివి చేస్తూనే ఉన్నది. అందంతా కేవలం నాకీయ రాజకీయ ప్రయోజనం కోరి చేస్తున్నవే. కేవలం నెలరోజుల నిరసనతో కాక్రోచ్ పార్టీ ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేయగలిగింది. అటువంటి నైతిక స్థైర్యం కాంగ్రెస్, ప్రతిపక్షాలకు ఎందుకు లేకుండా పోయిందన్నదే ప్రశ్న. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికే కాదు, పరీక్షల్లో అక్రమాలను నిరోధించేం దుకు ప్రభుత్వం ఆగమేఘాలపై బిల్లు తేవడానికి, ప్రధానమంత్రి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ బిల్లు గురించి ప్రకటించడానికి సిజెపి ఉద్యమమే కారణం. నెల రోజులకు పైగా శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తూ పరీక్షా పత్రాల లీక్‌కు విద్యామంత్రి నైతిక బాధ్యత వహించాలని కోరిన యువతీ యువకులతో దేశవ్యాప్తంగా ఎంతోమంది కనెక్టయ్యారు. నిజానికి ప్రతి ఉద్యమంలోనూ ఎంతో కొంత హింసాకాండ, విధ్వంసం జరుగుతూనే ఉన్నది. చాలాసార్లు పోలీసుల దమనకాండ అణచితేకు పోలీసులు లాఠీఛార్జ్ షరామమాలే. అంతమాత్రాన మొత్తం ఉద్యమానికి విశ్వసనీయత లేకుండాపోదు. అయితే ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం అవుతూనే ఉంది. ఇప్పుడు రాహుల్ వారిని భుజాన వేసుకుని ఊరేగే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అవమానంగా భావించనక్కర్లేదు. జరిగిన పరిణామాల్ని ఆత్మావలోకనం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు లభించిన అవకాశంగా భావించాలి. కాంగ్రెస్ ఇప్పటికైనా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలి. లేకుంటే కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానం కూడా కోల్పోతుంది.

# సినీ వినీలాకాశంలో హాస్యపు హరివిల్లు అల్లు

జూలై 31...అల్లు రామలింగయ్య వర్ధంతి



తెలుగు సినిమాకు దొరికిన అపురూపమైన కళాకారుడు అల్లు రామలింగయ్య. ఆయన నటించే ప్రతిపాత్ర ఆయనకే స్వంతమా అనే రీతితో నటించి నవ్వించిన సాటిలేని మేటి నటుడు అల్లు రామలింగయ్య. నిజానికి హాస్యానికి ఆయన అసలు చిరునామాగా మారారు. అయినా ఏ పాత్రలోకైనా పరకాయప్రవేశం చేసి మెప్పించారు. హాస్యాన్ని పండించారు. ఆకారంతో పనేమి? నవ్వించడమే నా అసలు పని అని నవ్వుకే నడకలు నేర్ప గలిగిన హాస్య నట దిగ్గజం అల్లు.రేలంగి తరువాత 'పద్మశ్రీ' అందుకున్న హాస్యనటుడుగా చరిత్ర సృష్టించారు. హోమియోపతి డాక్టర్‌గా పలు సేవాకార్యక్రమాలు అందించారు. తెలుగు సినీ పరిశ్రమలో నటుడిగా ఎంత బిజీగా వున్నా వైద్య వృత్తిని మాత్రం వదల్లేదు. వీలైనప్పుడు నటీనటులకు కూడా తన వైద్యాన్ని అందించారు. నిర్మాతగా మారి గీతా ఆర్ట్స్ బ్యానర్ స్థాపించి అనేక సూపర్‌హిట్స్ అందించారు.ఆయన నాటి స్వతంత్ర పోరాటంలో భాగస్వామిగా, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు కూడా వెళ్లారు.





అల్లు రామలింగయ్య (అక్టోబర్ 1, 1922 – జూలై 31, 2004) నటునిగా, వైద్యుడిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా, తత్వవేత్త. లోతైన తత్వవేత్తగా, నిర్మాతగా, ఎందరికో మార్గదర్శకుడిగా, గురువుగా విభిన్న సేవలు అందించారు. ఆయన కుమారుడు అల్లు అరవింద్ సినీ నిర్మాతగా, . మెగా స్టార్, చిరంజీవి అల్లుడు, మనమళ్లు చరణ్, అర్జున్, శిరీష్ సినీ పరిశ్రమలో రాణించడం విశేషం.

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో 1922 అక్టోబర్ 1న అల్లు రామలింగయ్య జన్మించారు. పాలకొల్లులో ఉన్న క్షీర రామలింగేశ్వర స్వామి గుర్తుగా తల్లిదండ్రులు రామలింగయ్యని పేరు పెట్టుకున్నారు. అల్లు చదువులో పెద్దగా రాణించ లేదు. ఆకతాయిగా తిరుగుతూ అందరినీ అనుకరిస్తూ నవ్వించేవారు. ఇదే క్రమంతో నాటకాల్లో నటించాలనే ఉత్సాహం పెరిగింది. ఊళ్లోకి ఎవరు నాటకాల వాళ్ళు వచ్చినా వారి వెంటే తిరుగుతూ ఉండేవారు. వాళ్లతో స్నేహం చేయడం, ఏదైనా చిన్న వేషం ఇమ్మని అడగడం నిత్యకృత్యంగా చేసుకున్నారు.

ఓ సారి వాళ్ల ఊళ్లో 'భక్త ప్రహ్లాద' నాటకం చూస్తుండగా.. బృహస్పతి వేషం వేస్తున్న పిల్లాడు బాగా చేయడం లేదనిపించి... ఇంట్లోంచి బియ్యం దొంగతనం చేసి వాటిని అమ్మి నాటక కాంట్రాక్టరుకు మూడు రూపాయలు ఎదురిచ్చి ఆ వేషం తనే వేసిన తపన ఉన్న కళాకారులు. నాటకానుభవం పెద్దగా లేకున్నా కొద్దిపాటి నటనావగాహనతో తన వేషం మెప్పించారు. అలా మొదలైంది అల్లు నట జీవితం.

అల్లు నాటకాల్లో నటిస్తూనే, తన సామాజిక బాధ్యతను గుర్తెరిగి గాంధీజీ పిలుపు నందుకుని క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు కెళ్లారు. జైలులో కూడా తోటివారిని పోగేసుకుని నాటకాలాడే వారు. మరోవైపు అంటరానితనంపై పోరు సలిపారు. అల్లు నాటకాలు చూసిన గరికపాటి రాజారావు చిత్రసీమలో తొలిసారిగా 1952లో పుట్టిల్లు చిత్రంలో కూడు–గుడ్డ శాస్త్రి తరహా పాత్రను అల్లుచే వేయించారు. ఆ తరువాత హెచ్.ఎం.రెడ్డి వద్దంటే డబ్బులో అవకాశం వచ్చింది.

పుట్టిల్లు చిత్రం నిర్మాణ కాలంలో తన భార్యా నలుగురు పిల్లలతో మదరాసుకు మకాం మార్చారు. అల్లు తన కుటుంబాన్ని పోషించేందుకు చాలా కష్టాలు పడ్డారు. మరోవైపు హోమియో వైద్యం నేర్చుకున్న అల్లు ఏమాత్రం తీరిక దొరికినా ఉచిత వైద్యసేవ లందించేవారు. ప్రారంభంలో ఎన్నో అవాంతరాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో చిత్రసీమలో నిలద్రొక్కు కున్నారు. అల్లు హాస్యపు జల్లునేకాదు కామెడీ విలనిజాన్ని కూడా రక్తి కట్టించాడు.

రామలింగయ్యలో ఉన్న నటుడ్ని అద్భుతంగా వాడుకున్న దర్శకుల్లో విశ్వనాథ్ ఒకరు. మొదట్లో కామెడీ వేషాలే చేసినా...నెమ్మదిగా కామెడీ విలనీ కూడా చేయడం ప్రారంభించారు. ఓ జమానాలో విలన్ వెనకాల ఉండే ఓ తరహా గుంటనక్క లాంటి పాత్రలో అల్లు రామలింగయ్య ఎక్కువగా కనిపించేవారు. రామలింగయ్యలో చిన్నతనం నుంచి ఓ మిమిక్రీ కళాకారుడు ఉన్నారు. ఈ కళను ఆయన చాలా పదిలంగా కాపాడు కుంటూనే వచ్చారు.


అల్లు రామలింగయ్య నిర్మాతగా గీతా ఆర్ట్స్ బానర్ నెలకొల్పి బంట్రోతు భార్య, దేవుడే దిగివస్తే, బంగారు పతకం చిత్రాలను నిర్మించారు. చాలాకాలం తర్వాత అల్లు 90 దశకంలో డబ్బు భలే జబ్బు చిత్రం తీసారు.

ముత్యాల ముగ్గు సినిమా చిత్రీకరణకు ముందు అతను కుమారుడు ఆకస్మికంగా మరణించినా బాధను మనసులో అణుచుకుని షూటింగ్‌లో పాల్గొన్నారు అల్లు. సుమారు 1030 సినిమాల్లో కామెడీ విలనీ, క్యారెక్టర్ పాత్రలు చేసారు. 1116 చిత్రాల్లో నటించాలనే కోరిక అతనుకు తీరలేదు. అల్లు అభినయించిన చాలా పాటలకు బాలు గళం సరిగా సరి పోయింది. మనుషులంతా ఒక్కటే చిత్రంలో ముత్యాలు వస్తావా అడిగిందీ ఇస్తావా అనే పాట అప్పట్లో సూపర్ హిట్. యాభైయేళ్ల పాటు సినిమాల్లో నవ్వుతూ నవ్విస్తూ యావత్ తెలుగు ప్రజానీకాన్ని అలరించిన అల్లును వరించిన సన్మానాలు, గౌరవాలు, అవార్డులు అసంఖ్యాకమైనవి. భారత ప్రభుత్వం 1990లో ' పద్మశ్రీ ' అవార్డుతో గౌరవించింది. రేలంగి తరువాత ' పద్మశ్రీ' అందుకున్న హాస్యనటుడు అల్లునే. 2001 వ సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యున్నత ' రఘుపతి వెంకయ్య ' అవార్డు ఇచ్చింది. పాలకొల్లులో ఆయన విగ్రహం నెలకొల్పారు. 2013లో భారత చలనచిత్ర పరిశ్రమ వందేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంలో విడుదలయిన 50 తపాలా బిళ్ళలలో ఒకటి అల్లు రామలింగయ్య జ్ఞాపకార్థం విడుదలయింది. పాలకొల్లులో ఆయన విగ్రహం నెలకొల్పారు.

అల్లు రామలింగయ్య 2004 జూలై 31 వ తేదీన తన 82 వ ఏట కన్ను మూసారు. మరణించే నాటికి తెలుగు చిత్రసీమలో అల్లు రామలింగయ్యది ప్రత్యేక స్థానం. రేలంగి, రమణారెడ్డి, కుటుంబ రావు, బాలకృష్ణ వంటివారి కాలంతో మొదలు ఈతరం హాస్యనటుల వరకూ కొనసాగిన ఏకైక హాస్యనటుడు అల్లునే. ఆమ్యామ్య.. అప్పుం అప్పుం లాంటి ఊతపదాలు అతను సృష్టించినవే. అల్లు భౌతికంగా లేకపోయినా హాస్య రస ప్రధాన పాత్ర ధారిగా చిరంజీవిగా ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచి పోయారు..

**–రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# " మనిషి ఇంకా చనిపోలేదు..."



వర్షంలో తడుస్తున్న ఓ వృద్ధుడికి గొడుగు పట్టిన చిన్నారి మనకు నేర్పిన జీవన పాఠం. మనిషి చంద్రుడిపై అడుగు పెట్టాడు. కృత్రిమ మేధస్సును సృష్టించాడు. ప్రపంచాన్ని అరచేతిలోకి తెచ్చుకున్నాడు. కానీ ఒక ప్రశ్న మాత్రం ఇంకా మన ముందే నిలిచి ఉంద్జి. మనిషిలోని మనిషి ఇంకా బతికే ఉన్నాడా?

వర్షం కురుస్తోంది. రోడ్డుపై ఓ వృద్ధుడు వణుకుతూ నడుస్తున్నాడు. ఆ సమయంలో పాఠశాలకు వెళు_న్న ఓ చిన్నారి తన గొడుగును అతని వైపు చాచి, "తాతయ్య... రండి" అని పిలిచింది. ఆ దృశ్యం కేవలం కొన్ని క్షణాలే కావచ్చు. కానీ ఆ క్షణం మానవత్వం ఇంకా సజీవంగా ఉందని చెప్పే గొప్ప సందేశం.

ఈరోజు సమాజంలో కోట్ల రూపాయల విరాళాల కంటే, సమయానికి అందించే చిన్న సహాయం విలువైనది. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, దారి తప్పిన వృద్ధుడిని ఇంటికి చేర్చడం, ప్రమాదంలో ఉన్న వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళ్లడం... ఇవే నాగరికతకు నిజమైన కొలమానాలు. మన పిల్లలకు మార్కులు నేర్పుతున్నాం. పోటీ నేర్పుతున్నాం. కానీ కరుణ, దయ, పంచుకోవడం నేర్పుతున్నామా? పుస్తకాల్లో నైతిక విలువలు ఉంటాయి; జీవితంలో వాటిని ఆచరించే పెద్దలు ఉంటేనే ఆ విలువలు నిలుస్తాయి. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే వీడియోలు ఎన్నో ఉంటాయి. కానీ ఒక మంచి పని వైరల్ అయితే, అది వేల మందిలో మార్పుకు విత్తనం వేస్తుంది. మంచి పనికి చప్పట్లు కొట్టడం కాదు, దాన్ని అనుసరించడమే అసలైన అభినందన.

ప్రపంచాన్ని మార్చడానికి పెద్ద పదవులు అవసరం లేదు. గొప్ప సంపద అవసరం లేదు. ఒక మంచి మనసు చాలు.

చివరికి మనిషిని గుర్తుంచేది అతని ఆస్తి కాదు, అతను చూపిన ఆప్యాయత. అతను సంపాదించిన డబ్బు కాదు, అతను పంచిన ప్రేమ. మనిషి ఇంకా చనిపోలేదు... ప్రతి చిన్న మంచి పనిలో అతను ఇంకా బతికే ఉన్నాడు.

**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**

## చైనా నుంచి ఇరాన్‌కు ఆయుధాలు

### చైనా తీరుపై ట్రంప్ అసహనం

**వాషింగ్టన్,:** అమెరికా విమానాలు, హెలికాప్టర్లకు తలనొప్పిగా మారిన కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమైంది. వీటి రవాణాకు పాకిస్థాన్‌ను మార్గంగా ఎంచుకొన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దీంతో అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. పాక్ పేరు ఎత్తకుండా చైనాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించ బోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేశారు. చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకు పైగా విలువైన 400 షోల్డర్గ్÷ర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం జరిగింది. వీటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే.. ఈ డీల్‌కు టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టత లేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేయడం గమనార్హం. ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు.

# భూగర్భ టెండర్లలో రూ.180 కోట్ల గోల్‌మాల్

- మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ తీవ్ర ఆరోపణలు



**కరీంనగర్, జులై 30(సింగిడి):** నగరంలో రూ.180 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న భూగర్భ మురుగునీటి పారుదల (అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ) ప్రాజెక్టు టెండర్ ప్రక్రియపై మాజీ మేయర్, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ తీవ్ర ఆరోపణలు చేశారు. టెండర్ వ్యవహారంలో రూ.40 నుంచి రూ.50 కోట్ల వరకు అక్రమ లావాదేవీలు జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం చేస్తూ, కమిషన్ల కోసమే కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. బుధవారం రోజున హోటల్ తారక్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం జీవో 745 ద్వారా రూ.180 కోట్ల నిధులు కేటాయించిన నేపథ్యంలో టెండర్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. అయితే గతంలో అదనపు ధర (ఎక్సెస్) కారణంగా రద్దు చేసిన టెండర్‌ను మళ్లీ అదే కాంట్రాక్టర్‌కు కేటాయించడం అనేక అనుమానాలకు తావిస్తోందని ప్రశ్నించారు. రూ.50 లక్షల పనులకు ఒక నిబంధన, రూ.180 కోట్ల పనులకు మరో నిబంధన ఎందుకని నిలదీశారు. తాను చేస్తున్నవి ఆరోపణలేనని, వాటిపై ప్రభుత్వం స్వతంత్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. టెండర్ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు జరగకపోతే సంబంధిత వివరాలను బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతంలో స్మార్ట్ సిటీ కింద చేపట్టిన పనులపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో తనిఖీ గదులు (ఇన్‌స్పెక్షన్ చాంబర్లు), ప్రధాన మురుగునీటి మార్గాలతో అనుసంధానాలు సరిగా లేవని ఆరోపించారు. గత పనుల నాణ్యత, ప్రజలకు అందిన ప్రయోజనాలపై సమీక్ష నిర్వహించకుండా మళ్లీ అదే సంస్థకు భారీ పనులు అప్పగించడం సమంజసం కాదన్నారు. అలాగే గతంలో ఇదే సంస్థపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఫిర్యాదు చేశారని గుర్తుచేస్తూ, ఇప్పుడు అదే సంస్థకు భారీ టెండర్ ఎలా దక్కిందో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. టెండర్ వ్యవహారంలో కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య కుమ్మక్కు ఉందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్న ఆయన, గత టెండర్ రద్దు నుంచి తాజా టెండర్ కేటాయింపు వరకు జరిగిన మొత్తం ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నగరంలోని సీతారాంపూర్, కిసాన్‌నగర్, అలుగునూరు ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్‌టీపీలు) పనితీరు, వాటి అనుసంధానంపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఉన్న వ్యవస్థను సమీక్షించకుండా కొత్త ప్రాజెక్టు చేపట్టడం వల్ల ఆశించిన ప్రయోజనం ఉండదన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని భూగర్భ మురుగునీటి ప్రాజెక్టును సమగ్ర ప్రణాళికతో అమలు చేయాలని, టెండర్ ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్దార్ రవీందర్ సింగ్ డిమాండ్ చేశారు. అవసరమైతే ప్రజల తరఫున న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశం లో మైఖేల్ శ్రీనివాస్, దండే రాము, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పేరుతో డబ్బుల వసూళ్లు..!

- ఫిర్యాదుకు బాధితుల సిద్ధం
- బాధితులకు అండగా కార్పొరేటర్
- ఆవుల (తోకల) శ్యామణి రమేష్



**గోదావరిఖని, జూలై 30(సింగిడి):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ జనగామ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి పేదల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. డబ్బులు తీసుకున్నప్పటికీ నిరుపేదలకు ఇళ్లు మంజూరు కాలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై గతంలో బాధితులు ప్రజాప్రతినిధులను ఆశ్రయించగా, ఎమ్మెల్యేకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అనంతరం జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినప్పటికీ, విచారణ అనంతరం మళ్లీ అనర్హులనే లబ్ధిదారులుగా ఎంపిక చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో నిజమైన అర్హులకు తీవ్ర అన్యాయం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బాధితులు స్థానిక కార్పొరేటర్ ఆవుల (తోకల) శ్యామణి రమేష్‌ను కలిసి తమ వద్ద ఉన్న ఆధారాలను అందజేసినట్లు సమాచారం. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో జరిగినట్లు చెబుతున్న డబ్బుల వసూళ్ల వ్యవహారంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసేందుకు వారు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు.

## ఆదర్శవంతమైన సేవలు అందించిన రవీందర్ రెడ్డి




**గోదావరిఖని, జూలై 30(సింగిడి):** రామగుండం ఆర్జీ-1 ఏరియాలో 37 ఏళ్లపాటు నిబద్ధతతో సేవలందించిన పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మానం అందుకున్నారు. ఉద్యోగుల సంక్షేమం, కార్మిక సమస్యల పరిష్కారంలో ఆయన చేసిన సేవలను అధికారులు, సహచర ఉద్యోగులు కొనియాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జీ-1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. 37 ఏళ్ల సర్వీసులో ఉద్యోగుల సంక్షేమం, కార్మిక సమస్యల పరిష్కారం, హెచ్ఆర్ విధానాల అమలులో ఆయన చూపిన చిత్తశుద్ధి అభినందనీయమని జీఎం కొనియాడారు. ఉద్యోగుల సమస్యలను సొంత సమస్యలుగా భావించి పరిష్కరించే గుణం ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా అధికారులు, శాఖాధిపతులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. తన సేవా కాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ రవీందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## మాల కమ్యూనిటీ భూమిపై బిఎస్పీ నేత కబ్జా యత్నం

రెవెన్యూ అధికారుల సమక్షంలో హద్దులు నిర్ణయించాలని డిమాండ్



**గోదావరిఖని, జూలై 30(సింగిడి):** మాల కమ్యూనిటీకి చెందిన భూమిని బీఎస్పీ నాయకుడు పేగ నరేష్ నకిలీ పత్రాలతో పట్టా చేయించుకుని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మాల కమ్యూనిటీ ప్రతినిధులు ఆరోపించారు. బుధ వారం ఒక ప్రకటన చేశారు. తమ తాతల కాలం నుంచి సంక్రమించిన భూమిలో ప్రతిసారీ అడ్డంకులు సృష్టిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ భూ వివాదానికి ఎలాంటి రాజకీయ రంగు పులమాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. నరేష్ తన భూమికి సంబంధించిన హద్దులను రెవెన్యూ అధికారుల సమక్షంలో నిర్ణయించుకోవాలని, అందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. అయితే మాల కమ్యూనిటీకి చెందిన భూమిని నకిలీ ధ్రువపత్రాల ఆధారంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. అంబేద్కర్ ఆశయాలను ప్రస్తావించే బీఎస్పీ నాయకులే మాల కమ్యూనిటీ భూములపై కబ్జా యత్నాలకు పాల్పడటం సమంజసం కాదని, ఇలాంటి చర్యలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మాల కమ్యూనిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం అధ్యక్షుడు ఆర్ల సురేష్, ఉపాధ్యక్షుడు నరేష్‌తో పాటు మాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## శిలాఫలకాలకే పరిమితమైన అభివృద్ధి పనులా..?

యాదవ్‌నగర్ డ్రైనేజీ పనులు నిలిచిపోవడంపై ఆగ్రహం

పనులు చేయని కాంట్రాక్టర్‌ను తొలగించాలి

గుండబోయిన పృథ్విరాజ్ యాదవ్ డిమాండ్





**గోదావరిఖని, జూలై 30 (సింగిడి):** రామగుండం కార్పొరేషన్ ఆరో డివిజన్ జనగామ గ్రామంలోని యాదవ్‌నగర్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిది నెలల క్రితం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ, ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదని గుండబోయిన పృథ్విరాజ్ యాదవ్ ఆరోపించారు. కాంట్రాక్టర్ కృపాకర్ రావు వివిధ కారణాలు చెబుతూ పనులను ఆలస్యం చేస్తున్నారని, ఎన్నికల ముందు తీసుకొచ్చిన పైపులను అనంతరం వేరే ప్రాంతానికి తరలించి అక్కడ పనులు చేపట్టారని ఆయన తెలిపారు. ఈ విషయమై పలుమార్లు మేయర్‌కు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. యాదవ్ నగర్‌కు అధికార పార్టీ నాయకులు చిన్నచూపు చూస్తున్నారని గుండబోయిన పృథ్విరాజ్ యాదవ్,అన్నారు. ప్రస్తుత కాంట్రాక్టర్ పనులు చేయకపోతే వెంటనే మరో కాంట్రాక్టర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రాధాన్యత కంటే ప్రజల అభివృద్ధికి కట్టుబడి పనిచేసే కాంట్రాక్టర్లకు అవకాశమివ్వాలని యాదవ్‌నగర్ ప్రజల తరఫున కోరారు.

## నగరంలో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రారంభం

తొలి దశలో మూడు మార్గాల్లో సేవలు, ప్రజా రవాణాను మరింత బలోపేతం చేస్తాం

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్, జూలై 30(సింగిడి):** కరీంనగర్ నగర ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సేవలు అందించేందుకు కరీంనగర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బస్ స్టేషన్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేలు డాక్టర్ మేడిపల్లి సత్యం, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి కరీంనగర్ బస్ స్టేషన్ నుంచి వాగేశ్వరి కళాశాల వరకు సిటీ బస్సులో ప్రయాణించారు. తొలి దశలో కరీంనగర్--వాగేశ్వరి కళాశాల, కరీంనగర్--చింతకుంట, కరీంనగర్--కొత్తపల్లి హవేలీ మార్గాల్లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కరీంనగర్ నగరంలో చాలా కాలంగా ఉన్న సిటీ బస్సుల డిమాండ్‌ను నెరవేర్చినట్లు చెప్పారు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, ఉపాధి కోసం నగరానికి వచ్చే ప్రజలకు ఈ సేవలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. చింతకుంట, ఒద్యారం, కొత్తపల్లి, వాగేశ్వరి విద్యాసంస్థల ప్రాంతాలకు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడుతుందన్నారు. ప్రతిమ, చల్మెడ, మానకొండూరు వైపు ఉన్న వైద్య కళాశాలలకు కూడా త్వరలో బస్సు సేవలను విస్తరిస్తామని, ప్రయాణికుల ఆదరణను బట్టి అవసరమైతే అదనపు బస్సులు, రాత్రింబవళ్లు సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకుంటున్నారని, రాష్ట్రవ్యాప్తంగా కొత్త మార్గాల్లో బస్సులు నడపడమే కాకుండా కొత్త బస్సుల కొనుగోలు, సిబ్బంది నియామకాలు, పెండింగ్ బకాయిల చెల్లింపులు కూడా చేపట్టామని తెలిపారు. ప్రతి గ్రామానికి బస్సు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రతిరోజూ ఆర్టీసీ బస్సులు సుమారు 35 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీసు కమిషనర్ గౌస్ ఆలం, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ కుమార్ దేశాయ్, మున్నూరు కాపు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్వోబీ పనుల జాప్యంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అసంతృప్తి

ప్రత్యామ్నాయ రహదారి, కల్వర్టు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశం

భూసేకరణ ఆలస్యమే ప్రధాన కారణమని అధికారుల వివరణ



**కరీంనగర్, జూలై 30(సింగిడి):** తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్‌బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనులు ఆలస్యమవడంతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్వోబీ సమీపంలోని కల్వర్టులో ఓ వృద్ధురాలు పడిపోయిన ఘటనపై స్పందించిన ఆయన, ప్రజలకు ప్రత్యామ్నాయ సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం ఎందుకు జరిగిందని రహదారులు--భవనాల శాఖ అధికారులు, కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. అధికారులు స్పందిస్తూ, ఆర్వోబీ నిర్మాణానికి అవసరమైన భూసేకరణలో తీవ్ర జాప్యం జరగడం వల్లే పనులు ఆలస్యమయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూసేకరణ పూర్తికాకపోగా, ప్రస్తుతం ఆ ప్రక్రియ వేగవంతమైందని, త్వరలోనే నోటిఫికేషన్ జారీ కానుందని వెల్లడించారు. అలాగే నిర్మాణ సమయంలో ప్రత్యామ్నాయ బీటీ రహదారి, కల్వర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆ పనులు నిలిచిపోయాయని వివరించారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ న్యూఢిల్లీ నుంచి కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావుతో ఫోన్‌లో మాట్లాడి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆర్వోబీ ప్రాంతాన్ని పరిశీలించి, రాష్ట్ర ప్రభుత్వం నిధులు అందించని నేపథ్యంలో మున్సిపల్ కార్పొరేషన్ నిధులతోనే బీటీ రహదారి, కల్వర్టు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, సేతు బంధన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం పూర్తి నిధులు సమకూర్చినప్పటికీ పనులు ఎందుకు ఆలస్యమయ్యాయని బండి సంజయ్ ప్రశ్నించగా, భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని కాంట్రాక్టర్ వివరించారు. వచ్చే ఆరు నెలల్లో ఒక వైపు నిర్మాణ పనులను పూర్తి చేసి, ఒప్పందం ప్రకారం వచ్చే ఏడాదిలోగా మొత్తం ఆర్వోబీ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు.

## విలాసాగర్‌లో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

హాజరైన ప్రభుత్వ అధికారులు

అంటరానితనం కులవివక్ష నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత



**జమ్మికుంట, జూలై 30 (సింగిడి) :** జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామంలో గురువారం పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గరిగంటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రామంలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో జమ్మికుంట తహసిల్దార్ సుధాకర్ ఎస్సై రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలో ప్రతినెల 30వ తేదీన ఒక గ్రామంలో మండల స్థాయి అధికారుల ప్రజాప్రతినిధుల అంబేద్కర్ సంఘాల సభ్యులతో కలిసి ఎస్సీ ఎస్టీ లపై కుల వివక్ష అంటరానితనం ప్రార్థన మందిరాలలో ప్రవేశ నిరాకరణ లాంటి ఘటనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని కుల వివక్ష అంటరానితనం రెండు గ్లాసుల విధానం లాంటి సామాజిక దురాచారాల కు సమాజంలో ఎలాంటి స్థానం లేదని పేర్కొన్నారు. గ్రామాల్లో సామాజిక సమానత్వాన్ని పెంపొందించేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎస్సీ ఎస్టీలపై ఎలాంటి వివక్ష జరిగిన వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కుల మతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి జీవించాలని భారత రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గరిగంటి శ్రీకాంత్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శి బి విష్ణు కుమార్ గ్రామ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం
- నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



**కరీంనగర్, జులై30(సింగిడి):** నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుధ్యం, విపత్తు నిర్వహణ విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తూ ప్రజల ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని సూచించారు. అత్యవసర సేవలకు వినియోగించే వాహనాలు, యంత్రాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చర్యలు చేపట్టడంతో పాటు ప్రధాన రహదారుల వెంట వర్షపు నీరు సులభంగా వెళ్లేలా మార్గాలను తెరవాలని, అవసరమైన చోట మట్టి, కంకర నింపడం, మురుగు కాలువల పూడిక తొలగింపు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మ్యాన్‌హోల్స్, తెరిచి ఉన్న మురుగు కాలువలు, కల్వర్టుల వద్ద ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు, అడ్డుకట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన 120 నివాస భవనాలను మరోసారి పరిశీలించి, ప్రమాదకర భవనాల నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి తొలగింపు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, నిల్వ నీటిని తొలగించడం, దోమల నివారణకు మందుల పిచికారీ, పొగమందు కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమాలను వర్షాల నేపథ్యంలో సమర్థంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని, చెత్త నిల్వ కేంద్రం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పారిశుధ్య వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో నగరపాలక సంస్థ నియంత్రణ కేంద్రం 98499 06694కు సమాచారం అందించాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్. యాజ్ఞ, డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొహియుద్దీన్, వేణుమాధవ్, సహాయ కమిషనర్ రాజమనోహర్, కార్యనిర్వాహక ఇంజినీర్ లచ్చిరెడ్డి, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు వెంకటేశ్వర్లు, దేవేందర్, ఓం ప్రకాష్, శ్రీనివాస్, ఏసీపీ వేణు తదితర అధికారులు పాల్గొన్నారు.

## పాత బజారును పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్




**గోదావరిఖని, జూలై 30(సింగిడి):** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రామగుండం పాత బజారు ప్రాంతంలో ఏర్పడిన పరిస్థితులను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను సందర్శించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప వరద ప్రభావిత ప్రాంతాల్లో సంచరించవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని ఎమ్మెల్యే తెలిపారు.

## సింగరేణి కూల్చివేతపై అధికారులను ప్రశ్నించిన ఎమ్మెల్యే




**గోదావరిఖని, జూలై 30(సింగిడి):** తిలక్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను సింగరేణి అధికారులు కూల్చివేసిన ఘటనపై రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గురువారం ఘటనాస్థలిని సందర్శించి పరిశీలించారు. కూల్చివేతకు గల కారణాలపై సింగరేణి అధికారులను అడిగి తెలుసుకుని, సంబంధిత వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులను పరిశీలించిన ఎమ్మెల్యే, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, ఏసీపీ, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

## ఖనిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



**గోదావరిఖని, జూలై 30(సింగిడి):** గోదావరిఖని పరిధిలోని తిలక్ నగర్ చౌరస్తా పరిసర ప్రాంతంలో సింగరేణి భూమిలో జరుగుతున్న అక్రమ ప్రైవేట్ నిర్మాణాలను సింగరేణి స్పెషల్ స్క్వాడ్ బృందం పర్యవేక్షణలో అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, సింగరేణి భూముల్లో ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా ప్రైవేట్ నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎవరైనా సింగరేణి భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని వెంటనే తొలగిస్తామని హెచ్చరించారు.



# జిల్లాలోని అన్ని కార్యాలయాలు..
# ఈ ఆఫీస్ ద్వారానే ఫైళ్ళు పంపించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

**వనపర్తి ప్రతినిధి, జూలై 30 (సింగిడి):** జిల్లాలో అన్ని కార్యాలయాలు, మండల కార్యాలయాలు ఈ ఆఫీస్ ద్వారా మాత్రమే ఫైళ్ళు పంపించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, ఎంపిఓ లు, ఎ.పి.యం లతో ఆయా సంక్షేమ పథకాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ ఆఫీస్, ఇందిరమ్మ ఇళ్ల గుడిసెల సర్వే, ఎస్.ఐ.ఆర్, భూభారతి పెండింగ్ కేసులు, పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల అందజేత తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లాలో అన్ని కార్యాలయాలు తమ ఫైళ్ళను ఈ ఆఫీస్ ద్వారా మాత్రమే పంపించాలని కోరారు. ముఖ్యంగా భూభారతి ఫైళ్ళు ఈ ఆఫీస్ ద్వారానే రావాలని ఆదేశించారు. అన్ని మండల కార్యాలయాలు ఈ ఆఫీస్ కు మారాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పై సమీక్షిస్తూ గుడిసెలు లేని జిల్లాగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం గుడిసెలు ఉన్న పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఆయా మండలాలకు లక్ష్యం



నిర్దేశించి సర్వే బాధ్యతను ఎంపీడీఓలకు ఇవ్వడం జరిగిందన్నారు. సర్వే ఆఫీసర్ల ద్వారా గుడిసెలు ఉన్న ఇళ్లను సర్వే చేయించి త్వరగా నివేదిక ఇస్తే పరిపాలన మంజూరు ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పారు. రెండు మూడు రోజుల్లో సర్వే పూర్తి చేసి చెక్ లిస్ట్ పంపించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంకా పనులు ప్రారంభించని పేద ప్రజలతో మాట్లాడి ఇంటి నిర్మాణం చేపట్టే విధంగా చూడాలని, అవసరమైన వారికి మహిళా సంఘాల నుండి బ్యాంకు రుణాలు ఇప్పించాలని సూచించారు. ఎస్.ఐ ఆర్ గడువు మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉందని, ఇంకా పెండింగ్ లో ఉన్న ఎన్యూమరేషన్ లను త్వరతగతిన పూర్తి చేయాలని వెల్లడించారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వని ఓటర్లను గుర్తించి ఫారాలు తీసుకొని డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఒక్క ఓటరు కూడా నా దగ్గరికి రాలేదు .. ఫారం తీసుకోలేదని ఫిర్యాదు రావద్దని హెచ్చరించారు. అదేవిధంగా భూభారతికి సంబంధించి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని చెప్పారు. ఒక్కో తహసిల్దార్ వారిగా పెండింగ్ లో ఉన్న భూభారతి ఫైళ్ళ పై సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 7లోగా అన్ని పెండింగ్ ఫైళ్లు క్లియర్ కావాలని, అన్ని ఈ ఆఫీస్ ద్వారా పంపించాలని కోరారు. జలసిరి పథకం కింద జిల్లాలో భూగర్భ జలాలు పెంచేందుకు వి.బి.జి.రాంజీ పథకం కింద అన్ని మండలాల్లో నీటి కుంటల ఏర్పాటుకు స్థలం చూసి పనులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 222 నీటి కుంటలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వన మహోత్సవం మొక్కలు నాటి లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు ఎన్. ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్, డిఆర్డీఓ పీడీ ఉమాదేవి, ఆర్డీఓ సుబ్రమణ్యం, డి.పి.ఒ రఘునాథ్ రెడ్డి, డిప్యూటీ సిఈఒ రామ మహేశ్వర్ రెడ్డి, హౌసింగ్ పీడీ విటోబా తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ సేవలు మరింత సమర్థవంతంగా అందించాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి భువనగిరి జూలై 30 (సింగిడి):** యాదాద్రి జిల్లా లో అంగన్వాడీల కేంద్రాల ద్వారా అందిస్తున్న సంక్షేమ సేవలు మరింత సమర్ధవంతంగా అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం మినీ మీటింగ్ హాల్ లో జిల్లా మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్దుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధ్యక్షతన సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో బాల్య వివాహాలు, తీవ్ర లోప పోషణ ఉన్నా పిల్లలు, రక్తహీనతతో ఉన్న గర్భిణీ స్త్రీలు, దత్తత, బాల కార్మికులు, అనాధ పిల్లల సంరక్షణ, పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాల వారీగా లబ్ధిదారుల వివరాలు, తీవ్రమైన పోషకాహార లోపం (శామ్‌వీ), (సామ్) మోస్తరు పోషకాహార లోపం (హీమ్‌వీ) (మామ్) ఉన్న చిన్నారుల వివరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని



సూచించారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ పిల్లల పోషకాహార స్థితిని సక్రమంగా అంచనా వేసే సామర్థ్యాన్ని కలిగి ఉండాలని, పిల్లల బరువులను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా గుర్తించిన (సామ్, మామ్) శామ్‌వీ, హీమ్‌వీ పిల్లలను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లి వైద్యాధికారుల ద్వారా చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సూపర్ వైజర్ తమ పరిధిలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీల పూర్తి సమాచారాన్ని కలిగి ఉండి, వారికి అవసరమైన సేవలు అందేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జిల్లాలో బాల్య వివాహాల నివారణలో చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ, గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు (ఎజూజ), (విసిపిసి) మండల బాలల పరిరక్షణ కమిటీలు (ఎం సి పి సి) (వీజూజ) చురుకుగా పనిచేసేలా ఫీల్డ్ స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. త్వరలో శాఖల వారీగా ఏర్పాటు చేసిన అన్ని కమిటీల సమావేశాలను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ, జిల్లాలో నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు అసంపూర్తిగా ఉన్న సఖి కేంద్రాలు మరియు అంగన్ వాడీ కేంద్రాల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కృతిక, సాత్విక్ నాయక్, జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్, సీడీపీఓలు శైలజ, వెంకటరమణ, స్వరాజ్యం, నాజీ, అనంతలక్ష్మి, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సూపర్‌వైజర్లు, ఐసీపీఎస్ సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు

**హన్మకొండ ,జూలై 30(సింగిడి):** వర్ధన్నపేట నియోజకవర్గంలోని గ్రామాలలో డ్రగ్స్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే మాజీ ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అధికారులను ఆదేశించారు. హసన్ పర్తి ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు ఎమ్మెల్యేకు పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచులు,అధికారులు సమన్వయంతో గ్రామ ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఎల్ నీనో ప్రభావం వల్ల రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించాలనీ సూచించారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగస్వామ్యమై



ప్రజలకు అందుతున్నాయో లేదో అధికారుల దృష్టికి తీసుకోపోవాలని ఆయన తెలిపారు. తడి,పొడి చెత్తపై ఇప్పటికే గ్రామాలలో అవగాహన కల్పించమని,అయినప్పటికీ వాటిని పాటించడం లేదని ఇందులో సర్పంచులు సంబంధిత అధికారులు సమన్వయంతో ఉదయం వాకింగ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసుకొని గ్రామ ప్రజలకు మరోమారు అవగాన కల్పించాలన్నారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు తలెత్తితే అధికారులు తక్షణమే పరిష్కరించాలనీ అధికారుల ఆదేశించారు. గ్రామాల్లో చెట్లను నాటే కార్యక్రమం ఉద్యమంలా చేపట్టాలని సర్పంచులకు,అధికారులకుపిలుపునిచ్చారు. వైద్య,విద్య,వ్యవసాయ విషయంలోఎప్పటికప్పుడు అధికారులు గ్రామ ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో 16 అంశాలపై మాట్లాడి, సర్పంచులతో,అధికారులతో చర్చించారు. అనంతరం రేపు రిటైర్మెంట్ కాబోతున్న ఎంపివో కరుణాకర్ రెడ్డికి అధికారులు,సర్పంచులతో కలిసి ఎమ్మెల్యే ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు సేవలందించినందుకు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శేషాద్రి,డీఆర్డివో పిడి శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్మోహన్,మండల అధ్యక్షులుఅశోక్,ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాకేష్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి,సర్పంచులు,ఎంపీడీఓ,ఎమ్మార్వో, ఎంఇవో, డిఈలు,ఏఈలు, ఏవోలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- లబ్ధిదారులు ఇల్లు త్వరగా నిర్మించుకోవాలి
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**అమరచింత, జూలై 30 (సింగిడి):** ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన గృహ నిర్మాణాలను అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించేదా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం ఆయన అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్ తో కలిసి ఆత్మకూర్, అమరచింత మండలాలలో ఇళ్ల పురోగతిపై అధికారులతో సమీక్ష జరిపారు. మండలాలలో గుడిసెల్లో నివసించే వారిని పూర్తిస్థాయిలో ధృవీకరించి అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ లాగిన్ లో మా వద్దకు పంపాలన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూర య్యి కూడా ఇప్పటివరకు నిర్మాణం ప్రారంభించిన లబ్ధిదారుల జాబితాను పరిశీలించి వారిని వెంటనే నిర్మాణాలు ప్రారంభించేలా చైతన్యం కల్పించాలని ఆదేశించారు. ఆర్థిక కారణాలతో నిర్మించుకోలేని పరిస్థితి ఉంటే వారికి స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలను ఇప్పించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఒకవేళ మంజూరైన గృహాన్ని నిర్మించుకునేందుకు



లబ్ధిదారులకు ఆసక్తి చూపకపోతే సంబంధిత నిబంధనల ప్రకారం వారి మంజూరులను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తద్వారా ఆ గృహాన్ని మరో అర్హులైన నిరుపేద కుటుంబానికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆత్మకూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం తయారు చేసి అందజేయాలని పాఠశాల అధికారుల ఆదేశించారు. అవసరమైన చర్యలు తీసుకొని నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అదే పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులతో కలెక్టర్ మమేకమై పాఠశాలలో అందుతున్న భోజన వసతులను బోధన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి 10వ తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ ప్రోత్సహించారు. ఆత్మకూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణ స్థలాన్ని ఆయన పరిశీలించారు భవన నిర్మాణ నమూనాను పరిశీలించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు అవసరమైన సూచనలను చేశారు. అనంతరం కలెక్టర్ పట్టణంలోని ఐదో వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న భయం జానకమ్మ అనే లబ్ధిదారుల ఇంటిని కలెక్టర్ సందర్శించారు ఇంటి నిర్మాణం పనుల గురించి లబ్ధిదారులతో ఆరాతీసి కలెక్టర్ వారికి అభినందనలు తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆత్మకూరు పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ నమూనా గృహాన్ని సందర్శించి పరిశీలించారు. పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ విటోబా, ఆత్మకూరు అమరచింత తహసిల్దార్లు జెకె మోహన్, రవికుమార్ కమిషనర్లు నదీమ్, నరేష్ కుమార్ సంబంధిత శాఖ అధికారులు ఎంపీడీవోలు మున్సిపల్ అధికారులు ఇంజనీరింగ్ అధికారులు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోగులకు హెడ్ నర్స్ ఎవాంజెలిన్ సేవలు మరువలేనివి

సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్

**వనపర్తి ప్రతినిధి, జూలై 30(సింగిడి):** రోగులకు హెడ్ నర్స్ ఎవాంజెలిన్ సేవలు మరువలేనివని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ ప్రశంసించారు. వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 40 సంవత్సరాల పాటు రోగులకు అంకితభావంతో సేవలు అందించిన హెడ్ నర్స్ చీఫ్ వై.ఎవాంజెలిన్ బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఆమెకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవాంజెలిన్ సేవలు ఉత్తమం, అమూల్యమైనవని కొనియాడారు. ఎంతోమంది రోగులకు అమ్మలా సేవ చేసి ఆసుపత్రికి వెన్నుదన్నుగా నిలిచారని అన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా రోగుల సంరక్షణ కోసం చేసిన కృషి అభినందనీయమని, చిరునవ్వుతో ప్రతి రోగికి ధైర్యం చెప్పిన ఆమె మాటలు నేటికీ చెవుల్లో మారుమోగుతున్నాయని గుర్తు చేశారు. ఒక నర్సుగా మాత్రమే కాకుండా ఒక తల్లిగా, ఒక గురువుగా జూనియర్ నర్సులకు ఆదర్శంగా నిలిచారని, ఆమె క్రమశిక్షణ, అంకితభావం, మానవత్వం అందరికీ స్ఫూర్తి నిస్తుందని పేర్కొన్నారు. కష్టమైన సమయాల్లో కూడా చిరునవ్వు చెదరనివ్వకుండా విధులు నిర్వహించారని ఆయన అభినందించారు. పదవీ విరమణ తర్వాత కుటుంబంతో ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. సాహితీ కళా వేదిక తరపున శాలువా, జ్ఞాపికతో ఎవాంజెలిన్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పర్యవేక్షణ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ చంద్రమోహన్, ప్రొఫెసర్ డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ బంగారయ్య, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ రెడ్డి కుమారి పాల్గొన్నారు




## వానలు కురవాలి..
## పంటలు పండాలని పూజలు



**నూతనకల్,జూలై 30 (సింగిడి):** మండల పరిధిలో బక్కహేమ్లు తండ గ్రామంలో డప్పుల సప్పులు,సౌండ్ సిస్టంతో గురువారం వర్షం కోసం గుట్టులో ఉన్న లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి,గండి మైసమ్మ దేవతలకు వరుణుడు కరుణించాలని విస్తారంగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు నిర్వహించి. దేవతలకు బెల్లం నెయ్యి చేసిన పాయసం సమర్పించారు. సర్పంచ్ కృష్ణ నాయక్.. మాట్లాడుతూ దేవుళ్ళ ఆశీస్సులు ఉమ్మడి తండ ప్రజలపై ఉండాలని రైతులు వేసిన పంటలు బాగా పండి ధాన్య సిరులతో తులతూగాలని గిరిజనులు దేవుని ప్రార్థించారు. ఈ నాటి కార్యక్రమంలో సురేందర్,సైదా, రవి,సోమ్లు,పాచ్య, బాల్సింగ్, గిరిజన నాయకులు,మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలి

ఏ డి ఏ జగదీశ్వర్ రెడ్డి



**మిర్యాలగూడ, జూలై 30 (సింగిడి):** లెనోవా పరిస్థితుల వల్ల రైతులు ఆరుతడి పంటలను వేసుకోవాలని మిర్యాలగూడ డివిజన్ వ్యవసాయ అధికారి జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని శ్రీనివాస్ నగర్ లో పెసర, బొబ్బర్లు పంటలు మరియు జీలుగ సాగు క్షేత్రాలను సందర్శించి పరిశీలించారు. మాట్లాడిన ఆయన, రానున్న ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా వరి వంటి అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా ప్రాంతానికి అనుకూలమైన అరుతడి పంటల సాగు (క్రాప డైవర్సిఫికేషన్ ) వైపు రైతులు మళ్లాలని సూచించారు. దీంతో వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని సాగు వ్యయాన్ని తగ్గించడంతో పాటు రైతులు స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చుని వివరించారు. జీలుగ పంటను పరిశీలించి, దీనిని పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించడం వల్ల నేల సారవంతం పెరిగి, భూసార ఆరోగ్యం మెరుగుపడుతుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ మండల వ్యవసాయ అధికారి రుషేంద్ర మణి మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## గూడు కూలింది..

- వర్షాలకు ఒంటరి మహిళ ఇల్లు నేలమట్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



**మహాముత్తారం, జూలై 30 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కొత్త రేగులగూడెం గ్రామానికి చెందిన కాపుల లక్ష్మి అనే ఒంటరి మహిళ నివాసం ఉంటున్న పెంకుటిల్లు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కూలిపోయింది. ఇల్లు నేలమట్టం కావడంతో ఆమె ఒక్కసారిగా నిరాశ్రయురాలిగా మారింది. ఇంటి శిథిలాల మధ్య మిగిలిన సామగ్రిని చూసుకుంటూ కన్నీటి పర్యంతమైన లక్ష్మి, ప్రస్తుతం తలదాచుకునే స్థలం కూడా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రాణభయంతో కాలం గడుపుతున్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం వెంటనే స్పందించి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆర్థిక సహాయం అందించాలని లక్ష్మి వేడుకుంది. అధికారులు గ్రామాన్ని సందర్శించి నష్టాన్ని అంచనా వేసి తక్షణ సాయం అందించాలని గ్రామస్థులు కూడా కోరుతున్నారు. ఇటువంటి దుర్ఘటనల్లో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ ఉపశమనం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**మహాముత్తారం, జూలై 30 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాముత్తారం మండలం స్తంభంపల్లి (పీకే) గ్రామానికి చెందిన కోడి సుగుణ (50) బుధవారం తన కుమార్తెలను కాటారం హాస్టల్‌లో దింపేందుకు వెళ్లింది. అనంతరం సాయంత్రం బోర్లగూడెం గ్రామానికి చేరుకుని, అక్కడి నుంచి తన బంధువు ఒల్లల రమణయ్య బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరింది. మార్గమధ్యంలో అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చిన ఎద్దును బైక్ ఢీకొనడంతో ఇద్దరూ కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో కోడి సుగుణ తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను



జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భర్త కోడి పోషం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ డి. రాజయ్య తెలిపారు.

## ఎల్లంపల్లి నుంచి 1.71 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల



**గోదావరిఖని, జూలై 30(సింగిడి):** శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు గురువారం రాత్రి 8 గంటల సమయానికి 3,56,254 క్యూసెక్కుల వరద నీరు చేరింది. ప్రాజెక్టు నీటిమట్టం 147.70 మీటర్లకు చేరుకోగా, 19.3419 టీఎంసీల నీటి నిల్వ నమోదైంది. వరద ఉధృతి నేపథ్యంలో 15 గేట్ల ద్వారా 1,55,625 క్యూసెక్కులతో పాటు మొత్తం 1,71,650 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టులోని 62 గేట్లలో ప్రస్తుతం 15 గేట్లు తెరిచి ఉంచినట్లు అధికారులు తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన జీవనం



**జమ్మికుంట జూలై 30 (సింగిడి):** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ చూపడంతో పాటు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని ఇల్లంతకుంట మండలం కనగర్తి గ్రామ సర్పంచ్ రామంచ సంపత్ అన్నారు. గురువారం బాలవికాస ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణలో హనుమకొండ లక్ష్మీ నరసింహ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్లు తేజస్విని, సంకీర్తన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ముఖ్యంగా యుక్తవయసు బాలికలు పోషకాలు అధికంగా ఉండే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో బాలవికాస కోఆర్డినేటర్లు కే. సుమలత, ఏ. స్వాతి, ఆసియా, గ్రామ కార్యదర్శి క్రాంతికుమార్, తాళ్లపల్లి శ్రీను, బాలవికాస విలేజ్ లీడర్ కవిత, లక్ష్మీ నరసింహ హాస్పిటల్ పీఆర్‌వోలు బిక్షపతి, సంపత్ రెడ్డి, రాజేష్, సిబ్బంది ప్రసన్న, భారతి, కృష్ణవేణితో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.

## ఎల్లంపల్లి జలాల విడుదల..
## అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక



**గోదావరిఖని, జూలై 30(సింగిడి):** ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 4 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ ప్రాజెక్టు, గోదావరి ఘాట్ ప్రాంతాలను పరిశీలించారు. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు, మత్స్యకారులు నదిలోకి వెళ్లవద్దని, అధికారులు జారీ చేసే హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అవసరం లేకుండా నదీ తీరాలకు వెళ్లడం, సెల్ఫీలు తీసుకోవడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.



# కొబ్బరి పాలతో చికెన్ బిర్యానీ

**కావాల్సిన పదార్థాలు: అర కిలో చికెన్, రెండు కప్పుల బియ్యం, ఒక కప్పు కొబ్బరి పాలు, రెండు ఉల్లిపాయలు, మూడు టమాటాలు, నాలుగు పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్, ఒక కప్పు పెరుగు, ఒక టేబుల్ స్పూన్ కారం, అర టేబుల్ స్పూన్ పసుపు, రుచికి సరిపడా ఉప్పు, మూడు టేబుల్ స్పూన్స్ నూనె, దాల్చిన చెక్క, లవంగాలు, యాలకులు, బిర్యానీ ఆకు, పుదీనాను తీసుకోవాలి.**

చికెన్ ఇలా మారినేషన్ చేయాలి: చికెన్‌లో కొద్దిగా పెరుగు, రుచిగా సరిపడా ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ కారం, అర టేబుల్ స్పూన్ పసుపు, ఒక టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వాటిని నానానివ్వాలి.



ఆ తర్వాత కుక్కర్‌లో కొద్దిగా నెయ్యి వేసి బాగా వేడి చేయాలి. అది వేడయ్యాక మసాలాలు కొద్దిగా దాల్చిన చెక్క, నాలుగు లవంగాలు, మూడు యాలకులు, బిర్యానీ ఆకు వేసి బాగా వేయించాలి. కట్ చేసిన ఉల్లిపాయ ముక్కలు వేసి బంగారు కలర్లోకి వచ్చే వరకు వాటిని వేయించాలి. ఇప్పుడు దీనిలో నాలుగు పచ్చిమిర్చి, మూడు టమాటాలు వేసి మెత్తగా అయ్యే వరకు కుక్ చేసుకోవాలి.

ముందుగా మారినేట్ చేసిన ఈ మిశ్రమంలో చికెన్ వేసి 15 నిమిషాల పాటు మిక్స్ అయ్యేలా కలుపుకోవాలి. చివర్లో పుదీనా, కొద్దిగా కొత్తిమీరను వేసి బాగా కలుపుకోవాలి ఆ తరువాత నానబెట్టిన బియ్యం, ఒక కప్పు కొబ్బరి పాలు,



అవసరమైన నీళ్లు పోయాలి. ఉప్పు వేసి 23 విజిల్స్ వచ్చేవరకు బాగా ఉడికించాలి.



# ఈ పండు తింటే చాలు..!

## బ్యూటీ పార్లర్‌కు వెళ్లే పని ఉండదు..

డ్రాగన్ ఫ్రూట్ అంటే..?:

కాక్టస్ జాతికి చెందిన ఈ పండును హిందీలో కమలం అని కూడా పిలుస్తారు. దీని పై తొక్క గులాబీ లేదా ఎరుపు రంగులో ఉండి, ఆకుపచ్చని ముళ్ల వంటి భాగాలతో డ్రాగన్ ఆకారాన్ని పోలి ఉండటం వల్ల దీనికి ఆ పేరు వచ్చింది. ఇందులో తెల్లటి గుజ్జు, ఎర్రటి గుజ్జు గల రెండు ప్రధాన రకాలు అందుబాటులో ఉన్నాయి.

**చర్మ ఆరోగ్యానికి ఎలా తోడ్పడుతుంది?:**

డ్రాగన్ ఫ్రూట్‌లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఉండే విటమిన్ సి చర్మంలో కొల్లాజెన్‌ను పెంచి చర్మాన్ని దృఢంగా, యవ్వనంగా ఉంచుతుంది. ఇది ముడతలు, సన్నని గీతలను తగ్గిస్తుంది. ఇది శరీరం నుండి విష పదార్థాలను బయటకు పంపడం ద్వారా చర్మానికి లోపలి నుండి సహజమైన మెరుపును ఇస్తుంది. చర్మంపై వాపును తగ్గించి, మొటిమలు మరియు మచ్చల సమస్యను దూరం చేస్తుంది. విటమిన్ ఇ, అధిక నీటి శాతం ఉండటం వల్ల చర్మం పొడిబారకుండా మృదువుగా మారుతుంది.

**14 రోజుల మ్యాజిక్:**
నిపుణుల ప్రకారం.. డ్రాగన్ ఫ్రూట్‌ను ఆహారంలో భాగంగా చేసుకుంటే దశల



వారీగా ఫలితాలు కనిపిస్తాయి. మొదటి వారం చర్మంలో పొడిదనం తగ్గి, ముఖం తాజాగా కనిపిస్తుంది. 10వ రోజు నాటికి చర్మపు రంగు మెరుగుపడి, అలసట తగ్గుతుంది. 14వ రోజుకు చర్మం తన సహజ కాంతిని, మృదుత్వాన్ని తిరిగి పొందుతుంది.

**ఎలా తీసుకోవాలి?:**

ఈ పండును పరగడుపున లేదా ఉదయం అల్పాహారంతో తీసుకోవడం శ్రేయస్కరం. జ్యూస్ లేదా స్మూతీ రూపంలో తీసుకుంటే పోషకాలు త్వరగా శరీరానికి అందుతాయి. అంతేకాకుండా దీని గుజ్జును నేరుగా ముఖానికి ఫేస్ మాస్క్‌లా వేసుకోవడం వల్ల చర్మం తక్షణ ఉపశమనం పొందుతుంది. డ్రాగన్ ఫ్రూట్ కేవలం సౌందర్యానికే కాదు, తక్కువ కేలరీలు ఉండటం వల్ల బరువు తగ్గడానికి కూడా ఎంతో ఉపయోగపడు తుంది. అయితే కేవలం ఆహారమే కాకుండా సరైన నిద్ర, తగినంత నీరు, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించినప్పుడే ఈ సౌందర్య ఫలం పూర్తి ఫలితాలను ఇస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

# ఈ చిన్న ట్రిక్ తెలిస్తే రోజూ రూ. 6 వేలు మీ సొంతం..! ఎంత ఇన్వెస్ట్ చేయాలంటే..?



ప్రస్తుతం యువతలో స్టాక్ మార్కెట్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం సంపాదించాలనే ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా ఆప్షన్స్ ట్రేడింగ్ ద్వారా రోజువారీగా రూ. 5,000 నుంచి రూ. 6,000 సంపాదించి, నెలకు లక్ష రూపాయల ఆదాయాన్ని చేరుకోవడం సాధ్యమేనని మార్కెట్ నిపుణులు అభిప్రాయ పడ్డారు. అయితే, ఈ మార్గాన్ని ఎంచుకునే వారు మార్కెట్ పరిస్థితులతో పాటు నష్టాలను కూడా ఎదుర్కొనేలా వ్యూహాలను కలిగి ఉండాలని స్పష్టం చేశారు.

పెట్టుబడి రకాలు, వాటితో ముడిపడి ఉన్న రిస్క్ గురించివిశ్లేషిస్తూ.. సురక్షితమైన బ్యాంక్ డిపాజిట్ల నుంచి అత్యంత రిస్క్‌తో కూడిన ఆప్షన్స్ ట్రేడింగ్ వరకు వివిధ రకాలు ఉన్నాయని తెలిపారు. బ్యాంక్ డిపాజిట్లు లేదా పోస్ట్ ఆఫీస్ పొదుపు పథకాల్లో రిస్క్ ఉండదు కానీ, ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే వాటి నుంచి వచ్చే లాభం చాలా తక్కువగా ఉంటుంది. అదే సమయంలో స్టాక్ మార్కెట్, ముఖ్యంగా ఆప్షన్స్ ట్రేడింగ్ అనేది 'అధిక రిస్క్ -- అధిక లాభం' అనే సూత్రంపై పనిచేస్తుంది. మార్కెట్ అవగాహన ఉన్నవారు ఒకే రోజులో పెట్టుబడికి మించిన లాభాలను ఆర్జించిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు.


మరోవైపు, భారత స్టాక్ మార్కెట్ ముఖచిత్రం గడిచిన కొన్నేళ్లలో గణనీయంగా మారింది. సెబీ ఇటీవల ట్రేడింగ్‌లో లివరేజ్, ఎక్స్‌పోజర్ నియమాలను కఠినతరం చేసింది. దీనివల్ల గతంలో ఉన్నట్లుగా తక్కువ పెట్టుబడితో భారీ మొత్తంలో ట్రేడింగ్ చేయడం ఇప్పుడు సాధ్యం కాదు. మార్కెట్ గరిష్ట స్థాయిలో ఉన్నప్పుడు ఇది ఇన్వెస్టర్ల భద్రతకు అవసరమని నిపుణులు భావిస్తున్నారు. కేవలం అదృష్టాన్ని నమ్ముకుని కాకుండా, మార్కెట్ సబ్జెక్టును క్షుణ్ణంగా చదువుకుని ప్రవేశించడం ద్వారా మాత్రమే ఈ రంగంలో నిలదొక్కుకోగలరని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## స్టాక్ మార్కెట్ Stock Market


# భారత్‌కు 'ఆటోగ్రాఫ్ కలెక్షన్ హోటల్' బ్రాండ్

## హరియాణాలోని కర్నాల్‌లో నూర్‌మహల్‌తో ప్రారంభం



**కర్నాల్:** అంతర్జాతీయ ఆతిథ్య సంస్థ మారియట్ ఇంటర్నేషనల్, హరియాణాలోని కర్నాల్‌లో నూర్‌మహల్ హోటల్‌తో మన దేశంలో తన 'ఆటోగ్రాఫ్ కలెక్షన్ హోటల్' బ్రాండ్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. కర్నాల్‌లోని ఎన్‌హెచ్ 44 హైవేపై ఉన్న కర్నల్ మన్‌బిర్ చౌదరి యాజమాన్యంలోని 176 గదులున్న ఈ రాజభవనం తరహా హోటల్, ఈ ప్రాంతంలోని భారతీయ కళ, కళాఖండాల సేకరణకు నిలయంగా ఉంది. మారియట్ ఇంటర్నేషనల్ అసాధారణమైన హోటల్ బ్రాండ్ల గ్లోబల్ పోర్ట్‌ఫోలియోలో భాగమైన ఆటోగ్రాఫ్ కలెక్షన్ హోటల్స్, చారిత్రాత్మక గ్రాండ్ ట్రంక్ రోడ్డు వెంట ఢిల్లీ-ఎన్‌సీఆర్ కర్నాల్‌లో 176 గదుల కలెక్టర్స్ ప్యాలెస్ అయిన నూర్‌మహల్‌ను ప్రారంభించడంతో భారతదేశంలోకి అడుగుపెడుతున్నట్లు ప్రకటించింది. దీంతో ఇది దేశంలో మారియట్ బోన్‌వాయ్ 19వ బ్రాండ్‌గా నిలిచింది. 'ఆటోగ్రాఫ్ కలెక్షన్ హోటల్స్' బ్రాండ్‌కు ప్రపంచవ్యాప్తంగా 55కు పైగా దేశాల్లో 360కి పైగా ప్రోపర్టీలు ఉన్నాయి. దక్షిణాసియాలో నూర్‌మహల్ అటువంటి 235వ హోటల్‌గా ఉండనుంది.

# బీమా తరహాలో పింఛన్ల రంగంలోకి నూరుశాతం ఎఫ్‌డీఐలు!



**ఢిల్లీ:** బీమా రంగం తరహాలో పింఛన్ల రంగంలోనూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని నూరు శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం పార్లమెంట్ వర్షా కాల సమావేశాల్లో సంబంధిత బిల్లును తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బీమా రంగంలోకి నూరు శాతం ఎఫ్‌డీఐలను అనుమతిస్తున్న సంగతి తెలిసిందే. అంతకు ముందు 74 శాతంగా ఉన్న ఎఫ్‌డీఐల పరిమితిని 100 శాతానికి పెంచుతూ గతేడాది పార్లమెంట్ చట్టం చేసింది.

పింఛను రంగంలో ప్రస్తుతం ఉన్న 49 శాతంగా ఉన్న ఎఫ్‌డీఐల పరిమితిని నూరు శాతానికి పెంచాలంటే 'పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం - 2013కు సవరణలు చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన సవరణ బిల్లునే వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ బిల్లులో పీఎఫ్ఆర్‌డీఏ నుంచి నేషనల్ పెన్షన్ సిస్టం (ఛీూ) ట్రస్ట్‌ను వేరు చేసే సవరణను కూడా పొందుపరచనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఎన్‌పీఎస్ ట్రస్ట్ వద్ద ఉన్న అధికారాలు, విధులన్నింటినీ ఓ ఛారిటబుల్ ట్రస్ట్ లేదా కంపెనీల చట్టం పరిధిలోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. పీఎఫ్ఆర్‌డీఏ నుంచి దీన్ని పూర్తిగా వేరు చేసి 15 మంది సభ్యులతో కూడిన ఓ బోర్డును ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### విద్యానగర్ కాలనీ సర్పంచ్ భూక్య శాంతి శ్రీ



**కొత్తగూడెం, (సింగిడి):** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని విద్యానగర్ కాలనీ సర్పంచ్ భూక్య శాంతి శ్రీ సూచించారు. భారీ వర్షాల కారణంగా పలుచోట్ల వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా పాత ఇళ్లలో నివసిస్తున్న వారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సర్పంచ్ తెలిపారు. ఎలాంటి ప్రమాద సూచనలు కనిపించినా వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. అలాగే వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రజలు దూరంగా ఉండాలని హెచ్చరించారు. విద్యుత్ శాఖ అధికారులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. వర్షాకాలంలో నీటి కలుషితంతో అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీటినే వినియోగించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా చిన్నచిన్న వ్యాధులను నివారించవచ్చని సర్పంచ్ భూక్య శాంతి శ్రీ పేర్కొన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలను పాటించాలని సర్పంచ్ విజ్ఞప్తి చేసారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు

## ప్రాధాన్యం ఇవ్వాలి

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### రూ.59 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### బర్మా క్యాంపులో కార్మిక సంక్షేమ భవనానికి శ్రీకారం



**కొత్తగూడెం, (సింగిడి):** అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కొత్తగూడెం ఎమ్మెల్యే అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో బుధవారం సుమారు రూ. 59 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎస్సీబీ నగర్ 14వ డివిజన్, పాతకొత్తగూడెం 12వ డివిజన్, 10వ డివిజన్ బూడిదగడ్డ, 58వ మరియు 49వ డివిజన్ల హనుమాన్ బస్తీలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం 24వ డివిజన్ బర్మా క్యాంపులో రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న కార్మిక సంక్షేమ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మురుగునీటి పారుదల, సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. రోడ్లు, డ్రైనేజీలు, సంక్షేమ భవనాల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, నాణ్యతా ప్రమాణాలతో పారదర్శకంగా పనులు నిర్వహించాలని కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే అభివృద్ధి పనులను ప్రజలు కూడా పర్యవేక్షించి అవసరమైన సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, కార్పొరేటర్లు కూరపాటి సుధాకర్, పొలమూరి ధనలక్ష్మి, బోయిన విజయ్ కుమార్, సుప్రియతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

### కండువా కప్పి పార్టీలో ఆహ్వానించిన ఎమ్మెల్యే కే ఆర్. నాగరాజు

**హన్మకొండ, (సింగిడి):** ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకుఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్అధికారి కేఆర్ నాగరాజు తెలిపారు. 14వ డివిజన్ ఎస్ఆర్ నగర్, బాలాజీ నగర్‌కు చెందిన సుమారు 250 మంది వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యేసమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పిపార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నచ్చి నియోజకవర్గ వ్యాప్తంగా పెద్దఎత్తున బీఆర్ఎస్, బీజేపీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జరుగుతున్నాయన్నారు. పార్టీలో చేరిన కార్యకర్తలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను గడపగడపకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వంపైదుష్ప్రచారం చేస్తున్న ప్రతిపక్ష నాయకుల మాటలకు తగిన రీతిలో జవాబుచెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, కూడావరంగల్ జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు, డివిజన్ అధ్యక్షులుఇంతియాజ్, ఎస్ఆర్ నగర్ గ్రామ శాఖ అధ్యక్షులు స్టాలిన్, వర్ధన్నపేటమున్సిపల్ చైర్మన్ సారంగపాణి, మాజీ కార్పొరేటర్ సులోచన సారయ్య, 3వ డివిజన్అధ్యక్షులు జన్ను కరుణాకర్, డివిజన్, మండల, గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అవకాడో ఫ్రూట్‌లో

# పోషక విలువలు సూపర్

### "జాతీయ అవకాడో దినం" సందర్భంగా..




***అవకాడో అనే ఆధునిక అమృత ఆహారం నేడు అద్భుత పోషక విలువలతో "సూపర్ ఫ్రూట్"గా ప్రసిద్ధిగాంచింది. అమెరికా లాంటి పాశ్చాత్య దేశాల్లో విస్తారంగా వినియోగిస్తున్న అవకాడో పండ్లు నేడు భారతదేశంలోకి అడుగిడి అందరికీ అమృత ఆహారంగా మన మెనూలో చేరింది. అవకాడో అనేది కూరగాయల వర్గానికి చెందినది కాదని, అది ఒక పండు అని తెలుసుకోవాలి. అవకాడో పండ్లను సలాడ్, టోస్ట్, స్మూథీస్, స్ప్రెడ్, రుచికరమైన పండుగా పలు రూపాల్లో ఉపయోగించడానికి అలవాటు పడుతున్నాం. ఇటీవల విశేష ఆదరణ పొందిన ఈ అద్భుత పండ్ల పోషక విలువలను ప్రజలకు తెలియజేయడానికి ప్రతి ఏట 31 జూలై రోజున "జాతీయ అవకాడో దినం" పాటించుట 2018 నుంచి పాటించుట ఆనవాయితీగా మారింది.***

**అవకాడో ఫ్రూట్ పోషక విలువలు:**

ఆరోగ్యకరమైన, రుచికరమైన అవకాడో పండ్లలో అత్యంత ముఖ్యమైన పోషక విలువలు ఉంటాయి. ఆర్చి పండ్లలో కన్న అవకాడో పండ్లలో అధిక పొటాషియం ఉంటుంది. చెట్టు నుంచి తెంపిన తర్వాతనే అవకాడో పండుతుంది. ఆకలి పెంచడానికి మంచి అపటైజర్‌గా పని చేస్తుంది. 2015లో అమెరికా దేశంలోనే దాదాపు 4.25 బిలియన్ల అవకాడో పండ్ల అమ్మకాలు జరిగాయి. గుండె ఆరోగ్యాన్ని పరిరక్షించే అవకాడోలో మంచి కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇన్సులిన్ నిరోధకతను సరి చేయగల అవకాడోలో విటమిన్ సి, ఈ, కె లాంటివి సమృద్ధిగా ఉంటాయి. అల్జీమర్స్ వ్యాధి కట్టడికి అవసరమైన ఒమెగా 3 ఫాటీ ఆమ్లాలు అవకాడోలో ఉంటాయి. అవకాడో ఉన్న ఓలిక్ ఆసిడ్ వల్ల చర్మం తేమతో ఎర్రబారకుండా, ఇర్రిటేషన్ కలిగించకుండా చర్మ ఆరోగ్యాన్ని సంరక్షిస్తుంది.

జాతీయ అవకాడో దినం వేదికగా ఈ సూపర్ ఫ్రూట్ పోషక విలువలను అవగాహన పరచడం, పలు కొత్త రకాల



అవకాడో రెసిపీలు, అవకాడో వంటల పోటీలు, మన భోజనంలో అవకాడోను నిత్యం చేర్చడం, అవకాడో ప్రేమికుల అభిప్రాయాలను తెలుసుకోవడం లాంటి ప్రచార కార్యక్రమాలు చేపట్టవచ్చు.

**డాక్టర్: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

## చుంచుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం






**కొత్తగూడెం ( చుంచుపల్లి)(సింగిడి):** చుంచుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటేశ్వరరావు అధ్యక్షతన, ఎంపీడీఓ సుభాషిని ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతి నిధు లు, శాఖల అధికారులు హాజరయ్యారు. సమావేశం లో మండలంలోని అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామాల్లో నెలకొన్న సమ స్యలు, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వ హించారు. ప్రజాప్రతినిధులు ప్రస్తావిం చిన సమస్య లను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సమావేశంలో సూచించారు.

## పారదర్శకంగా లాటరీ పద్ధతిలో వాహనాల లబ్ధిదారుల ఎంపిక

### జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడే, (సింగిడి):** ప్రధాన మంత్రి జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ ( పిఎం జే యు జి ఎ) పథకం కింద మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదల, ఆదాయ వృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం మంజూరు చేసిన ద్విచక్ర, మూడు చక్రాల వాహనాల లబ్ధిదారులను బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అంకిత్, ఐఏఎస్ అధ్యక్షతన ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పి ఎం ఎం ఎస్ వై) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో పారదర్శకంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు కమిటీ సమక్షంలో లాటరీ విధానాన్ని అనుసరించి లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ అర్హులైన ప్రతి మత్స్యకారుడు ప్రభుత్వ సహాయాన్ని పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి జి. శివ ప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలో ద్విచక్ర వాహనాల కోసం 274 మంది మత్స్యకారులు, మూడు చక్రాల వాహనాల కోసం 26 మంది మత్స్యకారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మత్స్యశాఖ డైరెక్టర్, హైదరాబాద్ కార్యాలయం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 51 ద్విచక్ర వాహనాలు, 12 మూడు చక్రాల వాహనాలు కేటాయించినట్లు తెలిపారు. కేటాయించిన వాహనాల సంఖ్య కంటే దరఖాస్తులు అధికంగా రావడంతో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన (పీఎంఎంఎస్‌ఎస్ వై) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. లాటరీ ప్రక్రియను కమిటీ సభ్యులు, జిల్లా మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు, మత్స్యకారుల సమక్షంలో పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించి ఎంపికైన లబ్ధిదారుల జాబితాను ఖరారు చేసినట్లు తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు తదుపరి ప్రక్రియ పూర్తి చేసి వాహనాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్, డీఆర్‌డీఓ ఎం. విద్యా చందన, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి. నాగలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబురావు, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి కె. మహేశ్వరరావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వి. రామిరెడ్డి, కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. టి. భరత్, జిల్లా మత్స్యశాఖ అధికారి జి. శివ ప్రసాద్ (కన్వీనర్), ప్రగతిశీల మత్స్యకారుడు పిట్టల సాయిలు, జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు, మత్స్యకారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 7 ఏళ్ల జైలు

**పాలకవీడు, (సింగిడి):** పాలకవీడు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు నెమ్మది పెద్ద వెంకటయ్యకు సూర్యాపేట ప్రత్యేక పోక్సో కోర్టు 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 3 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో నెల సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది. అలాగే బాధితురాలికి జిల్లా న్యాయ సేవల సంస్థ (ఖుూూూ) ద్వారా రూ. 5 లక్షల నష్టపరిహారం అందజేయాలని తీర్పులో పేర్కొంది. ఈ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. రఘురామయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించినట్లు, తీర్పు వివరాలను సూర్యాపేట డీసీఆర్‌బీ డీఎస్పీ టి. రవి ఒక ప్రకటనలో తెలిపారు.

## సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు



**చిలుకూరు (సింగిడి):** చిలుకూరు కాలువ వొడ్డున గల అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయిబాబా కు ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. సాయి నామాలతో భజనలు చేసి, సాయి సంకీర్తనలను ఆలపించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి చిలుకూరుకు చెందిన స్వామి సావిత్రమ్మ కుమారులు, స్వామి వెంకటేశ్వర్లు నీరజ, స్వామి శ్రీనివాస్ లక్ష్మి , స్వామి శ్రీహరి ఇందుకుమారి దంపతులు వారి కుటుంబ సభ్యులు సందీప్ సౌజన్య హరిదీప్ వాసవి సాయి ఆర్థిక సాయం అందజేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు కొడారు వెంకటేశ్వర్లు ఆలయ అర్చకులు చించాపట్టణం రజినీకాంత్ ఆచార్య, సమ్మిరెడ్డి మాదారపు లక్ష్మయ్య, కట్టెకోల చంద్రయ్య, శ్రీను, రోజా భవాని, లక్ష్మి, సావిత్రి, మంగమ్మ, పద్మ లావణ్య, సాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాంపల్లి దయారా హేమాద్రి క్షేత్రంలో

### ఘనంగా

## గిరి ప్రదక్షిణ

### పల్లకి సేవలో పాల్గొన్న కీసర సిఐ ఆంజనేయులు



**కీసర, (సింగిడి)::** కీసర దయారాలోని హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా గిరి ప్రదర్శన మహోత్సవంలో వందలాదిమంది భక్తులు పాల్గొని గోవిందా.. గోవిందా.. అని నామస్మర ణలతో కొండ చుట్టూ గిరి ప్రదక్షిణలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో కీసర పోలీస్ స్టేషన్ సిఐ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ ఉత్సవానికి విజయవంతంగా సహకరించిన భక్తులు, స్వచ్ఛంద సేవకులు, దాతలకు ఆలయ చైర్మన్ కే హనుమంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్య పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు

### శిక్షణా తరగతులను పరిశీలించిన జిల్ల విద్యా అధికారి రమేష్ కుమార్



**కల్వకుర్తి (సింగిడి):** విద్యార్థుల భవిష్యత్‌కు ప్రాథమిక విద్యే బలమైన పునాదని, ఆ దశలో అందించే బోధన నాణ్యతే వారి ఉన్నత విద్యతో పాటు జీవిత విజయాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, చదవడం, రాయడం లెక్కించడం వంటి ప్రాథమిక నైపుణ్యాల్లో సంపూర్ణ ప్రావీణ్యం కల్పించడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని డిఇఓ తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపులో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, వారు చూపే అంకితభావమే విద్యార్థుల అభ్యాస ఫలితాలను నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి హైదరా బాద్ (ఎస్‌సీఆర్టీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ టీచర్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఎస్‌జీటీ ఉపాధ్యా యులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణలో నాణ్యమైన విద్యా ప్రమాణాల అమలు, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ ఎఫ్ఎల్ఎన్. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థుల ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో అభ్యాస సామర్థ్యాల పెంపు, విద్యార్థి కేంద్రిత బోధనా విధానాలు, నిరంతర మూల్యాంకనం, సమర్థవంతమైన తరగతి గది నిర్వహణ వంటి అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ సందర్శించి పరిశీలించారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయు లతో ముఖా ముఖిగా మాట్లాడి శిక్షణలో బోధిస్తున్న అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదిలో అమలు చేయాల్సిన ఆధునిక బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరిచే కార్యాచరణ, ప్రతి విద్యార్థిని అభ్యాసంలో భాగస్వామిని చేసే విధానాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రాథమిక విద్యార్థుల్లో చిన్న వయస్సులోనే మంచి అభ్యాస అలవాట్లు పెంపొందితే వారి భవిష్యత్ విద్యాభ్యాసం మరింత సులభంగా సాగుతుందని తెలిపారు. ముఖ్యంగా చదవడం, రాయడం, లెక్కించడం వంటి ప్రాథమిక నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అవసరమైన చోట వ్యక్తిగత శ్రద్ధతో బోధన అందించాలని సూచించారు. ఒక విద్యార్థి కూడా అభ్యాసంలో వెనుకబడకుండా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.

పాఠ్యపుస్తకాలతో పాటు అదనపు పఠన సామగ్రిని కూడా విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి తరగతి గదిని విద్యార్థులు ఆనందంగా నేర్చుకునే అభ్యాస కేంద్రంగా తీర్చిదిద్దాలని డీఈఓ తెలిపారు. కేవలం ఉపన్యాస పద్ధతిలో కాకుండా కార్యకలాపాల ఆధారిత బోధన, కథలు, పాటలు, ఆటలు, చిత్రాలు, బొమ్మలు, బోధనా-అభ్యాస సామగ్రి టీ.ఎల్.ఎం. వినియోగం ద్వారా బోధనను ఆసక్తికరంగా మార్చాలని సూచించారు. విద్యార్థులు స్వయంగా పాల్గొని నేర్చుకునే అవకాశాలు కల్పిస్తే అభ్యాస ఫలితాలు మరింత మెరుగుపడతాయని వివరించారు. ఎస్‌సీఆర్టీ రూపొందించిన శిక్షణా మాడ్యూళ్లను ప్రతి ఉపాధ్యాయుడు పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి వాటిని తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న బోధనా పద్ధతులను రోజువారీ బోధనలో వినియోగిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ముఖ్యంగా ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను నిర్దేశిత గడువులోపు పూర్తిచేసేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. అభ్యాసంలో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి వారికి అదనపు బోధన, ప్రత్యేక తరగతులు, వ్యక్తిగత మార్గదర్శకత్వం అందించాలని డీఈఓ సూచించారు. ప్రతి విద్యార్థి కనీస అభ్యాస నైపుణ్యాలను తప్పనిసరిగా సాధించేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, విద్యార్థుల అభ్యాసంలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని కూడా పెంచాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని డీఈఓ చేప్పారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలు మరింత మెరుగుపడి, విద్యార్థుల అభ్యాస ప్రమాణాలు గణనీయంగా పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని తరగతి గదిలో ఆచరణలో పెట్టి ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్ నాయక్, ఉపాధ్యాయులు పర్వతాలు, శ్రీను, తదితరులు ఉన్నారు.

ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
31-7-2026

## కుమ్మర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి



**కోదాడ, (సింగిడి)** ఆర్థిక, విద్యా, రాజకీయంగా వెనుకబడిన కుమ్మరి (శాలివాహన) కులాన్ని బీసీ–బీ జాబితా నుంచి ఎస్టీ జాబితాలోకి మార్చాలని సూర్యాపేట జిల్లా కుమ్మరి (శాలివాహన) నాయకుడు కొలిచలం శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంచార జాతులుగా జీవిస్తున్న కుమ్మర్లకు విద్య, వృత్తి, ఉపాధి రంగాల్లో ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కుమ్మర్లపై జరుగుతున్న దాడులు, కులవివక్షను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, మట్టి కళను కాపాడేందుకు ప్రత్యేక ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## గురు పౌర్ణమి సందర్భంగా సూక్ష్మ కళాకృతి




**కోదాడ, (సింగిడి)**కోదాడ పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు వేగ్గలం నరేష్ చారి గురు పౌర్ణమిని పురస్కరించుకుని అంగుళం సుద్ద ముక్కపై అద్భుతమైన సూక్ష్మ కళాకృతిని రూపొందించారు. గురువుల పట్ల కృతజ్ఞత, గౌరవాన్ని ప్రతిబింబించేలా అత్యంత నైపుణ్యంతో ఈ కళాఖండాన్ని చెక్కారు. అతి చిన్న పరిమాణంలోనూ సూక్ష్మమైన వివరాలను ఆవిష్కరించడం ఆయన ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. గురువుల గొప్పతనాన్ని చాటి చెప్పే సందేశాన్ని తన కళ ద్వారా అందించిన నరేష్ చారిని స్థానికులు అభినందిస్తున్నారు. ఆయన రూపొందించిన ఈ సూక్ష్మ కళాకృతి గురుపౌర్ణమి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

### బస్ స్టాండ్‌ని ఆకస్మికంగా సందర్శించిన
## మధిర డి పో మేనేజర్ టి దేవరాజు



**తల్లాడ, (సింగిడి)**తల్లాడ మండల కేంద్రం లోని ఆర్టీసీ బస్ స్టాండ్ లో గురువారం మధిర డిపో మేనేజర్ టి దేవరాజు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం ఆర్టీసీ కాంప్లెక్స్ లో షాప్ ల వివరాలు వాటి అద్దె వసూళ్లు పెండింగ్ లో ఉన్న షాప్ ల వివరాలు కంట్రోలర్ ని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన అద్దె లు కట్టే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిత్యం ప్రయాణం చేసే ప్రయాణికుల సమస్యలు ఏమి లేకుండా చూడాలని ప్రతి బస్ పాయింట్ లో పెట్టి టైమ్ డేట్ సైన్ పెట్టి పంపించాలని కంట్రోలర్ కి డిపో మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో మధిర డిపో మేనేజర్ టి. దేవరాజు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి. వెంకటేశ్వర్లు, కంట్రోలర్ కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకులు సైదులు మృతి
### రైతు అంత్యక్రియలలో పాల్గొన్న నాయకులు.



**పాలేరు (సింగిడి)** స్థానిక మేజర్ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుడిబోయిన సైదులు అనారోగ్యంతో బాధపడు తూ బుధవారం మృతి చెందాడు. మృతుడు కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషించారు. ఆయన మృతదేహం ను పార్టీ మండలాధ్యక్షుడు కొడాలి గోవింద రావు, జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, బోయిన వేణు, మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావు, వెంకన్న, మాజీ ఎంపీటీసీ బొడ్డు బొందయ్య. పసుపులేటి ఉపేందర్, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్ తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ని తెలియజేశారు. ఆశ్రునయనాల మధ్య రైతు అంత్యక్రియలు. మండలం లోని మంగాపురంతండా లో విద్యుదాఘాతం తో మృతి చెందిన రైతు రామదాసు అంత్యక్రియలు ఆశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. సర్పంచ్లు ఆశోకరాణి, బోయిన వేణు, నాయకులు బచ్చలకూరి నాగరాజు, అంజని, ధీరావత్ రాధాకృష్ణమూర్తి, భూక్యా చిన్న నాయక్, సీత్యా, కడియాల నరేష్, గట్టిగుండ్ల విజయ్, వంశీ, రాంప్రసాద్ లు పాల్గొన్నారు.

## ప్రజా వైద్యాన్ని బలోపేతం చేయండి

### కార్పొరేట్ వైద్య దోపిడిని అరికట్టాలని
### జిల్లా సదస్సును జయప్రదం చేయండి: కీలుకాని లక్ష్మణ్.



**కుత్బుల్లాపూర్, (సింగిడి)** ప్రజా వైద్యాన్ని బలోపేతం చేయాలని, కార్పొరేట్ వైద్య దోపిడీని అరికట్టాలని ఆగస్టు 2న జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని బుధవారం ఉదయం షాపూర్ నగర్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద కుత్బుల్లాపూర్ సిపిఎం మండల కార్యదర్శి కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం కీలు కానీ లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అన్నారు. నేడు ప్రభుత్వం వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ వైద్య రంగాన్ని ప్రోత్సహించే విధానాలు అమలవుతున్నాయని, ఫలితంగా జ్వరం, జలుబు చేసి ఆస్పత్రులకు వెళితే వేల రూపాయలు ఖర్చు చేయవలసిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. శస్త్ర చికిత్స చేయించుకోవాలన్నా లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయని, వైద్య ఖర్చులు భరించలేక లక్షలాది కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని, దీనితో కొందరు చికిత్స చేయించుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారనీ ప్రభుత్వ విధానాలను తప్పుపట్టారు. ఇటీవల కుత్బుల్లాపూర్ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సిపిఎం బృందం సందర్శించి అక్కడికి వచ్చిన రోగులతో మాట్లాడిన సందర్భంలో సౌకర్యాలు అరకొరగా ఉన్నాయని,జనాభా కు తగ్గట్టు వైద్యులు లేరని, మందుల సరఫరా అరకొరగా ఉన్నదని పేర్కొన్నారు. కనీసం ప్రైమరీ హెల్త్ సెంటర్లలో పరికరాలకు కూడా రక్షణ లేకుండా పోయిందని, ప్రభుత్వ దవాఖానాల స్థలాలు, వాహనాల పార్కింగ్, చెత్త డంపింగ్ కేంద్రాలు గా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు ప్రభుత్వ వైద్యాన్ని పూర్తి గా నిర్వీర్యం చేసి ప్రైవేట్ కార్పొరేట్ లకు అప్పగించాలని చూస్తుందని, అలాంటి కుట్రలను తిప్పి కొట్టి ప్రభుత్వ వైద్యాన్ని కాపాడు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, శీను, సంతోష్, దుర్గనాయక్, కలీల్, షఫీ, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దమ్మపేట మండల సర్పంచుల ఆత్మీయ కలయిక

### నూతన మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక.. అధ్యక్షుడిగా వంక జానకిరామ్,.. ప్రధాన కార్యదర్శిగా కొమరం సుశీల..





**దమ్మపేట, (సింగిడి)**దమ్మపేట మండల సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం ఆద్యంతం ఆత్మీయ, ఆహ్లాదకర వాతావరణంలో అత్యంత విజయవంతంగా ముగిసింది. సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు, స్థానిక పెద్దలు పాల్గొని ఈ సందర్భంగా మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన సంఘం గౌరవ అధ్యక్షుడిగా మోకాల గురుమూర్తి, అధ్యక్షుడిగా వంక జానకిరామ్, ఉపాధ్యక్షుడిగా కురం అర్జున్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కొమరం సుశీల ఎన్నికయ్యారు. అలాగే కోశాధికారిగా పగడాల రమాదేవి, ప్రచార కార్యదర్శిగా సోయం లక్ష్మీదేవి, ఉప కోశాధికారిగా వి. అప్పారావు, మహిళా కార్యదర్శిగా సిద్దినా రాధాకుమారి ఎన్నికైయ్యారు. కార్యవర్గ సభ్యులుగా యాట్ల రామదాసు, మెచ్చు ఈదప్ప, మడకం వరలక్ష్మి, చీకటి రమాదేవి, గుజ్జుల శ్రీను, పూనం వెంకటేశ్వరరావు, కుంట రాజశేఖర్, యాట్ల రాజిరెడ్డి, తోగత్త అనిత తదితరులు నియామకమయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీల సర్వాంగీణ అభివృద్ధికి, సర్పంచులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. నిరంతరం ప్రజాసేవకు కట్టుబడి, అందరి సమన్వయంతో మండల ప్రగతికి శ్రమిస్తామని నూతన కార్యవర్గం సంకల్పం వ్యక్తంచేశారు.

## ఆరేపల్లి చేపల చెరువును సందర్శించిన మత్స్య పరిశోధన కేంద్ర బృందం





**అమరచింత, (సింగిడి):** ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన జాతీయ మత్స్య జన్య వనరుల కార్యక్రమంలో భాగంగా ఆత్మకూర్ మండలం ఆరేపల్లి గ్రామంలోని చేపల, రొయ్యల చెరువులను బుధవారం ఖమ్మం జిల్లా పాలేరు పరిశోధనా ఖమ్మం జిల్లా పాలేరు మత్స్యపరిశోధన కేంద్రం బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందంసభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ నాగరాజు, డాక్టర్ దివ్య, చేపల, రొయ్యలచెరువులను పరిశీలించి మాట్లాడారు. చేపల రొయ్యల పెంపకం వాటికి వచ్చే వ్యాధులకు ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలని చెరువు నిర్వాహకులు, మత్స్యకార్మికుడు ఏటి ఆనంద్ తో అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా వారు చేపల చెరువుల గురించి మాట్లాడుతూ ఆరేపల్లి లో చెరువుల పెంపకాన్ని కొనియాడారు. చెరువులలో చేపల పెంపకాన్ని ఆనంద్ తగిన చర్యలు తీసుకొని ఈ చేపల పెంపకాన్నిచేపట్టడం అభినందనీయమని ఆనంద్ ను కొనియాడారు.

## కడ్తాల్‌లో వైభవంగా నూతన హోండా షోరూం ప్రారంభం






**ఆమనగల్లు, (సింగిడి)**కడ్తాల్ మండల కేంద్రంలో ద్వారక హోండా నూతన షోరూంను బుధవారం ఘనంగా ప్రారంభించారు. హోండా జోనల్ సేల్స్ హెడ్ సునీల్ రెడ్డి, సర్వీస్ హెడ్ సురేష్ మరియు షోరూమ్ వ్యవస్థాపకులు బేల్మన్ అభిషేక్ రావు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొని రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హోండా వాహనాలు ప్రజలకు ఎంతో నమ్మకమైనవని, దేశంలోనే అత్యధిక అమ్మకాలతో మొదటి స్థానంలో ఉన్నాయని తెలిపారు. వాహన కొనుగోలుదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సెల్స్ ఇంచార్జ్ ప్రకాష్, ఏరియా సర్వీసింగ్ ఇంచార్జ్ సుబిన్ , స్టేట్ ఫైనాన్స్ బోర్డ్ మెంబర్ ఆసిఫ్ అలీ, పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, డిసిసి గూడూరు శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ నిర్వాహకులు వెంకటేశ్వర రెడ్డి రామకృష్ణ, చేగురి వెంకటేష్, రాములు, అశోక్, ఎర్రోళ్ల రాఘవేందర్, లాయక్ అలీ, తదితరులు పాల్గొన్నారు...

## మత్స్య సోసైటీ పై న్యాయ పోరాటం చేస్తా.

### సోసైటీలో కాంట్రాక్టర్ వ్యవస్థ నడుస్తుంది.. మత్స్య శాఖ అధికారుల పై కలెక్టర్ కు ఫిర్యాదు.
### గిరిజన సంఘం నాయకులు పాల్యాకోట్యా.




**పాలేరు (సింగిడి):** నేలకొండపల్లి మండలం లోని చెరువుమాధారం మత్స్యపారిశ్రామక సహకార సంఘం లో జరుగుతున్న అక్రమాలపై న్యాయ పోరాటం చేస్తానని తెలంగాణ గిరిజన సంఘం నాయకులు పాల్యా కోట్యా పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకర్ల సమావేశం ను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు... చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం నిబంధనలు ఉల్లంఘించి చేపల వేట కొనసాగించిందన్నారు. సోసైటీ లో కాంట్రాక్టర్ వ్యవస్థ ను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. స్థానికులకు చేపలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ ఇతర ప్రాంతాలకు తరలించారని ఆరోపించారు. మత్స్య సోసైటీ పై మత్స్యశాఖ కు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదన్నారు. ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యం పై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారి పై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. చెరువు కు ప్రభుత్వం 5. 34 లక్షల చేప పిల్లలను ఉచితంగా అందించింద న్నారు. ఆ చేపల ను మత్స్యకారులు వేట తో జీవనం సాగించా ల్సి ఉండగా... సోసైటీ పాలకులు కాంట్రా క్టర్ కు అప్పగిం చటం నిబంధన లకు విరుద్ధమన్నారు. ఇటీవల కాంట్రాక్టర్ జరిపిన చేపల వేటలో భారీ ఎత్తున చేపలు పట్టుకున్నారని ఆరోపించారు. జూన్ 30 తో చెరువు లీజ్ ముగిసిందన్నారు. తిరిగి మరోమారు చేపల వేట కోసం అనుమతి కోసం ప్రయత్నిస్తున్నారని అన్నారు. స్థానికులను అదే విధంగా మత్స్యకారులను కూడ చెరువు కట్ట వద్ద కు రాకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయటం ఎంత వరకు సబబు అన్నారు. సోసైటీ తో పాటు, మత్స్య శాఖ అధికారుల పై న్యాయం పోరాటం చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ చెరువుమాధారం చెరువు పై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

### జ్యోతి హాస్పిటల్‌లో తొలి ఓపెన్ హార్ట్
## బైపాస్ సర్జరీ విజయవంతం.




**మిర్యాలగూడ (సింగిడి)** మిర్యాలగూడ లోనే తొలి ఓపెన్ హార్ట్ సర్జరీ హైదరాబాద్ వంటి మహానగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి నుంచి మిర్యాలగూడ, పరిసర ప్రాంతాల ప్రజలకు ఉపశ మనం లభించింది. బుధవారం స్థానిక జ్యోతి హాస్పటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వీర్లపాలెం గ్రామానికి చెందిన 61 ఏళ్ల మహిళ తీవ్ర గుండెనొప్పితో ఆసుపత్రిలో చేరగా, వైద్య పరీక్షల్లో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల్లో తీవ్రమైన బ్లాకులు ఉన్నట్లు మా డాక్టర్స్ గుర్తించారు. వెంటనే శస్త్రచికిత్స అవసరమని నిర్ణయించిన వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా తెలియజేసిన వైద్యులు జూలై 20న కార్డియో థొరాసిక్ సర్జరీ (జుమా) విభాగం ఆధ్వర్యంలో ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ నిర్వహించారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో రోగి వేగంగా కోలుకుని ఐదో రోజే డిశ్చార్జ్ చేయడం మరొక అద్భుతం అని డాక్టర్స్ ప్రశంశలను కొనియాడారు. ఈ ఖరీదైన చికిత్సను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పూర్తిగా ఉచితంగా అందించడం మరో విశేషంగా నిలిచిందన్నారు. . శస్త్రచికిత్సలో సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ రమేష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, కార్డియాక్ అనస్థీషియా ఓ క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ లావణ్య కడిమి, డాక్టర్ కృష్ణ చక్ర, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మువ్వా రామారావు, కో–ఫౌండర్ డాక్టర్ జీవన జ్యోతి, డాక్టర్ మువ్వా శ్రీహర్షతో పాటు కార్డియాక్ స్టాఫ్, ఆరోగ్య మిత్రలు, సపోర్ట్ సిబ్బంది కీలక పాత్ర పోషించారు. మిర్యాలగూడతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అత్యాధునిక గుండె వైద్యసేవ లను అందించాలన్న సంకల్పం తోనే ఈ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రజల విశ్వాసం, సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను విస్తరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### సాయిబాబా ఆలయంలో
## గురుపౌర్ణమి వేడుకలు



**ఎల్బీనగర్, (సింగిడి):** దక్షిణ షిరిడిగా ప్రసిద్ధి గాంచిన దిల్‌సుఖ్‌నగర్ శ్రీ షిరిడి సాయి బాబా ఆలయంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిం చారు. గురుపౌర్ణమిని పురస్కరిం చుకుని ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తు న్నారు సాయినాథుడికి ప్రత్యేక అలంకర ణ లు, మహాభిషేకం, హారతులు,వేదమం త్రోచ్ఛా రణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు బాబా ఆశీస్సులు పొందేం దుకు బారులు తీరారు. ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంతో పాటు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ట్రస్టు సభ్యులు ప్రముఖులను శాలువాలతో ఘనం గా నిర్వహించారు. దేవాలయంలో జరుగు తున్న గురుపూజోత్సవం సందర్భంగా భక్తు లకు కల్పించిన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు, క్యూ లైన్లు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను కమిషనర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, భద్రతా పరంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురుపూ జోత్సవం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అవసరమైన భద్రతా, ట్రాఫిక్ శాంతిభద్రతల ఏర్పాట్లు చేపట్టబడ్డా యని పేర్కొన్నారు. పూజలు నిర్వహించిన వారిలో ఎల్ బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి,, హర్యానా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు, ఎల్బీనగర్ నియోజక వర్గ బీజేపీ ఇన్ చార్జ్ సామ రంగారెడ్డి, గడ్డి అన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ప్రముఖులు ఉన్నారు.

### రోగుల ఆరోగ్యమే ప్రాధాన్యం..
## మెరుగైన వైద్య సేవలు అందించాలి:
### రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్



**భిక్కనూర్, (సింగిడి)** ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ రవీందర్ నాయక్ వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం భిక్కనూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనం తరం పలు వార్డులను సందర్శించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందుల నిల్వలను పరిశీలించి అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో రవీందర్ నాయక్ మాట్లాడుతూ, వర్షాకాలం ముగిసే వరకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే ప్రతి గ్రామంలో ఫీవర్ సర్వే, ఫ్రైడే అండ్ డ్రై డే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా వైద్యాధికారి వెంకట్, మండల వైద్యాధికారి హేమీమా, ఆరోగ్య విస్తరణ అధికారి వెంకటరమణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జలసిరి కార్యక్రమానికి శ్రీకారం

### మ్యాజిక్ డ్రైన్లకు శంకుస్థాపన చేసిన
### జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు గుండు రామంజిగౌడ్



**హుజుర్నగర్, (సింగిడి)**హుజుర్నగర్ మండలం రాయినిగూడెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి ప్రోగ్రాం ఇంకుడు గుంతలు మ్యాజిక్ డ్రైన్లు బోర్వెల్ రీఛార్జ్ ఫామ్ బాండ్ ఇంటికి ఇంకుడు గుంత పొలాని ఫాంకుంటా ఊరికి ఊరకుంటలను అధికారులు మండల సర్పంచులకు సూచించటం జరిగింది మండల పరిధిలోని ప్రతి విలేజ్ లో చేయించాలని తపనతో మండల అధికారులైనటువంటి ఎంపీడీవో సరోజ ఎంపీ ఓ సురేష్, ఎంపీఓ ఇబ్రహీం, సిసి మేడం సుజాత, కార్యదర్శి సునీత ఫీల్డ్ అసిస్టెంట్ సునీత గ్రామ శాఖ వైస్ సర్పంచి నాగరాజ్ నెంబర్ శ్రీకాంత్ అధ్యక్షుడు గుండు సాంబయ్య గోవిందు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కడ్తాల్ హత్య కేసులో
## నిందితునికి జీవిత ఖైదు



**ఆమనగల్లు, (సింగిడి)** కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన భార్య హత్య కేసులో గౌరవ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2023 జూన్ 12న కడ్తాల్ మండలం కర్కల్‌పహాడ్ గ్రామంలోని ఫాంహౌస్‌లో వల్లపూడాసు స్వరూపను హత్య చేసిన భర్త శ్రీనివాస్‌కు షాద్‌నగర్ కోర్టు జీవిత ఖైదుతో పాటు ఐదు వేల రూపా యల జరిమానా విధించింది. సాక్ష్యాధారాలను పరిశీలిం చిన జడ్జి స్వాతి రెడ్డి ఈ తీర్పునిచ్చారు. సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితునికి శిక్ష పడేలా చేసిన పోలీసు అధికారులు కడ్తాల ఎస్ఐ హరిశంకర్ గౌడ్, ,సర్కిల్ ఇన్స్పెక్టర్లు జె. ఉపేందర్ రావు, జె . వెంకటేశ్వర్లు, ఉన్నత అధికారులు అభినందించారు.

## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి..
ఎంఈఓ వెంకటేశం



**రాజేంద్రనగర్, (సింగిడి)** విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు వారి పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల విద్యాధికారి వెంకటేశం ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. బండ్లగూడ జాగిర్ డివిజన్ పరిధిలోని హైదర్ షాకోట్ ప్రభుత్వ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్లకు గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఈఓ వెంకటేశం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు ప్రతి పాఠశాలలోని ప్రతి విద్యార్థికి చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. చదువుతో పాటు విద్యార్థులలో క్రమశిక్షణను అలవర్చాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి శ్రద్ధ వహించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును, రోజువారీ హాజరు శాతాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలి. విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడమే కాకుండా, క్రమం తప్పకుండా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి పిల్లల ప్రతిభను వారికి తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సునీల్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఆర్‌పీలు కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, రాఘవేందర్, శ్రీనివాస్, ఎమ్.ఐ.ఎస్. రాఘవేందర్, సి.ఆర్.పి. సుదర్శన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రచ్చపల్లి పాఠశాలలో గురు పౌర్ణమి వేడుకలు



**ధర్మారం (సింగిడి)** మండలంలోని రచ్చపల్లి గ్రామంలో ఈరోజు గురు పౌర్ణమి సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాస మహర్షి విశిష్టత మరియు గొప్పదనం గురించి వివరించారు అనంతరం వ్యాసుడి శ్లోకాన్ని విద్యార్థులచే చెప్పించారు గురువు యొక్క గొప్పతనాన్ని పిల్లలకు అర్థమయ్యేలా ప్రధానోపాధ్యాయులు సముద్రాల వంశీ మోహన చార్యులు తెలియజేశాడు. ఈ వేడుకలలో సహ ఉపాధ్యాయులు లక్ష్మణ్ సౌమ్య కాణంపల్లి ప్రధానోపాధ్యాయు రాలు స్వర్ణలత గొల్లపల్లి ప్రధాన ఉపాధ్యాయురాలు రజిత ను ఘనంగా సత్కరించారు.

## సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం




**ధర్మారం (సింగిడి)** ఈరోజు ఉపసర్పంచ్ ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ఆదేశాల తో జిల్లా గౌరవ అధ్యక్షులు జంగా అనిల్ ఆధ్వర్యంలో వారి హక్కుల సాధనకై జిల్లా కలెక్టర్ కు కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. ఉప సర్పంచ్ లా ప్రధాన డిమాండ్లు వారి గౌరవేతనాన్ని 5000 గా వార్డు సభ్యునికి 3000 ఇవ్వాలని అలాగే అభివృద్ధి కార్యక్రమాలలో శిలాఫలకాలపై తప్పనిసరిగా తమ పేర్లు ఉండాలని ఉపాధి హామీ చెక్కుల పైన కూడా ఉపసర్పంచ్ ల సంతకం తప్పనిసరిగా చేయాలని స్టాండింగ్ కమిటీలలో వైస్ చైర్మన్ గా చేర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు జంపన్న ధర్మాల మండల అధ్యక్షులు భువనగిరి అజయ్ కుమార్ గౌరవాధ్యక్షులు ఏలిగేటి మల్లేశం తీగుళ్ళ కవితా సతీష్ రెడ్డి భరత స్వామి నాగభూషణం అడిగే రవికుమార్ తమ్మినవేణి రాజయ్య కత్తెర లచ్చయ్య, తడువాయి ప్రమోద్ రెడ్డి, కోల తిరుపతి బెజ్జంకి యమున రాజేందర్ తిరుపతి దయ్యాల రజిత రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ లోకి చేరిన మణికొండ
## బి ఆర్ ఎస్ నాయకుడు ఎల్లస్వామి



**రాజేంద్రనగర్, (సింగిడి)** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన నాయకులు ఎల్లస్వామి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో ఆయన కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణ రెడ్డి ఎల్లస్వామికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రవేశపెడు తున్న సంక్షేమ పథకాలు, ప్రజాపాలనకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ లో చేరుతున్నారని తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం, స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఎల్లస్వామి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మణికొండ డివిజన్ అధ్యక్షుడు శ్రీరాములు, నార్సింగి మార్కెట్ డైరెక్టర్ కుమార్, నాయకులు గంగాధర్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### ఐదేళ్లలోపు చిన్నారులకు
## ఈ–కేవైసీ అవసరం లేదు:
### తహసీల్దార్ సునీత



**భిక్కనూర్, (సింగిడి):** మండలంలోని రేషన్ కార్డు లబ్ధిదారులు ఈ నెల 31వ తేదీలోగా తప్పనిసరిగా ఈ–కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని భిక్కనూర్ తహసీల్దార్ సునీత సూచించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఈ–కేవైసీ అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ, రేషన్ డీలర్లు తమ దుకాణాలను నిర్ణీత సమయాల్లో తెరిచి ఉంచి ప్రతి లబ్ధిదారుడికి ఈ–కేవైసీపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి రేషన్ కార్డుదారుడు గడువులోగా ఈ–కేవైసీ పూర్తి చేసుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. లబ్ధిదారులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ సునీత కోరారు.

# మంత్రి సమక్షంలోనే అధికారుల నిర్లక్ష్యం..!

పంచాయతీరాజ్ శాఖ డీఈ, ఏఈ ఫోన్లతో కాలక్షేపం
అదే సమావేశంలో శాఖ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి.. అయినా ఫోన్లలోనే నిమగ్నమైన అధికారులు
ఒకే శాఖకు చెందిన ఇది ఇద్దరు అధికారుల నిర్లక్ష్య ధోరణి



**హుస్నాబాద్ (సింగిడి)** హుస్నాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామపంచాయతీ అభివృద్ధి కార్యక్రమాల సామర్థ్య పెంపు, అభివృద్ధి పనుల అమలుపై సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతుండగా, పంచాయతీరాజ్ శాఖకు చెందిన డిప్యూటీ ఇంజనీర్ (డీఈ), అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) సమావేశంపై దృష్టి సారించకుండా సెల్‌ఫోన్లు చూస్తూ కాలక్షేపం చేస్తూ కనిపించారు. ఒకే శాఖకు చెందిన పై అధికారి, కింది అధికారి అయిన డీఈ, ఏఈ ఇద్దరూ మంత్రి సమక్షంలోనే ఫోన్లలో నిమగ్నమవడం సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, పలువురి దృష్టిని ఆకర్షించింది. ఇదే సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ పనితీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, రోడ్ల అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సంబంధిత అధికారులను హెచ్చరించారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయితే, శాఖ పనితీరుపై మంత్రి



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సమయంలోనే అదే శాఖకు చెందిన డీఈ, ఏఈలు ఫోన్లలో నిమగ్నమై ఉండటం చర్చనీయాంశంగా మారింది. ప్రజా సమస్యల పరిష్కారంపై అత్యంత కీలకమైన సమీక్షా సమావేశంలో అధికారులు ఈ విధంగా వ్యవహరించడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశాల్లో అధికారులు పూర్తి శ్రద్ధతో పాల్గొని తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

# గురు పౌర్ణమి సందర్భంగా.. అన్నదానం...

వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు రాయల రాము
ఉచిత హెల్త్ క్యాంపు కార్యాలయం ను ప్రారంభించిన సత్తుపల్లి బి ఎల్ వో ఇంచార్జి రాయల రాము







**తల్లాడ, (సింగిడి)** తల్లాడ మండలంలోని ముద్దునూరు గ్రామంలో గురు పౌర్ణమి పురస్కరించుకొని బుధవారం స్థానిక సాయిబాబా దేవాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి నియోజ కవర్గ బిఎల్ఎ ఇంచార్జ్ రాయల రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించి రోగులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురు పౌర్ణమి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమని కమిటీ నిర్వాహకులను అభినందించారు. ఆయన కుడా ఉచిత వైద్య శిబిరం లో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. హెల్త్ క్యాంపు కు వస్తున్న సందర్భంగా ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయినాల నరసింహారావు, ఎస్ వి రెడ్డి, వనిగండ్ల శ్రీనివాసరావు, సాధం లక్ష్మణరావు, జి సత్యనారాయణ, అన్నెం కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

గ్రామాల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు: మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, (సింగిడి)** హుస్నాబాద్ మండలంలోని అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, మంజూరైన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో జరిగిన సమీక్షా సమావేశంలో గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, తాగునీటి సమస్యలు, వ్యవసాయ రంగం, విద్యుత్ సరఫరా, రవాణా సౌకర్యాలు, పంచాయతీరాజ్, రోడ్లు, విద్యా రంగం, ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముందస్తు అనుమతి లేకుండా సమావేశానికి గైర్హాజరైన విద్యుత్ శాఖ ఏఈ తీరుపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సభలకు సైతం ఏఈ హాజరుకావడం లేదని సర్పంచులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ప్రజలకు అందుబాటులో ఉండకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాతవాహన యూనివర్సిటీ పనుల కోసం రూ. 15 లక్షలు చెల్లించినప్పటికీ ఇప్పటివరకు విద్యుత్ కనెక్షన్ ఎందుకు ఇవ్వలేదని మంత్రి అధికారులను నిలదీశారు. సంబంధిత సమస్యను వెంటనే పరిష్కరించి విద్యుత్ కనెక్షన్ అందించాలని ఆదేశించారు. హుస్నాబాద్ మండలంలో మంజూరైన 240 ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటికే 210 ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన ఇండ్ల పనులను వెంటనే ప్రారంభించాలని, నిర్లక్ష్యం చేస్తే ఆయా ఇళ్ల మంజూరులను రద్దు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసిన గ్రామాలకే తదుపరి విడతలో ప్రాధాన్యతనిస్తూ అదనపు ఇండ్లను మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖలకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పెండింగ్ టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో మంజూరైన అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పొట్లపల్లి, పందిళ్ళ, కోహెడ రూట్లలో తక్షణమే ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఈ ఊరికి బస్సు రాలేదు అనే మాట నా దృష్టికి రావద్దని స్పష్టం చేశారు. ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యం అందేలా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో, తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని మంత్రి సూచిం చారు. రైతులకు



ఆరుతడి పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని, తక్కువ నీటితో అధిక దిగుబడి వచ్చే పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. హుస్నాబాద్ మండలానికి సమీపంలో నర్మేటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఉన్నందున, మండలంలోని గ్రామాల్లో ఆయిల్ ఫామ్ సాగును విస్తృతంగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఆయిల్ ఫామ్ సాగుకు అందుబాటులో ఉన్న సబ్సిడీలు, విత్తనాలు, ఎరువులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ పిట్లు ఏర్పాటు చేసి భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామంలో జలశక్తి సంరక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, నీటి సంరక్షణలో ముందుండే గ్రామాలు అభివృద్ధిలోనూ ముందంజలో ఉంటాయని పేర్కొన్నారు. రెండున్నర ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్న అర్హులైన రైతులు ప్రభుత్వ నిబంధనల మేరకు రూ. 2. 50 లక్షల సహాయంతో వ్యవసాయ బావులను తవ్వుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి, మంజూరైన పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి కోరారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ కొండల్ రెడ్డి, ఎంపీడీఓ సురేష్, ఏఎంసీ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఫ్యాక్స్ చైర్మన్ శివయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ ఐలయ్య, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల్లోనూ భక్తుల వెల్లువ.. భక్తిశ్రద్ధలతో గురుపూజ

షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం





**మల్హర్, జూలై 29 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం ఎడ్లపల్లి గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సాయి భక్తులు, గ్రామస్తులు సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని సాయిబాబాను దర్శించుకుని కాకడ హారతి, అభిషేకం, సాయి సచ్చరిత్ర పారాయణం, గురుపూజ వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని దత్తాత్రేయ స్వామి, విఘ్నేశ్వరుడు, సరస్వతి దేవికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తిని పల్లకిలో గ్రామ పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయినామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. ఈ కార్యక్రమంలో ఎడ్లపల్లి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన షిర్డీ సాయి భక్తులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



### అయ్యప్ప సన్నిధిలో
## అన్నప్రసాద వితరణ

**కోదాడ, (సింగిడి)** తెలంగాణ శబరిమలగా పేరుగాంచిన అనంతగిరి శ్రీ అయ్యప్ప స్వామి సన్నిధిలో సంక్రాంతి నుంచి ప్రతి బుధవారం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం 29వ వారానికి చేరుకుంది. ఈ వారానికి వాయిలసింగారం గ్రామానికి చెందిన చుండూరు అనిల్ కుమార్––సింధు, జీవన్ భార్గవ్––గీతిక దంపతులు దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు కొండపల్లి వాసు, అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు అర్వపల్లి సత్యనారాయణతో పాటు జగిని ప్రసాద్, వద్దేపూడి వీరబాబు, కక్కిరేణి ప్రభాకర్, పొనుగోటి కనకయ్య, పి. నరసింహారావు తదితర అయ్యప్ప స్వాములు పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

### గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల
## సమస్యల పట్ల పోరాటం చేస్తాము..
### టీ డబ్ల్యు యం ఎఫ్ జిల్లా ఇంచార్జీ గుండా ఉపేందర్ రెడ్డి..



**పాలేరు (సింగిడి)** తెలంగాణ రాష్ట్రంలో ప్రతి గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల సమస్యల మీద తెలంగాణ వార్డు మెంబెర్స్ ఫోరం పార్టీలకు అతీతంగా పని చేస్తూ సమస్యల పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తుంది. గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులలో వార్డు సభ్యులను భాగస్వామ్యం చేయాలని కోరుతున్నాము. అభివృద్ధి శిలాఫలకం పైన గ్రామ వార్డు సభ్యులు పేర్లు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుచున్నాము. ప్రభుత్వం హామీ మేరకు వార్డు సభ్యులకు గౌరవ వేతనం మూడువేల రూపాయలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. అదేవిధంగా నా మీద నమ్మకం ఉంచి, టీ డబ్ల్యు యం ఎఫ్ ఖమ్మం జిల్లా బాధ్యతలు అప్పగించిన ఫోరం వ్యవస్థాపకులు నాగబెల్లి జ్యోతి గారికి ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలియచేస్తునాను. జిల్లాలో ప్రతి మండలం లో కమిటీలు పూర్తి చేసి, గ్రామ పంచాయతీ అభివృద్ధిలో పాలుపంచుకొని, ప్రజల సమస్యలు పరిష్కారం దిశగా ముందుకు సాగుతాం.

## వెల్దుర్తిలో ఎస్ఐఆర్ లో పాల్గొన్న బిజెపి అధ్యక్షుడు



**వెల్దుర్తి, (సింగిడి)** మండల సర్ ప్రవాసి అభియాన్లో భాగంగా భారతీయ జనతా పార్టీ వెల్దుర్తి మండలంలో మం డల అధ్యక్షులు పడిగే దాసు అధ్వర్యంలో ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ నిన్న ఉదయం 10 గంటల నుండి మొదటి రోజు నుండి రెండవ రోజు 12:10 నిమిషాల వరకు 11 బూత్ లలో బి ఎల్ ఎ 2 తో కలిసి పరిశీలన చేశారు అనంతరం మొదటి రోజు కార్యకర్త ఇంట్లో భోజనం చేసి రాత్రి వేళ కార్యకర్త ఇంట్లో విశ్రాంతి తీసుకోవడం జరిగిందని అన్నారు అదేవిధంగా రెండవరోజు పరివార క్షేత్రాలను కసిలి మరునాడు సర్ కార్యక్రమాల్లో పాల్గొని మండల కేంద్రంలో విజయవంతం కావడంతో ఈ కార్యక్రమాని ముగించుకోవడం జరిగింది. జిల్లా అధ్యక్షులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన బి ఎల్ ఎ 2 మండల నాయకులు కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఇదేవిధంగా బూత్ లో బీజేపీ పార్టీకి తగిన గుర్తింపు తీసుకురాగలరని కార్యకర్తలను కోరడం జరిగిందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ పేర్కొన్నారు.

### కొంగర లో సమగ్ర
## భూ సర్వే ప్రారంభం..



**పాలేరు (సింగిడి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వే ను నేలకొండపల్లి మండలం లోని కొంగర గ్రామంలో బుధవారం ప్రారంభిం చారు. భూ పంచాయతీలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే పథకం లో భాగంగా మండలం లోని కొంగర ను ఎంపిక చేశారు. గ్రామంలో ఉన్న భూములు ఎంత.. అందులో ప్రభుత్వం భూమి ఎంత... రైతులకు చెందిన భూములు ఎంత... గ్రామ విస్తీరణం ఎంత... పట్టా భూము లు... అసైన్మెంట్ భూములతో పాటు అన్ని రకాల భూములను గుర్తించనున్నారు. ఇప్పటికే గ్రామం మొత్తం కు సరి హద్దులను గుర్తించి రాళ్లను ఏర్పాటు చేశారు. ఈ సర్వే వలన రైతుల మధ్య భూ పంచాయతీ లు ఈ సర్వేతో సమిసిపోనున్నాయి. ఈ సందర్భంగా నేలకొండపల్లి తహశీల్దార్ పి. రాంప్రసాద్ – పాల్గొని.. సర్వేయర్, రెవిన్యూ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఆయన మాట్లాడుతూ.. కొంగర గ్రామంలో సమగ్ర భూ సర్వే కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్ ఆలస్యం మధుసూధన్రావు, జీపీవోఅశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హకీంపేట్ రైతులకు ఇస్తరెట్లా? దుద్యాల రైతులకు ఇయ్యరెట్లా?
### మహమ్మద్ జావిద్ బిఆర్ ఎస్ నాయకులు



**కొడంగల్, (సింగిడి)** కొడంగల్ అభివృద్ధి కి భూములు కోల్పోయిన హకీం పేట్ రైతులకు నష్టపరిహారం ఇచ్చారెట్లా? దుద్యాల రైతులకు ఇయ్యరెట్లా? అని బిఆర్ ఎస్ పార్టీ నాయకులు మహ్మద్ జావిద్ ధ్వజమెత్తారు. దుద్యాల మండల కేంద్రంలో సర్వే నెం. 363 పరిధిలోని 143 ఎకరాల రైతుల భూములకు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఎకరానికి రూ. 30 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, భూములు కోల్పోతున్న ప్రతి అర్హులైన రైతు కుటుంబానికిఇందిరమ్మ ఇల్లు, హకీం పేట్ తరహాలో 150 గజాల వెంచర్ ప్లాటు కేటాయించాలని, ప్రతి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల హక్కుల పరిరక్షణ కోసం మహాధర్నా నిర్వహించేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

## బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం



**మల్హర్, (సింగిడి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తాడిచర్ల ఓసీ–1 గనిలో బొగ్గు ఉత్పత్తి తీవ్రంగా ప్రభావితమైంది. వర్షాల కారణంగా సుమారు 18,000 టన్నుల బొగ్గు ఉత్పత్తి మరియు 2,40,000 మెట్రిక్ టన్నుల ఓవర్‌బర్డెన్ (రాదీ) తొలగింపు పనులు నిలిచిపోయాయని వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, ఖూచీ మూర్తి, మైన్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. వర్షాల కారణంగా గనిలో పనులు అంతరాయం కలగడంతో ఉత్పత్తి లక్ష్యాలపై ప్రభావం పడిందన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే పరిస్థితిని సమీక్షించి యథావిధిగా గని కార్యకలాపాలు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

# జోరు వానలో సైతం ఆగని గిరిప్రదక్షిణ..



కొండగట్టులో మంత్రుల ప్రత్యేక పూజలు
వర్షాలు సమృద్ధిగా
కురవాలని అంజన్నకు పూజలు .
ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్రణవ్

**జమ్మికుంట, (సింగిడి)** రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని,రైతులకు ఎల్ నీ నో నుండి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండా లని, నియో జవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కొండగట్టు అంజన్నను వేడుకున్నారు. బుధవారం రోజున కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు, చొప్పదండి శాసన సభ్యుడు మేడిపల్లి సత్యం ఆధ్వ ర్యంలో నిర్వహించిన కొండగట్టు గిరిప్రదక్షణలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్,అడ్లూరి లక్ష్మణ్,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, మున్నూరు కాపు కార్పొరేషన్ అధ్యక్షుడు బొమ్మ శ్రీరామ్ హాజరయ్యారు. వర్షం సైతం లెక్కచేయకుండా,గిరి ప్రదక్షణ రోజే భారీవర్షం పడడంతో భక్తులు, కార్యకర్తలు ఆంజనేయ స్వామి అనుగ్రహం కలిగిందని,ఆ స్వామి నామస్మరణతో ప్రదక్షణ పూర్తిచేశారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న అంజన్న అనుగ్రహం ప్రజలందరిపై,రైతులపై ఉండి,రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని,పాడి పంటలతో హుజూరాబాద్ నియోజకవర్గం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎల్ నీ నో పై వాతావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తుంటే కౌశిక్ రెడ్డి మాత్రం కరువు కాంగ్రెస్ తెచ్చిందని మాట్లాడడం కౌశిక్ రెడ్డి అవివేకానికి నిదర్శనమని,తానే శాస్త్రవేత్తలాగా మాట్లాడడం సిగ్గు చేటని,ప్రజలను ఇబ్బంది పెట్టేపనుల్లో బిఆర్ఎస్ నాయకులు మొదట ఉంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన

**డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు. ప్రజలు అప్రమత్తంగా ఉండాల : మేయర్ కోలగాని శ్రీనివాస్**

**కరీంనగర్, (సింగిడి)** నగరంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో టూ టౌన్ సమీపంలోని నాలా, మంచిర్యాల్ చౌరస్తా నాలా, వీ-పార్క్ సమీపంలోని నాలాతో పాటు పలు లోతట్టు ప్రాంతాలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ పథకం కింద జరుగుతున్న డ్రైనేజీ, వరద నీటి పారుదల పనుల పురోగతిని సమీక్షించిన మేయర్, పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాశ్వత పరిష్కారాల పై దృష్టి సారించాలని సూచించారు. నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి అవసరమైతే అదనపు యంత్రాంగాన్ని వినియోగించాలని, మున్సిపల్ సిబ్బంది, విపత్తు



స్పందన బృందాలు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేయర్ విజ్ఞప్తి చేశారు. శిథిలావస్థలో ఉన్న పాత మట్టి ఇళ్లలో నివసించే వారు భద్రత కోసం వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. 43వ డివిజన్‌లో గోడ కూలి ఇంటి పై పడిన ఘటనలో జేసీబీ సాయంతో శిథిలాలను తొలగించి ప్రమాదాన్ని నివారించినట్లు తెలిపారు. నగరంలోని ఇతర ప్రమాదకర భవనాలు, గోడలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు మున్సిపల్ కాల్ సెంటర్ 98499 06694 లేదా తమ డివిజన్ కార్పొరేటర్‌ను సంప్రదించాలని, అందిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయని మేయర్ తెలిపారు. ఈ పరిశీలనలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు పడాల శ్రీజ అజయ్, పొన్నం లక్ష్మీ మొండయ్య, సునావత్ భాస్కర్ నాయక్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన



**జమ్మికుంట, (సింగిడి) :** ప్రతి విద్యార్థి వారి తల్లిదం డ్రులకు రోడ్డు బాధ్యత గురించి అవగాహన కల్పించవలసిన అవసరం ఉందని పోలీస్ రోడ్ సేఫ్టీ ఇన్స్ట్రక్టర్ ధనరాజ్ తెలిపారు. ఇల్లందకుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో సుప్రీంకోర్టు వారిచే ఏర్పాటుచేసిన రోడ్డు భద్రత అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ధనరాజ్, ప్రసాద్ లో మాట్లాడుతూ ద్విచక్ర వాహనం పై బయటకు వెళ్లేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణిం చేటప్పుడు సీటు బెల్టు తప్పకుండా ఉపయోగించాలని సూచించా రు. తాగి వాహనాలు నడపకూడదని రోడ్డుపై ప్రయా ణం చేసేట ప్పుడు బాధ్యతాయుతంగా నడపడంతో పాటు ఎదుటి వారి నుండి కూడా ఎలాంటి అపాయం కలగకుండా సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే లక్ష్యంగా వాహనాలు నడపాలని సూచిం చారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులు పిల్లల విష యంలో తగు జాగ్రత్తలు వహించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో మండల విద్యాధికారి రాములు, సర్పంచ్ దార సురేష్, ప్రధానో పాధ్యాయులు తస్మైన్ నస్మిన్, ఉపాధ్యాయులు జయ ప్రకాష్, వేణు, శంకర్ సమ్మిరెడ్డి, సత్యనారాయణ, అన్నపూర్ణ , రాధికా రాణి, సురేష్ ,ఉమాదేవి, ఐలయ్య రామకృష్ణ, పరమేష్ , వనిత దేవేందర్ ,స్రవంతి ,విశ్వతేజ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలకు
# జీజీహెచ్‌ను ఆదర్శ ఆస్పత్రిగా తీర్చిదిద్దాలి
## జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, (సింగిడి)** ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి జిల్లా ప్రధాన ఆస్పత్రి (జీజీహెచ్)ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె, వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవలు, మౌలిక సదుపాయాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీసిన కలెక్టర్, వేచిచూసే ప్రాంతాల్లో తగిన కూర్చొనే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆస్పత్రిలో లీకేజీలు, మరమ్మత్తులు, దెబ్బతిన్న నేలలు, గోడలు, తాగునీటి సదుపాయం, నీటి నిల్వ వ్యవస్థ, విద్యుత్ పనులు, అంతర్గత రహదారులు, వైద్యుల గదుల సౌకర్యాలు, అదనపు పడకల ఏర్పాటు వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయడంతో పాటు రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా సేవలందించాలని వైద్య సిబ్బందికి స్పష్టం చేశారు. తనిఖీ అనంతరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ నవీనా, ఇతర అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆస్పత్రి నిర్వహణ, ఆదాయం-వ్యయాలు, నిధుల వినియోగం, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వివరాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి నెల, త్రైమాసికం, అర్ధవార్షికం, వార్షిక ప్రాతిపదికన ఆదాయం-వ్యయాల బడ్జెట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. భవనాల అద్దెలు,



అంబులెన్సులు, జనరేటర్లు, వైద్య పరికరాలు, శీతలీకరణ యంత్రాలు, సీసీ కెమెరాలు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై సమీక్షించి, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రి నిర్వహణలో సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ నవీనా, వైద్యాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరద నీటి కాలువను పరిశీలించిన డిప్యూటీ మేయర్

**కొత్త కాలువ నిర్మాణానికి కృషి చేస్తామని వెల్లడి**
**నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్,యాదగిరి సునీల్ రావు**



**కరీంనగర్, (సింగిడి) :** నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు కాశ్మీర్ గడ్డ, ముకరంపుర, భగత్‌నగర్ ప్రాంతాల గుండా వెళ్లే ప్రధాన వరద నీటి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ నగరంలోని దాదాపు 70 శాతం మురుగు, వరద నీరు ఈ ప్రధాన కాలువ ద్వారానే ప్రవహిస్తుందని తెలిపారు. సుమారు 20 నుంచి 25 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ కాలువ ప్రస్తుతం ఎక్కడైనా దెబ్బతిన్నదా, నీటి ప్రవాహానికి ఆటంకాలు ఉన్నాయా అనే అంశాలను పరిశీలించినట్లు చెప్పారు. భారీ వర్షాల సమయంలో వరద నీరు కాలువను దాటి నివాస ప్రాంతాల్లోకి చేరకుండా, నిరాటంకంగా ప్రవహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. అలాగే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని లోపాలను సరిదిద్ది, రానున్న 20--25 సంవత్సరాలకు అనుగుణంగా కొత్త వరద నీటి కాలువను నిర్మించి, దానిపై స్లాబులు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు యాదగిరి సునీల్ రావు వెల్లడించారు.

### భగత్‌నగర్ దోపిడీ కేసు
# ఛేదించిన పోలీసులు

**బాధితుడి అల్లుడు, మనుమడే కుట్ర సూత్రధారులు, మీరట్‌కు చెందిన ముగ్గురు అరెస్ట్, నగదు, బంగారం, వెండి ఆభరణాల స్వాధీనం**



**కరీంనగర్, (సింగిడి) :** నగరంలోని భగత్‌నగర్‌లో ఇటీవల జరిగిన సంచలన ఇంటి దోపిడీ (డెకాయిటీ) కేసును కరీంనగర్ పోలీ సులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌లోని మీర ట్‌కు చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 2.09 లక్షల నగదు, 43.67 గ్రా ముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. భగత్‌నగర్‌కు చెందిన ఎం.డి. అజ్మత్ అలీ నివాసంలో అర్ధరాత్రి సమయంలో దుండగులు నకిలీ తుపాకులు, కత్తులతో చొరబడి కుటుంబ సభ్యులను బెదిరించి, వారి చేతులు, కాళ్లు కట్టేసి నగదు, బంగారం, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు ఘటనాస్థలం పరిసరాలతో పాటు నిందితులు ప్రయాణించిన మార్గాల్లోని సీసీటీవీ దృశ్యాలను, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులు మీరట్‌కు చెందిన వారిగా గుర్తించారు. ప్రత్యేక బృందాలు మీరట్‌కు వెళ్లి స్థానిక పోలీసుల సహకారంతో గాలింపు చేపట్టి, రైల్వే స్టేషన్‌కు పారిపోతున్న ముగ్గురు నిందితులను జూలై 29న అదుపులోకి తీసుకున్నాయి. అరెస్టయిన నిందితులు సల్మాన్ అలియాస్ భూరే అలియాస్ యాదవ్ (22), సల్మాన్ అలియాస్ విమాన్ (22), మొహమ్మద్ హాసీన్ (19). వీరి వద్ద నుంచి మొత్తం రూ. 2,09,000 నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకు న్నారు. దర్యాప్తులో బాధితుడి అల్లుడు రజావుద్దీన్ (ఏ-1), మనుమడు అజీమ్ రజా (ఏ-2) ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారులుగా పోలీసులు గుర్తించారు. కుటుంబ విభేదాలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో బాధితుడి ఇంట్లో ఉన్న నగదు, ఆభరణాలపై అవగాహన పెంచుకున్న రజావుద్దీన్ తన కుమారుడు అజీమ్ రజా, మీరట్‌కు చెందిన మరో ముగ్గురితో కలిసి పథకం రచించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నెల 20న మీరట్ నుంచి రామగుండానికి చేరుకుని, 21వ తేదీ అర్ధరాత్రి దోపిడీకి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. అరెస్టయిన ముగ్గురు నిందితులను ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలిస్తున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు రజావుద్దీన్, అజీమ్ రజాతో పాటు ఇతర నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి.

# ట్రాక్టర్ బోల్తా.. రైతు మృతి



**జమ్మికుంట, (సింగిడి) :** వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తున్న తరుణంలో ఓ రైతు ట్రాక్టర్ బోల్తాపడడంతో దాని కింద పడి మృతి చెందిన సంఘటన కరీంనగర్ జిల్లాలో చోటుచేసుకుంది.
జమ్మికుంట పట్టణంలోని దుర్గా కాలనీలో నివాసం ఉంటున్న అరకాల కుమారస్వామి(50) అనే రైతు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడ టంతో మృతి చెందాడు. కమలాపూర్ మండలంలోని బీం పల్లి గ్రామానికి చెందిన అరకాల వీర కుమారస్వామి గత కొద్ది సంవత్సరాలుగా జమ్మికుంట పట్టణంలోని దుర్గా కాలనీలో సొంత నివాసం కట్టుకొని జీవిస్తున్నాడు. బుధవారం భీంపల్లి లో తన పొలం పనులు చూసుకొని ఇంటికి తిరిగి వస్తుండగా అంకుసా పూర్ కన్నూర్ రోడ్డు మధ్య ఉన్న కెనాల్ వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు భార్య ఉన్నారు.

# కొండగట్టు గిరి ప్రదక్షణలో పాల్గొన్న హుజురాబాద్ కాంగ్రెస్ నేతలు



**జమ్మికుంట, (సింగిడి):** రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కొండగట్టులో రాష్ట్ర మంత్రులు ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షణలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబుతో కలిసి పాల్గొన్న నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు. రాష్ట్ర ప్రజల సుభిక్షంగా ఉండాలని సకాలంలో వర్షాలు కురిసి రైతులకు పంటలు బాగా పండాలని త్రాగునీటి సాగునీటి సమస్య లేకుండా ప్రజలు రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని సంకల్పంతో మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొప్పదండి ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కొండగట్టు లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో జోరు వానలో సైతం గిరి ప్రదక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ బాబుతో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు సాయిని రవి ఇల్లంతకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి తదితరులు పాల్గొన్నారు.

# జోరువానలో సైతం ఆగని నిత్య అన్నదానం

**అన్నపూర్ణ సేవా సమితి సభ్యుల సేవలు అభినందనీయం**



**జమ్మికుంట, (సింగిడి) :** జమ్మికుంట పట్టణంలోని శివాలయంలో నిర్విరామంగా గత 4 సంవత్సరాల నుండి అన్న పూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిరోజు నిత్య అన్నదాన కార్యక్ర మం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రతిరోజు ఉదయం 11 గంటలకు సుమారు 200 మందికి ప్రతిరోజు అన్నదానం చేస్తూ ఎంతో మంది పేదల కడుపు నింపు తున్న అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు. దాతల సహకారంతో నిర్విరామంగా నాలుగు సంవత్సరాల నుండి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తు న్నారు. అందులో భాగంగా బుధవా రం ఎడతెరపి లేకుండా కురుస్తున్న జోరు వానలో సైతం పేదలకు కడుపు నింపాలని సంకల్పంతో వర్షం పడుతున్నప్ప టికీ అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు సుమారు 15 మంది పేదలకు భోజనాలు అందించారు. జోరు వానలో సైతం అన్నపూర్ణ సేవాసమితి సభ్యులు చేసిన సేవకు పట్టణ ప్రజల నుండి ప్రశంసలు లభిస్తున్నాయి.

# గురు పౌర్ణమి సందర్భంగా జగదీశ్వర శర్మ కు ఘన సన్మానం

**గురువుల రుణం తీర్చుకోలేనిది ..: బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...**

**జమ్మికుంట, (సింగిడి) :** గురుపౌర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని వీణవంక బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. ఇట్టి వేడు కలకు ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి , స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి ప్రముఖ వేద పండితులు, ఆధ్యాత్మిక గురువు బ్రహ్మర్షి గుడా జధీశ్వర శర్మ ను ఘనంగా సన్మానించి, పాద ప్రణామం చేశారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ గురు వుల గొప్పతనాన్ని, సమాజంలో వారి ప్రాముఖ్యతను ఆయన కొనియాడారు. భారతీయ సనాతన సంప్రదా యంలో తల్లి దండ్రుల తర్వాత అంతటి స్థానం గురువులదేనని, వారు సమాజానికి దిశానిర్దేశం చేస్తారని గంగాడి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. "గురువుల ద్వారా మనం పొందే విజ్ఞానం, సంస్కారం అమూల్య మైనవని ,గురువులు మన జీవితానికి అందించే మార్గదర్శ కత్వం మరువలేనిది. వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిద న్నారు. సనాతన ధర్మాన్ని, వేద విద్య లను భావితరాలకు అందిస్తూ సమాజంలో నైతిక విలువలను పెంపొందించడంలో వేద పండితుల పాత్ర ఎనలేనిదని ప్రశంసిం చారు. బ్రహ్మర్షి గుడా



జధీశ్వర శర్మ వంటి మహనీయుల ఆశీస్సులు సమాజానికి శ్రీరామరక్ష అని ఆయన అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో వీణవంక బిజెపి నేతలు సిహెచ్ నరసింహ రాజు, పెద్ది మల్ల రెడ్డి ,ముత్యాల రవీందర్ కొమ్మటి శ్రీనివాస్ రెడ్డి ,తాళ్లపల్లి నాగరాజు, ఉడుత కుమార్, అప్పని కొమురయ్య, పుప్పాల రఘు, చర్ల రాజు,దాసరి భాస్కర్, అశోక్ ,సంతోష్,బాపన , దాట్ల వీరస్వామి అడిచర్ల రాజు, హరికృష్ణ లతోపాటు ఎండోమెంట్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ బుద్ధ మహేందర్ గుప్త, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, జిల్లా ధార్మిక సెల్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని ఎత్తిపోస్తోంది

**నంది-మేడారం, గాయత్రి పంప్‌హౌస్‌ల ప్రారంభానికి తమకే ఘనత అని చెప్పుకోవడం బీఆర్ఎస్ సిగ్గు చేటు**
**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు**



**కరీంనగర్, (సింగిడి) :** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన నంది-మేడారం, గాయత్రి పంప్‌హౌస్‌ల నుంచి సాగునీటిని విడుదల చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ రైతు సంక్షేమానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. ఈ చర్యకు తమ పోరాటమే కారణమని బీఆర్ఎస్ నేతలు చెప్పుకోవడం దౌర్భాగ్యమని విమర్శించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అందులో భాగంగానే నంది-మేడారం, గాయత్రి పంప్‌హౌస్‌లలోని బాహుబలి మోటార్లను ప్రారంభించి 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నామని చెప్పారు. రైతుల పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం బాధ్యతాయుతంగా చర్యలు చేపడుతుంటే, దానికి బీఆర్ఎస్ ఘనత తీసుకోవాలని ప్రయత్నించడం రాజకీయ అవకాశవాదమని అన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రచారానికే పరిమితమైందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయానికీ తమకే కీర్తి దక్కాలని అసత్య ప్రచారం చేస్తోందని విమర్శించారు. సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేసినా ప్రజలు వాస్తవాలను గుర్తించే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తోందన్నారు. రైతు సంక్షేమం, సాగునీటి నిర్వహణ, వ్యవసాయా భివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని, ప్రజలు బీఆర్ఎస్ దుష్ప్రచారాన్ని నమ్మే పరిస్థితి లేదని వెలిచాల రాజేందర్‌రావు స్పష్టం చేశారు.

# స్నేహితుడి ఇంట్లో రూ.26 లక్షల చోరీ....

**ఒక నిందితుడి అరెస్ట్, రూ.17.60 లక్షల నగదు, కారు, మొబైల్ ఫోన్ స్వాధీనం: పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**

**కరీంనగర్, (సింగిడి) :** కరీంనగర్ రూరల్ పోలీసులు భారీ ఇంటి చోరీ కేసును విజయవంతంగా ఛేదించి ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారు. కేసు వివరాలను బుధవారం రోజున రూరల్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్ననాటి స్నేహితుడి ఇంట్లో దాచిన రూ. 26 లక్షల నగదుపై ముందస్తు సమాచారంతో పథకం రచించి దొంగతనానికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పోలీసుల వివరాల ప్రకారం, పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఏక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన తగరం శంకర్ లాల్ (49) ఫిర్యాదుదారుడు, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి గుడిమల్ల శ్రీనివాస్‌కు చిన్ననాటి స్నేహితుడు. ఫిర్యాదుదారుడు కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి మాణిక్యేశ్వరి నగర్‌లో అద్దె ఇంటిలో నివసిస్తున్న విషయం, ఇటీవల వ్యవసాయ భూమి విక్రయించి నగదు ఇంట్లో ఉంచిన విషయం నిందితుడికి తెలుసు.
ఆర్థిక ఇబ్బందులతో ఉన్న శంకర్ లాల్, ప్రస్తుతం పరారీలో ఉన్న అడెపు రేష్మతో కలిసి ఫిర్యాదుదారుడి ఇంటికి వెళ్లాడు. ప్రధాన ద్వారం, బాత్‌రూమ్ తాళాలు పగులగొట్టి ఇంట్లో వెతకగా, ప్లాస్టిక్ డ్రమ్‌లో దాచిన పెట్టెలో ఉన్న రూ. 26 లక్షల నగదును అపహరించారు. ఈ ఘటనలో రేష్మ కూడా సహకరించినట్లు దర్యాప్తులో తేలింది. దొంగిలించిన నగదులో కొంత మొత్తాన్ని నిందితుడు వ్యక్తిగత అవసరాలకు వినియోగించగా, మరికొంత ఇతరులకు ఇచ్చినట్లు విచారణలో తెలిపాడు. మిగిలిన మొత్తాన్ని తన వద్దే ఉంచుకున్నట్లు అంగీకరించాడు. జూలై 29న బొమ్మకల్ బస్‌స్టాప్ సమీపంలో వాహనాల తనిఖీల సందర్భంగా కరీంనగర్



రూరల్ పోలీసులు శంకర్ లాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు నేరాన్ని ఒప్పుకున్నాడు. మరో నిందితురాలు అడెపు రేష్మ పరారీలో ఉండగా, ఆమె కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. స్వాధీనం చేసుకున్న ఆస్తి... రూ. 17,60,000 నగదు, నేరానికి ఉపయోగించిన స్విఫ్ట్ కారు, ఒక శాంసంగ్ మొబైల్ ఫోన్ నిందితుడిపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసు బృందానికి కమిషనర్ అభినందనలు,పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు, రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ పర్యవేక్షణలో కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి, ఉప నిరీక్షకుడు ఎ. లక్ష్మారెడ్డి మరియు వారి బృందం ఈ కేసును ఛేదించింది. పోలీసు బృందాన్ని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

విశ్వంభరతో పోటీ పడనున్న

# జైలర్-2

## అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు



వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఆయన అభిమానులు ఇప్పటినుంచే ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఆగష్టు 22న రానున్న మెగాస్టార్ బర్త్ డే కానుకగా ఆయన నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నుంచి అదిరిపోయే అప్‌డేట్ రాబోతున్నట్లు తెలుస్తుంది. దర్శకుడు మల్లిడి వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం, విజువల్ ఎఫెక్ట్స్ పనుల కారణంగా ఇంతకాలం ఆలస్యం అయినప్పటికీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా ముగింపు దశకు తీసుకువచ్చింది. యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అందాల తార త్రిష నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అద్భుతమైన బాణీలు, నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా, ఈ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్‌ను దసరా పండుగకు టా÷-గ్గ్÷ట్ చేస్తూ అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 22న చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా చిత్రబృందం ప్రకటించబోతున్నట్లు సమాచారం.



# రామాయణ ట్రైలర్ విడుదల

ఎన్నిసార్లు విన్నా.. ఎంతమంది చెప్పినా.. ఎన్ని యుగాలు మారినా అజరామరం రామ చరితం.. 'రామాయణం' నిత్యనూతనం. ఇప్పటికే ఎన్నోసార్లు దృశ్యరూపం దాల్చిన ఈ మహాకావ్యం ఇప్పుడు మరోసారి నేటితరం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. దర్శకుడు నితీశ్ తివారీ మలిచిన 'రామాయణ' ట్రైలర్ బ్రహ్మ ముహూర్తంలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, అబ్బురపరిచేలా ఉన్న హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సీతారాముల కల్యాణం, వనవాసం, రామరావణుడి యుద్ధం.. ఇలా ప్రతి ఫ్రేమ్ ఆ అద్భుత గాథను కళ్లకు కడుతోంది. దేవలోకం.. భూలోకం.. పాతాళలోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం.. రావణ రాజ్యం' అంటూ యశ్ పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ ప్రారంభమైంది.







Rakul Preet Singh

ట్రైలర్‌లో ఎక్కువ చర్చిస్తున్న పాత్రల్లో ఒకటి సీతాదేవి. సాధారణంగా మృదుస్వభావిగా చూపించే సీతమ్మను ఇందులో ఖడ్గం పట్టిన యోధురాలిగా చూపించారు. లక్షణ రేఖ సందర్భంలో కూడా ఆమె చేతిలో ఖడ్గం కనిపించడంతో ఇందులో ఆమె పాత్రను కొత్తగా చూపించనున్నట్లు అర్థమవు తోంది. పుష్పక విమానం రామాయణంలో ఎంతో కీలకం. గతంలో వచ్చిన చిత్రాల్లో ఇది సాధారణంగా కనిపించినా.. ఈ సినిమాలో మాత్రం భారీ తామరపువ్వు ఆకారంలో ప్రత్యేక డిజైన్‌తో చూపించారు. ఇక, లంకను జయించిన తర్వాత మూడు లోకాలపై ఆధిపత్యం సాధించాలని రావణుడు సంకల్పిస్తాడు. ఈ క్రమంలో దేవేంద్రుడితో యుద్ధానికి సంబంధించిన సన్నివేశాల్లో ఐరావతాన్ని అద్భుతమైన విజువల్‌తో ఆవిష్కరిం చారు. సీతను అపహరించే సమయంలో రావణుడిని అడ్డుకునే జటాయువు పాత్రకు ట్రైలర్‌లో మంచి ప్రాధాన్యం దక్కింది. భారీ గరుత్మంతుడిలా, శక్తిమంతమైన రూపంలో జటాయు వును చూపించడం విశేషం. శూర్పణఖ భర్త విద్యుజ్జిహ్వ పాత్రలో వివేక్ ఒబెరాయ్ కనిపించారు. రావణుడికి ఆయనకు మధ్య జరిగే ఘర్షణ చూస్తుంటే.. ఇప్పటివరకూ రామాయణంలో తెరపైకి రాని పాత్రలకు కూడా సముచిత స్థానం కల్పించినట్లు తెలుస్తోంది. రాముడి వనవాసానికి కారణమైన మంథర పాత్రను శీబా చద్దా పోషించారు. కైకేయిగా లారా దత్త ప్రత్యేకంగా కన్పించారు. శివధనుస్సు విరిచిన అనంతరం పరశు రాముడు రాముడిని కలిసే ఘట్టం కూడా ట్రైలర్‌లో ఉంది. తన ధర్మ బాధ్యతలను రాముడికి అప్పగించి తపస్సు కోసం వెళ్లే పరశు రాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కన్పించడం ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసింది. రాముడిని తిరిగి అయోధ్యకు తీసుకురావడానికి చిత్రకూటానికి వెళ్తాడు భరతుడు. రాముడు నిరాకరించడంతో ఆయన పాదుకలను సింహాసనంపై ఉంచి రాజ్యాన్ని పాలించిన సోదరుడిగా ఆదినాథ్ కొఠారే ఆకట్టుకున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్షణుడిగా రవీ దూబే కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించి ఔరా అనిపించారు. రాముడిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం, లక్షణుడు ఆమె ముక్కు కోసే సన్నివేశాలు ప్రత్యేకంగా నిలిచాయి. 'ప్రతీకారం తీర్చుకుంటాను శూర్పణఖ.. రాముడికి జరిగే అవమానం ఘోరంగా ఉంటుంది' అంటూ యశ్ చెప్పే డైలాగ్‌తో రామ-రావణ యుద్ధం ఎంత భీకరంగా ఉంటుందో ట్రైలర్‌లో హింట్ ఇచ్చారు దర్శకుడు. ఇక ట్రైలర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన మరో విషయం.. నేపథ్య సంగీతం.. ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో పాటు ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం సినిమా స్థాయిని మరింత పెంచేలా ఉంది. విజువల్స్‌కు తగ్గట్టుగా వినిపించిన సంగీతం.. ప్రతి సన్నివేశానికి వీక్షకులు లీనమయ్యేలా ఉంది. 'రామాయణ' ట్రైలర్ కేవలం ఓ సినిమా ప్రమోషన్‌లా కాకుండా భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ స్థాయిలో ఆవిష్కరించే మహత్తర సినీ ప్రయాణానికి నాందిగా నిలిచింది. మొదటి భాగం ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌లో విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి రూ.4000 కోట్ల బ్జడెట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. రామానంద్ సాగర్ ఆవిష్కరించిన ధారావాహికలో రాముడిగా కనువిందు చేసిన అరుణ్ గోవిల్ ఇప్పుడు దశరథుడిగా నటిస్తున్నారు. సీబా చద్దా.. మంధర పాత్ర పోషిస్తుండగా, శిశిర్ శర్మ వశిష్ఠ మహర్షిగా, అజింక్య దేవ్ విశ్వామిత్ర మహర్షిగా చేస్తున్నారు.

# సూర్య 47 దీపావళి బరికోసం సిద్ధం



తమిళ స్టార్ హీరో సూర్యకు ఇప్పటికే వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య47' షూటింగ్‌ను పూర్తి చేశారు. చిత్రబృందం విడుదల చేసిన బీహైండ్ ది సీన్స్ వీడియోతో షూటింగ్ ముగిసిన విషయాన్ని అధికారికంగా వెల్లడించగా, ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీపై ఆసక్తికర చర్చ మొదలైంది. అందుతున్న సమాచారం ప్రకారం, 'సూర్య47'ను ఈ దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే సూర్యకు ఇది వరుసగా మూడో థియేట్రికల్ విడుదలగా నిలవనుంది. ఇప్పటికే 'కరుప్పు'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఆగస్టు 14న వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆ సినిమా విడుదలైన కొద్ది నెలలకే 'సూర్య47' కూడా థియేటర్లలోకి వస్తే, ఒకే ఏడాదిలో వరుసగా మూడు సినిమాలతో అభిమానులను అలరించిన హీరోగా సూర్య నిలుస్తారు. అయితే దీపావళి బరిలో వెట్రిమారన్ దర్శకత్వంలో సిలంబరసన్ టి.ఆర్ నటిస్తున్న 'అరసన్' కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.

## మరో లవ్ గ్రాక మూవీ

# శ్రీనివాస మంగాపురం

## ఆకట్టుకున్న జయకృష్ణ, రాషా తండానీ నటన

ఘట్టమనేని కుటుంబం నుంచి యువ హీరోగా పరిచయమవుతున్న జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ కూతురు రాషా తడాని జంటగా నటించిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', మంగళవారం వంటి సంచలన చిత్రాల తర్వాత దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. మోహన్ బాబు, శ్యామ్, బ్రహ్మాజీ వంటి హేమాహేమీలు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగు పెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్)గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ. దర్శకుడు అజయ్ భూపతి కూడా 'శ్రీనివాస మంగాపురం' కోసం ఇదే రొటీన్ మాస్ కమర్షియల్ బాటపట్టారు. స్టోరీ పరంగా పెద్దగా కొత్తదనం లేకపోయినా.. విలన్ క్రూరత్వం, హీరోయిన్ వెనక హీరో పడే లవ్ ట్రాక్, మధ్య మధ్యలో వచ్చే పాటలతో ప్రథమార్థం సాగిపోతుంది. జై కృష్ణ తన డాన్సులతో అలరించగా, నరేష్, బ్రహ్మాజీల కామెడీ మంచి రిలాక్సేషన్ ఇస్తుంది. ద్వితీయార్థంలో వచ్చే ప్లాష్‌బ్యాక్, హీరో హీరోయిన్ల అసలు కథ, యాక్షన్ సీక్వెన్సెస్ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాయి. తన గత చిత్రాల తరహాలో కాకుండా, అజయ్ భూపతి ఎలాంటి రిస్క్ తీసుకోకుండా పూర్తిగా 'సేఫ్ గేమ్' ఆడేశారు. పకడ్బందీ స్క్రీన్ ప్లే, బలమైన క్యారెక్టరైజేషన్స్‌పై మరికాస్త దృష్టి పెట్టి ఉంటే ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మరో స్థాయిలో ఉండేది. జయకృష్ణ, రాషా తడాని తమ తొలి సినిమాతోనే అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. ముఖ్యంగా జయకృష్ణ ఎమోషనల్ సన్నివేశాల్లో మంచి పరిణతి చూపించాడు. డాన్సులు, యాక్షన్ సీక్వెన్స్ లలోనూ ఆకట్టుకున్నాడు. రాషా తడాని కూడా తన అందం, అభినయంతో తొలి చిత్రంతోనే మంచి మార్కులు కొట్టేసింది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకే హైలైట్‌గా నిలిచింది. మోహన్ బాబు తన సీనియారిటీతో, పవర్ ఫుల్ ఇంటెన్సిటీతో పాత్రకు పూర్తి వన్యాయం చేశారు. కిక్ శ్యామ్, అజయ్ తమ విలనిజంతో సినిమాను నిలబెట్టగా.. బ్రహ్మాజీ, నరేష్‌ల కామెడీ అక్కడక్కడా నవ్విస్తుంది. దర్శకుడు అజయ్ భూపతి ఎంచుకున్న లవ్ అండ్ ఫ్యాక్షన్ బ్యాక్‌డ్రాప్ బాగుంది. సంగీత దర్శకుడు జీవి ప్రకాష్ కుమార్ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమా స్థాయిని పెంచాయి. ముఖ్యంగా స్క్రీన్ పై పాటలు మరింత రిచ్‌గా కనిపిస్తాయి.


సినిమా సింగిడి
Cinma Singidi

శుక్రవారం
31-7-2026

singidinews@gmail.com



Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090